1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 8
సంచిక : 10
పుటలు : 52
రు. 25 లు
ISSN NO:
2582-8738

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

జనవరి 2023

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in

తెలుగుజాతిలో
ఆత్మాభిమానం
రగిలించడానికై
సాటిలేని కృషిచేసిన
'ఆంధ్రపితామహుడు'
మాడపాటి
హనుమంతరావు



తెలంగాణాలో
ఆంధ్రమహాసభ
నేతగా పలురీతుల్లో
ఉద్యమాలను
నిర్మాణం చేసిన
తెలుగుజాతి
వైతాళికుడు





తెలుగు భాషోద్యమానికి సరికొత్త కార్యక్రమాన్ని ప్రకటిద్దాం
2023 ఫిబ్రవరి 21న విజయవాడకు తరలిరండి



# అందరికీ ఆహ్వానం



## 2023 ఫిబ్రవరి 21 మంగళవారం

## విజయవాడలో మహాసభ

### అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం

### ఎల్ల నాడుల అమ్మనుడుల పండుగే కాదు.,

### తెలుగు భాషోద్యమ సమాఖ్య 21వ పుట్టినరోజు కూడా.

ఈ సందర్భంగా ఉదయం గం.10 నుండి జరిగే సదస్సుల్లో చర్చల అనంతరం తెలుగు భాషోద్యమానికి సరికొత్త కార్యక్రమాన్ని ప్రకటించుకుందాం.

తెలుగు భాషోద్యమ సమాఖ్య, తెలుగుజాతి (ట్రస్టు), అమ్మనుడి మాసపత్రికలకు ఒక సమగ్రమైన వలగూడు (వెబ్‌సైట్)ను ప్రారంభించుకుందాం.

**రాజకీయపార్టీలు, రాష్ట్రం, కులం, మతం భేదాలు లేకుండా తెలుగు భాషోద్యమంతో కలసి నడిచేవారందరికీ ఆహ్వానం**

అన్ని మాతృభాషలనూ రక్షించుకోవాలి. ఎవరి అమ్మభాషను వారు కాపాడుకోవాలి. ఎవరి భాషను వారు శక్తిమంతం చేసుకోవాలి. పరిపాలనలోనూ, పాఠశాలలోనూ మాతృభాషతోనే ముందుకు సాగాలి. అవసరమైన ఏ ఇతర భాషనైనా ఒక భాషగానే నేర్చుకోవాలి; ప్రాథమిక స్థాయిలో బోధనామాధ్యమంగా ఇతర భాషలు తగవు. తెలుగు రాష్ట్రాలున్నది తెలుగులో పాలించుకోవడానికే. 'మన భాషలో పాలించకోలేకపోతే, మన భాషలో చదువుకోలేకపోతే ఈ రెండు తెలుగు రాష్ట్రాలూ ఎందుకు ఉన్నట్లు?'

**వాడకపోతే భాష నశిస్తుంది. భాష నశిస్తే జాతి నశిస్తుంది.**

వివిధ రంగాల ప్రముఖులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, కళాశాలల, యూనివర్సిటీల ముఖ్యులు, రచయితలు, కళాకారులు, సామాజిక నేతలు, అభ్యుదయవాదులు, జాతీయవాదులు, ప్రజాస్వామ్యవాదులు, మహిళా సంఘాలు అందరూ పాల్గొనండి. అందరికీ ఇదే ఆహ్వానం


డా॥ చుక్క రామయ్య
గౌరవాధ్యక్షుడు

డా॥ సామల రమేష్‌బాబు
గౌరవాధ్యక్షుడు
ఫోన్: 9848016136

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
అధ్యక్షుడు
ఫోన్: 9866128846

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...

◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...

◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి






జనవరి 2023


### రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4.** హామీపత్రం తప్పనిసరి: **రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. హామీ పత్రంలేని రచనలను, ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.**

### లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **ఇవీ సంగతులు:** | | | **06** |
| **సంపాదక హృదయం:** | తెలుగు భాషోద్యమానికి సరికొత్త కార్యక్రమాన్ని ప్రకటిద్దాం | | **07** |
| **భాషాశాస్త్రజ్ఞుల సమావేశం:** | 44వ భారతీయ భాషా.... | **గారపాటి ఉమామహేశ్వరరావు** | **11** |
| **ముఖచిత్రకథనం:** | ఆంధ్రపితామహుడు మాడపాటి.. | **కుర్రా జితేంద్రబాబు** | **13** |
| **సాంకేతికత:** | సాంస్కృతిక రక్షణలో సెమాంటిక్ వెబ్ | **శ్రీగణేష్ తొట్టెంపూడి** | **22** |
| **ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు:** | | | **23** |
| **మరుపురాని నేత:** | ప్రజల భాషలో పాలించిన... | **కె.యస్.బి.వి.కె.శివరావు** | **32** |
| **తెలంగాణ మాండలికం:** | శిమాంట శిమాంట... | **బూర్ల వేంకటేశ్వర్లు** | **36** |
| **పొరుగు తెలుగు:** | భిలాయి ప్రవాసాంధ్ర సాహితీ విమర్శకుడు.. | **బద్రి కూర్మారావు** | **37** |
| **బాలసాహిత్యం:** | బాలసాహిత్యం-కథలు | **టి.వి.రామకృష్ణ** | **39** |
| **వారసత్వ సంపద:** | 'ఇతిహాసపుటట్టడుగున పడిఉన్న.. | **పి. శివరామకృష్ణ 'శక్తి'** | **42** |
| **అభినందన:** | 2022 కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన... | | **47** |
| **పుస్తక పరిచయం:** | 'సుబ్బయ్యగారి మేడ' | **పోతుకూచి కుమార్** | **49** |
| **ధారావాహిక:** | అడుగుజాడలు-ఆనవాళ్లు-20 | **ఈమని శివనాగిరెడ్డి** | **44** |
| **కవిత:** | నీ వల్లే | **లక్ష్మీ శ్రీనివాస్** | **38** |
| | పాదయాత్ర | **కంచరాన భుజంగరావు** | **48** |


| ముఖచిత్రం | కార్టూన్లు | కంప్యూటర్ |
|---|---|---|
| **'హాస్యానందం' రాము** | **సరసి** | **బందారు రఘురాం** |

ammanudi.org **వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదువగలరు**

**రచనలను, వార్తలను, వాట్సాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా editorammanudi@gmail.com కు పంపించండి. – సంపాదకుడు**


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

**చందా వివరాలు: జీవిత చందా: రూ.5000**

**4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300**

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94404 48244, 94929 80244,
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

### గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

## తెలుగుజాతి(ట్రస్టు) ప్రచురణ

# 33వ ‘విజయవాడ పుస్తక మహోత్సవం’

**2023 ఫిబ్రవరి 9నుండి 19వరకు:**

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో (డా॥ రమేష్ హాస్పటల్స్ ఎదురుగా)

## తెలుగుజాతి (ట్రస్టు) ‘అమ్మనుడి’ పత్రిక స్టాల్‌ను దర్శించండి










**4 సం॥ చందా: రూ.1000**

**1 సం॥ చందా: రూ.300**

## అమ్మనుడి చందాను స్టాల్‌లో చెల్లించి రసీదు తీసుకోండి

## ఈ క్రింది పుస్తకములు 10% రాయితీతో స్టాల్‌లో లభిస్తాయి



రు.200


రు.100



రు.300



రు.99



రు.200




# ఇవీ సంగతులు...

### తెలుగు భాష గొప్పతనాన్ని శ్లాఘించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

దేశ భాష లందు తెలుగు భాష గొప్పతనాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శ్లాఘించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి విజయవాడ పోరంకిలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్ నందు ప్రభుత్వం ఆధ్వర్యంలో పౌర సత్కారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ..దేశ భాషలందు తెలుగు లెస్స .. అందరికీ నమస్కారం.. మీ అభిమానానికి ధన్యవాదాలు అని తెలుగులో పేర్కొన్నారు. తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి ఉండే ఈ నేలపై అడుగు పెట్టడం ఆనందంగా ఉందని అన్నారు. నాగార్జునుడు అమరావతిలో చేసిన బోధనలు చాలా గొప్పవని అన్నారు.

### అమెరికా గ్రంథాలయాలలో తెలుగు పుస్తకాలు

అమెరికాలో ఆరు రాష్ట్రాల సమ్మేళనం న్యూ ఇంగ్లాండ్ ప్రాంతం, ఆ న్యూ ఇంగ్లండ్‌లో, 'తానా' వారి "అమెరికా లైబ్రరీలలో తెలుగు పుస్తకాలు" కార్యక్రమం ద్వారా శ్రీకారం చుట్టారు, ఈ కార్యక్రమంతో కొత్త తరానికి నాంది పలికారు,.

ఈ కార్యక్రమంలో భాగంగా తానా బోస్టన్ సమీపంలో ఉన్న వెస్ట్‌బరో లైబ్రరీకి అనేక పుస్తకాలను అందించింది.

ఆంగ్ల తెలుగు నిఘంటువు, వేమన పద్యాలు, చందమామ కథలు, పెద్ద బాల శిక్ష మరియు మరెన్నో పుస్తకాలను పంపిణీ చేశారు, భవిష్యత్తులో న్యూ ఇంగ్లాండ్‌లో తెలుగు పుస్తకాలు అనేక లైబ్రరీలలో తానా అందుబాటులోకి తెస్తుంది.

### హస్‌బ్రో ఆటలు ఇక తెలుగులో

ప్రపంచవ్యాప్తంగా అందరూ ఆడుకునే పలక ఆటల్లో మోనోపోలీ బాగా పేరున్నది. ఆ మోనోపోలీ ఆటను రూపొందించిన సంస్థ హస్‌బ్రో ఇప్పుడు ఆ ఆటను, దానితో పాటుగా గేం ఆఫ్ లైఫ్ ఆటను, మొనోపోలీ డీల్ ఆటను తెలుగులో అందించనుంది.

### మాతృభాషలో చదువుల వల్ల విద్యార్థులకు సృజన శక్తి, నైపుణ్యాలు, సాధికారత : అమిత్‌షా, ధర్మేంద్రప్రధాన్

మాతృభాషలో చదువులుంటే విద్యార్థుల సృజనశక్తి పెరుగుతుందని, నైపుణ్యాలు మెరుగవుతాయని కేంద్ర హోమ్ శాఖా మంత్రి అమిత్‌షా గుజరాత్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అన్నారు.

మన జనజాతుల సశక్తీకరణకు మాతృభాషలో/ప్రాంతీయభాషలో చదువులు ముఖ్యమని కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ అన్నారు.

### తెలుగు భాషాభివృద్ధికి రూ.5.28 కోట్లు

ప్రాచీన భాషల అభివృద్ధిలో భాగంగా నాలుగేళ్లలో తమిళానికి రూ.43.70 కోట్లు, తెలుగుకు రూ.5.28 కోట్లు కన్నడకు రూ. 4.93 కోట్లు, మలయాళానికి రూ. 2.58 కోట్లు, ఒడియాకు 2.43 కోట్లు కేటాయించినట్లు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. రాజ్యసభలో ఓ ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

### యోగి వేమన జయంతోత్సవాలు
#### ప్రతి ఏటా జనవరి 19న జరపనున్న రాష్ట్ర ప్రభుత్వం

కవి యోగి వేమన జయంతిని 2023 నుంచి ప్రతి సంవత్సరం జనవరి 19న రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనికి సంబంధించి ప్రిన్సిపల్ సెక్రటరీ రేవు ముత్యాలరాజు శుక్రవారం జిఓ ఎంఎస్ 164 ను విడుదల చేశారు. యోగి వేమన జయంతిని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించాలని సచివాలయంలోని అన్ని శాఖలు, అన్ని శాఖాధిపతులు, కలెక్టర్‌లకు ముత్యాల రాజు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సంవత్సరం జనవరి 19వ తేదీన తమకి కేటాయించిన బడ్జెట్‌లో నుండి ఖర్చులను అందజేసే విధంగా నిర్వహించాలని సూచించారు. యోగి వేమన జయంతిని జరుపుకోవడానికి అవసరమైన మార్గదర్శకాలను సిద్ధం చేయాలని మరియు వాటిని సంబంధితులందరికీ పంపిణీ చేయాలని యువజన అభివృద్ధి, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖను ఆయన ఈ సందర్భంగా ఆదేశించారు.

వేమనను తెలుగుజాతి కవిగా గుర్తించి ప్రభుత్వం తగిన కార్యక్రమాలు చేపట్టాలని- 2007లో తిరుపతిలో జరిగిన తెలుగుభాషా బ్రహోత్సవాల సందర్భంగా నాటి తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రధాన కార్యదర్శి డా. సామల రమేష్‌బాబు టిటిడి పాలకమండలి అధ్యక్షుడు శ్రీ భూమన కరుణాకరరెడ్డి ప్రభుత్వాన్ని కోరుతూ వేదిక పై నుండి ప్రకటించారని దానిపై అప్పట్లో పెద్ద బహిరంగ చర్చే జరిగిందని ఈ సందర్భంగా మనం గుర్తుచేసుకోవచ్చు.

### హైదరాబాద్ లో ఘనంగా జరిగిన ' తానా కళారాధన' !

డిసెంబర్ 16న సాయంత్రం 'తానా కళారాధన' పేరిట తెలుగు సినీ రంగంలో విశేష కృషి చేసిన సీనియర్స్ కి సన్మాన కార్యక్రమం హైదరాబాద్ శిల్ప కళా వేదిక పై ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు ముఖ్యఅతిధిగా విచ్చేసి సినిమా లెజెండ్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాటి సినీ నటీనటులు కృష్ణవేణి, నటులు కోట శ్రీనివాసరావు, మురళీమోహన్, గిరిబాబు, గాయని సుశీల, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, దర్శకుడు కోదండరామిరెడ్డితోపాటు గాయని సునీత, మాజీ ఎంపి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఏపీకి రూ.867 కోట్ల ఎస్ఎస్ఏ నిధులు

పాఠశాల భవనాల మరమ్మతులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కింద ఆంధ్రప్రదేశ్‌కు ఈ ఏడాది డిసెంబరు 15 పాటిరి రూ. 867.40 కోట్లు విడుదల చేయగా రూ.823.09 కోట్లు ఖర్చు చేశారని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణాదేవి తెలిపారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఎస్ఎస్ఏ కింద దేశంలో1,20,164 ఐసీటీ ల్యాబులు, 82,120 స్మార్ట్ తరగతి గదులు, ఉపాధ్యాయులకు 14,90,305 ట్యాబ్‌లు మంజూరు చేసినట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల ఆయోధ్యరామిరెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

సంపాదకీయం

## తెలుగు భాషోద్యమానికి సరికొత్త కార్యక్రమాన్ని ప్రకటిద్దాం
## 2023 ఫిబ్రవరి 21న విజయవాడకు తరలిరండి

**2**003 ఫిబ్రవరి 21న తెలుగు భాషోద్యమ సమాఖ్యను స్థాపించినప్పటి నుండి కొన్ని స్పష్టమైన డిమాండ్‌లను ముందుకు తెచ్చి, వాటి సాధన కోసం పోరాడుతూనే ఉంది. అందులో ఒకటి తెలుగు కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పరచి, దానితోపాటు, స్వతంత్రప్రతిపత్తితో తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పరచాలనేది. ఈ కోరికను చిత్తశుద్ధితో తీర్చితే– తెలుగు మూడుపువ్వులూ ఆరుకాయలుగా వర్ధిల్లుతుందని భాషోద్యమకారులు, ప్రజలూ ఎంతో ఆశ పెట్టుకొన్నారు. ఇందుకోసం కొన్నేళ్లపాటు ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చిన సమాఖ్య, దీనితోపాటు మరికొన్ని ముఖ్యమైన నిక్కచ్చు(డిమాండ్)లను కూడా చేర్చి 9 అంశాలపై ఒక నిరంతర ఉద్యమాన్ని చేపట్టి, అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవమైన ఫిబ్రవరి 21, తెలుగు భాషాదినోత్సవమైన ఆగస్టు 29 తేదీలలో నిరసన, నిరాహారదీక్షా శిబిరాలను నిర్వహించి ప్రభుత్వాల్లో, ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు కృషి చేసింది.

ఈ ఉద్యమంలో 2012 సంవత్సరం కీలకమైంది. అదే ఏడు ఫిబ్రవరి 21న ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదులో ధర్నా చౌక్‌లో పెద్ద ఎత్తున రోజంతా నిరసన దీక్షను నిర్వహించింది. దానికి అధికార, ప్రతిపక్ష రాజకీయ నేతలందరినీ ఆహ్వానించింది. అప్పుడు ఉన్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం. ముఖ్యమంత్రి తప్ప పార్టీ ప్రముఖులు, ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు గారు, వామపక్ష ప్రముఖనేతలు, బిజెపి నేత దత్తాత్రేయగారు అందరూ పాల్గొని డిమాండ్లను బలపర్చుతూ మాట్లాడారు. చంద్రబాబు నాయుడు గారైతే తాము అధికారంలోకి రాగానే అన్నింటినీ అమలు చేస్తామని, తమ పార్టీ 'తెలుగుదేశం' తెలుగుజాతి కోసమే పుట్టిందనీ చాలా గంభీరంగా మాట్లాడారు! అప్పటికి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జోరందుకుంటోంది. ఆగస్టు 29 తెలుగు భాషాదినోత్సవం నాటికి అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి గిడుగు రామమూర్తి గారు జ్ఞాపకం వచ్చారు. తెలుగును ఉద్ధరించుకోవాలనే సంకల్పంతోనే తాము ఉన్నట్లు ప్రకటించుకొని, రవీంద్రభారతి ప్రాంగణంలో సభను పెట్టి, తెలుగు భాషోద్యమ ప్రముఖులకు సన్మానాలు ప్రకటించారు. ఆ పురస్కారాలను చేకూరి రామారావు, ఎబికె ప్రసాద్, సి.ధర్మారావు, సామల రమేష్‌బాబు, పోరంకి దక్షిణామూర్తి, స.వెం. రమేశ్‌లు తిరస్కరించారు. సభలో అత్యధికులు నిరసన ప్రకటిస్తూ లేచి నినాదాలు చేశారు. పోలీసులు ప్రత్యక్షం. సభ రసాభాస! అక్కడి నుండి సాగిన ప్రజాచైతన్యోద్యమంలో రాష్ట్రమంతటా అనేక ప్రాంతాల్లో సభలు, నిరసనలు జరిగాయి. ప్రభుత్వానిది పాత ఆలోచనే. ఏదోవిధంగా ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించాలని! దానితో భాషోద్యమకారులు శాంతిస్తారని!

తెలుగు భాషా సాహిత్యాలకు, సంస్కృతికీ సంబంధించి ప్రజల్లో అభిమానాన్ని, ఆదరణను పొందిన కాంగ్రెస్ నేత బుద్ధప్రసాద్ గారిని అధికారభాషా సంఘానికి అధ్యక్షుడుగా నియమించి, వారికి ప్రపంచ మహా సభలను నిర్వహించే బాధ్యతను అప్పగించింది. పరిణామాలను నిశితంగా గమనించిన సమాఖ్య నాయకత్వం ఉద్యమాన్ని మరింత శ్రద్ధగా నిర్మాణం చేసింది. 9 డిమాండ్లను ఆమోదించాలని పట్టుబట్టింది. సభలకు హాజరై తీర్మానాలను ప్రతిపాదించి ఆమోదం పొందవచ్చుననీ ఆ తర్వాత తామే సానుకూల చర్యలు తీసుకొంటామని అధికారభాషా సంఘం అధ్యక్షులు కోరారు. కనీసం 3 డిమాండ్లనైనా వెంటనే ఆమోదించాలని సమాఖ్య పట్టుబట్టగా అందుకు ప్రభుత్వం తిరస్కరించింది. సమాజంలో అనేకమంది ప్రముఖులను, సమాఖ్య అధ్యక్షుడు స్వయంగా కలసి వివరించాడు. పత్రికల ముఖ్యులకు తెలియజెప్పాడు. చివరకు ప్రపంచ సభలకు నిరసన ప్రకటించి తిరుపతిలోనే నిరసన తెలపాలని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసనోద్యమం సాగించాలని నిర్ణయించింది. ముందుగా ముఖ్యమంత్రిగారిని ఉద్దేశించి ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది(దాని పూర్తి పాఠాన్ని 9,10 పుటలలో చూడండి.) చివరిగా ఇద్దరు పరపతిగల ప్రభుత్వాధికారుల సహాయంతో ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారిని సమాఖ్య అధ్యక్షుడు కలుసుకొని వినతి పత్రాన్ని సమర్పించి, కనీసం మూడు డిమాండ్లను ఆమోదించితే

ఉద్యమాన్ని ఆపి, సభలలో పాల్గొంటామని విన్నవించాం. కనీసం ఒక్క కోరికను కూడా సభలకు ముందుగా ఆమోదించడానికి వారు తిరస్కరించారు. దానితో వారికొక నమస్కారం చేసి, ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెప్పి సమాఖ్య అధ్యక్షుడు బయటకు వచ్చాడు. ప్రకటించిన విధంగా ఉద్యమ కార్యక్రమాన్ని సాగించింది సమాఖ్య. సభలను బహిష్కరించింది. దిగివచ్చిన ప్రభుత్వం తొలిరోజు సభలోనే కొన్ని వాగ్దానాలను ప్రకటించింది. వాటిని తీర్మానాలుగా ప్రకటించాలని కోరుతూ సమాఖ్య అధ్యక్షుడు ఆరోజే వినతి పత్రం పంపించాడు. మూడవ రోజు ముగింపు సభలో తీర్మానాలను ప్రకటించింది ప్రభుత్వం. అందులో కొన్ని లోటుపాట్లు, దాటివేతలు ఉన్నాయనుకోండి, అయితే ప్రభుత్వం నుంచి సరైన ఉత్తర్వులు వెలువడడానికి సంవత్సరం పట్టింది!

ఆ తర్వాత ఆ ఉత్తర్వులను అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వాలు ముందుకు సాగుతున్న దశలోనే రాష్ట్ర విభజన, రాజకీయాల ఫలితంగా రెండు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలూ చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించడంతో దాదాపు అంతా పూర్వపు స్థితికి వచ్చింది. బడ్జెట్ కేటాయింపు లేకుండా, సాంస్కృతిక శాఖలో భాగంగా తెలుగు మంత్రిత్వశాఖ ఏర్పడింది. మెల్లగా ఆ శాఖ పేరుకు మిగిలింది. ఇప్పుడైతే ఆంధ్రప్రదేశ్‌లో పేరుకు కూడా లేకుండా తుడిచిపెట్టుకుపోయింది. తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థను ఒక చట్టం ద్వారా ఏర్పాటు చేస్తామని చట్టసభలో ప్రకటించిన చంద్రబాబు నాయుడు మాట తప్పి మొక్కుబడిగా ఒక జి.ఒ.ద్వారా ఆ సంస్థను ప్రకటించారు. కాని దాన్ని ఏర్పరచే లోపే ఎన్నికలు జరిగి ప్రభుత్వంలోకి వైఎస్సార్ కాంగ్రెస్ వచ్చింది. మొత్తం విధానాలు మారిపోయాయి. పేరుకు మాత్రమే తెలుగును ఒక భాషగా పాఠశాలల్లో నేర్పుతున్నామంటున్నారు. తెలుగు మాధ్యమమే పనికిరాదంటున్నారు. అన్ని విధాలా తెలుగును అణగదొక్కుతున్నారు. చివరకు– బోధనలో, పాలనలో మాతృభాష తెలుగుకు పట్టిన అధోగతినీ, ప్రభుత్వాల ప్రజాస్వామ్య విరుద్ధ ధోరణినీ ప్రశ్నిస్తూ ప్రజలు కోర్టుల్లో యుద్ధం చెయ్యవలసి వస్తున్నది. ప్రభుత్వాల ఈ ధోరణిని ఇలాగే కొనసాగనిస్తే త్వరలోనే అన్ని విధాలా తెలుగుజాతి అస్తిత్వమే ప్రశ్నార్థకమయ్యే స్థితిరావచ్చు. అన్ని విధాలా ప్రపంచ చరిత్రలో తెలుగువారి స్థాయి అట్టడుగుకు దిగజారిపోయే రోజులు రావచ్చు.

చాలా విషయాలను స్థల పరిమితి వల్ల ఇక్కడ ప్రస్తావించలేదు. ఈ పత్రికనూ, దీనికంటె ముందు 'నడుస్తున్న చరిత్ర'ను చదివిన వారందరికీ ఈ సంగతులు తెలుసు. తెలుగు భాషోద్యమ సమాఖ్య కార్యకర్తలకు ఏ పార్టీపైనా ద్వేషం ఉండదు. శతృత్వం అసలే ఉండదు. తెలుగును అన్ని రంగాల్లో సమున్నతం చెయ్యడమే దాని పని. ఇందుకు ఎవరిని ఎదుర్కోవలసినా తెలుగు భాషోద్యమ సమాఖ్య వెనుకడుగు వెయ్యదు. తన ఆశయాదర్శాల సాధనకోసం అందరి సహకారాన్ని కోరుతుంది. ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ పరిస్థితులు భయంకరంగా తయారైనాయి. రెండు ప్రభుత్వాలూ తాము ఏ భాషాప్రాతిపదికపైనైతే ఏర్పడ్డాయో, తాము ఎవరి ఓట్లతో అధికారంలోకొచ్చామో మరిచిపోయి, తమ క్రింద గొయ్యిని తామే తవ్వుకొంటున్నాయి. ఉద్యమకారులు మిన్నకుండా ఉంటారని అనుకోవద్దు. కాలం ఎలా సాగినా ప్రజలతో ఉద్యమకారులూ, ఉద్యమకారులతో ప్రజలూ కలిసే ఉంటారు. అది అధికార వర్గాలకు అర్థం కాకపోవచ్చు. అనుభవంలోకి వస్తేగాని తత్వం బోధపడదుగదా!

కాలమాన పరిస్థితుల వల్ల కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్నా, ఉద్యమకారులు మౌనంగా ఉంటారని ఎవరైనా అనుకుంటే వారు భ్రమలో ఉన్నట్లే. పదేళ్లనాటికీ ఇప్పటికీ పరిస్థితులు మలుపులు తిరగడమే కాదు, ముదులు పద్దాయి కూడా. దీన్నంతా అందరం కలిసి చర్చించాలి. నేటి అవసరాలను తిరిగి నిర్వచించుకోవాలి. వ్యూహాలను, కార్యక్రమాలను రూపొందించుకోవాలి. ప్రజల్లోకి, జనమాధ్యమాల్లోకి వెళ్లాలి. ఇందుకు తగిన ఉద్యమ నిర్మాణం జరుగుతూనే ఉంది. అది తగిన విధంగా ప్రదర్శితమవుతుంది.

రండి.. మళ్లీ ఫిబ్రవరి 21 వచ్చేస్తోంది. ఆ రోజున విజయవాడలో జరగబోయే బృహత్ కార్యక్రమంలో భాగస్వాములు కండి. కొత్త చరిత్ర నిర్మాణంలో పాలుపంచుకోండి. ఇప్పుడు ఉద్యమం విద్యావంతుల చేతుల్లోకి, విద్యార్థుల చేతుల్లోకి రావాలి. ఆధునికతను సంతరించుకుంటూ సమస్యల పరిష్కారానికి అందరినీ కూడగట్టుకొంటూ ముందుకు సాగుదాం.

31-12-2022

సామల రమేష్‌బాబు

# ముఖ్యమంత్రికి తెలుగు భాషోద్యమ సమాఖ్య బహిరంగ లేఖ




ఆగస్టు 28 ఉదయం గం.11.30 కు హైదరాబాదులోని ఎన్.ఎస్.ఎస్. ప్రెస్ క్లబ్లో జరిగిన పత్రికా ప్రసార మాధ్యమాల సమావేశంలో తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షులు డా॥ చుక్కా రామయ్య, అధ్యక్షులు డా॥ సామల రమేష్‌బాబు, తెలంగాణ ప్రాంత కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కోటిపల్లి సుబ్బారావు పాల్గొని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిగారికి బహిరంగ లేఖను విడుదల చేశారు. దాని పూర్తి పాఠం ఇది :

## ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి గారికి

## బహిరంగలేఖ

హైదరాబాదు 28, ఆగస్టు 2012

అయ్యా,

కైమోడ్పులు

నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలను తిరుపతిలో 2012, డిసెంబరులో జరపాలని మీ ప్రభుత్వం నిర్ణయించిన సందర్భంలో మేము తమకు ఈ లేఖను రాస్తున్నాము. దయచేసి ఇందలి అంశాలను సావధానంగా పరిశీలించగోరుతున్నాము.

1975 ఉగాదికి హైదరాబాదులో తొలి ప్రపంచ తెలుగు మహాసభలను వారం రోజులపాటు నాటి ప్రభుత్వం చారిత్రాత్మకంగా నిర్వహించింది. ప్రతి రెండేళ్లకు తెలుగు ఉగాది సందర్భంగా ప్రపంచ తెలుగు ప్రతినిధులతో ఈ పండుగను జరుపుకోవాలన్న పెద్దల నిర్ణయం ఆ తర్వాత అమలు కాకుండాపోయింది. మళ్లీ 1981లో కౌలాలంపూర్లో 5 రోజులు, 1990లో మారిషస్‌లో నాలుగు రోజులు 2వ, 3వ మహాసభలను నిర్వహించిన అవి లాంఛనంగా ముగిసిపోయాయి. 22 ఏళ్లపాటు పట్టించుకోని ప్రభుత్వం ఉన్నట్లుండి ఇప్పుడు 3 రోజులపాటు ఈ మహాసభలను హడావుడిగా జరపాలని తలపెట్టడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ఇందువల్ల తెలుగు భాషాజాతికి ఏ ప్రయోజనాలు సమకూడగలవని ప్రభుత్వం ఆశిస్తున్నదో అంతుపట్టకుండా ఉన్నది. ఈ సందర్భంగా ఎంతో ముఖ్యమైన అంశాలను తమ దృష్టికి తేదలుచుకున్నాము. మనది పేరుకే తెలుగు రాష్ట్రం కానీ తెలుగుపట్ల మన పాలకులకు ఏమాత్రం శ్రద్ధలేదు. ప్రజల భాషలోనే పరిపాలించాలనే కనీస ప్రజాస్వామిక లక్షణాన్ని కోల్పోయిన మన ప్రభుత్వాలు విద్యారంగంతో సహా అన్ని రంగాల్లో తెలుగును అణగ ద్రొక్కుతున్నాయి. అధికారభాషా కమిషన్ పేరుతో ఎటువంటి అధికారాలూ లేని ఒక సలహా సంఘం మాత్రం ఉంది. అదొక రాజకీయ పునరావాస కేంద్రంగానే ఉంది. మూడేండ్లుగా దాన్నీ మూతమూసి ఉంచారు. తెలుగు అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయాలు ఏర్పడివున్నా వాటికి సరైన దిశలేక, పట్టించుకొనేవారు లేక చేవచచ్చి ఉన్నాయి. పేరుకొక అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఉంది. అది ఒక అసిస్టెంటు డైరెక్టరు, ఒక గుమాస్తాతో ఒక చిన్న గదిలో తెలుగు విశ్వవిద్యాలయంలో భాగంగా మూలుగుతూ ఉంది. ఎన్టీ రామారావుగారి హయాంలో రద్దయిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీతో సహా తక్కిన అకాడమీలకు మళ్లీ ప్రాణం పొయ్యనేలేదు. ప్రాథమిక స్థాయినుండి పై చదువులదాకా అన్నింటా తెలుగు అధ్వాన్న స్థితిలో ఉంది.

ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో తెలుగు రక్షణ, అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చెయ్యాలని, దానిక్రింద ఒక తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థను (డెవలెప్మెంట్ అథారిటీ) ఏర్పాటు చెయ్యాలని – తెలుగు భాషోద్యమకారులు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. కాని, తెలుగు కోసం ఏం చెయ్యడానికి ఇష్టపడని ప్రభుత్వానికి ప్రపంచ తెలుగు మహాసభలు జరిపే నైతిక

అర్హత ఏమాత్రం ఉండదని తెలుగు భాషోద్యమ సమాఖ్య భావిస్తున్నది. భాషాప్రయుక్త రాష్ట్రాల్లో మనదే మొదటిదని మనం గర్వంగా చెప్పుకుంటాం. మనతోపాటే కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలు భాషారాష్ట్రాలుగా ఏర్పడ్డాయి. 60 ఏళ్లుగా ఆ రాష్ట్రాలు తమ భాషల్ని రక్షించుకొంటూ, ఆధునికం చేసుకొంటూ గర్వంగా తల ఎత్తుకొని నిలబడ్డాయి. తమ భాషల అభివృద్ధికై ప్రత్యేకంగా ప్రాధికార సంస్థలను (డెవెలప్మెంట్ అధారిటీ)లను, ప్రత్యేక మంత్రిత్వ శాఖలను ఏర్పాటు చేసి, సమర్థులైన మంత్రులకు బాధ్యతలనప్పగించడమేకాకుండా, తమ భాషల అభివృద్ధిని తమ గౌరవ ప్రతిష్టలకేకాక, మనుగడకు సంబంధించిన అంశంగా తీసుకొని పని చేస్తున్నాయి. అందువల్ల గత రెండు దశాబ్దాల్లో ప్రపంచీకరణ వల్ల తమ భాషలకు ఎదురైన సవాళ్లను సమర్ధంగా తట్టుకోగలుగుతున్నాయి.

గనుక ప్రపంచ తెలుగు మహాసభలను జరిపే ముందుగా ఈ ప్రభుత్వానికి తెలుగు భాష, తెలుగుజాతి పట్ల శ్రద్ధాసక్తులను, చిత్తశుద్ధిని నిరూపించుకోవడంకోసం ఎన్నో ఏళ్లుగా తెలుగు భాషోద్యమం ప్రభుత్వం ముందుంచుతున్న డిమాండ్లను ఆమోదిస్తూ ప్రభుత్వం వెంటనే అధికార ప్రకటన చేయాలని వాటి అమలుకు తగిన ఉత్తర్వులను విడుదల చేయాలని కోరుతున్నాం.

1. తెలుగు భాష రక్షణ, అభివృద్ధికై ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖను, దానిక్రింద ఒక తెలుగు అభివృద్ధి సాధికార సంస్థను(డెవలప్మెంట్ అథారిటీ) తగినన్ని నిధులతో ఏర్పరచాలి. ఆ విధమైన డెవలెప్మెంట్ అధారిటీ, మరియు మంత్రిత్వశాఖ కర్నాటక, తమిళనాడులలో వారి భాషలకోసం ఎప్పటినుండో పని చేస్తున్నాయి.

2. రాష్ట్రంలో అన్ని స్థాయిల్లో అధికార భాషగా తెలుగును అమలు చెయ్యాలి. చట్టసభలు, ముఖ్యమంత్రి కార్యాలయం, సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల్లో ఎప్పటినుండి దీనిని అమలుచేస్తారో తేదీని ప్రకటించాలి. జిల్లాస్థాయి వరకు న్యాయస్థానాల్లో తెలుగులో వ్యవహారాలు జరిగేందుకు జి.ఒ.నెం. 485(1974) అమలుపరచేందుకు ప్రభుత్వపరంగా చొరవతీసుకోవాలి.

3. ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలన్నిటిలో మాతృభాషలోనే పాఠశాల విద్యను బోధించడాన్ని తప్పనిసరి చెయ్యాలి. ప్రాథమిక స్థాయి విద్యలో తెలుగు బోధనను పటిష్టం చెయ్యటానికై అర్హత పొందిన తెలుగు పండితులనే ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక పాఠశాలల్లో నియమించాలి. మొదటి తరగతి నుండి ఒక సబ్జెక్టుగా ఆంగ్లాన్ని బోధించాలి.

4. ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిల్లోనూ మెడికల్, ఇంజనీరింగ్ వంటి సాంకేతిక, వృత్తివిద్యాకోర్సులలోనూ రాష్ట్రంలో తెలుగు భాషను ఒక సబ్జెక్టుగా తప్పనిసరిచెయ్యాలి.

5. ఇతర రాష్ట్రాల్లోని తెలుగువారి విద్య, భాషాసంస్కృతుల రక్షణకై శాశ్వతస్థాయిన సంయుక్త సభాసంఘాన్ని అన్నివనరులతో ఏర్పరచాలి.

6. రాష్ట్రంలోని 9 కోట్ల మంది తెలుగు ప్రజలేకాక, రాష్ట్రం బయట ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో 9కోట్ల మంది తెలుగు ప్రజలున్నారు.వీరిలో తెలుగు భాషా సంస్కృతుల వ్యాప్తికోసం అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఒకటి మనకు ఉంది. కాని, దానిని తెలుగు విశ్వవిద్యాలయంలో ఒక గదిలో బంధించి, తగిన నిధులు ఇవ్వక ఎండబెడుతున్నారు. దానిని విశ్వవిద్యాలయం నుండి వేరుచేసి, స్వతంత్ర ప్రతిపత్తితో కనీసం 100కోట్ల నిధితో, మన గౌరవ ప్రతిష్ఠలను నిలబెట్టే విధంగా అభివృద్ధి పరచాలి.

7. ప్రభుత్వం నిర్వహించే అన్ని పోటీ పరీక్షల్లో తెలుగు తప్పనిసరి అర్హత పరీక్ష(కంపల్సరీ క్వాలిఫైయింగ్ ఎగ్జామ్)గా ఉండాలి. రాష్ట్ర సర్వీసుల నియామకాలలో తెలుగు మాధ్యమ అభ్యర్థులకు 5శాతం అదనపు మార్కులు కలపాలి.

8. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీని, రద్దయిన తక్కిన అకాడమీలను తిరిగి నెలకొల్పాలి.

9. ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో తెలుగు మాట్లాడటాన్ని నేరంగా పరిగణించి శిక్షలు వేయడం రాష్ట్రమంతటా ఒక అలవాటుగా మారింది. తెలుగుభాషను తక్కువ చూపుచూడడం, పలు రంగాలలో తెలుగును అవమానించడం సర్వసాధారణమైంది. వివిధ ప్రాంతాల మాండలికాలను, యాసలను హేళన చెయ్యడం, వక్రీకరించడం జరుగుతోంది. ఈ పరిస్థితిని నివారించి, తెలుగుభాషా సంస్కృతుల పట్ల గౌరవాన్ని ఇనుమడింపచేసేందుకు వెంటనే పటిష్టమైన చట్టాన్ని తీసుకురావాలి.

ఆగస్టు 29 తెలుగు భాషాదినోత్సవం నుండి రాష్ట్రవ్యాప్తంగా నెలరోజులపాటు ప్రజలలో ఈ అంశాలను ప్రచారంచేయాలని, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య నిర్ణయించింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తెలుగు భాషపట్ల తమ విధానమేదో ప్రకటించాలని, పైడిమాండ్లను వెంటనే ఆమోదించి, అధికార పూర్వకంగా ప్రకటించాలని కోరుతున్నాం.

**– తెలుగు భాషోద్యమ సమాఖ్య**

గారపాటి ఉమామహేశ్వరరావు
98661 28846

# 44వ భారతీయ భాషా శాస్త్రజ్ఞుల అంతర్జాతీయ సమావేశం

## నవంబర్ 24-26 తేదీలలో భువనేశ్వర్‌లోని
## సెంచూరియన్ టెక్నాలజీ, యాజమాన్య విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రారంభోత్సవ సభ వివరాలు.

(ప్రాథమిక సమాచారం, ఫొటోలు: డిసెంబరు సంచిక 3వ అట్టపై గలవు)

**కేం**ద్రీయ భారతీయ భాషా సంస్థ సంస్థాపక నిర్దేశకులు పద్మశ్రీ దేవీ ప్రసన్న పట్టనాయక్, సెంచూరియన్ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యుడు ప్రొ. ఓంకార్‌నాథ్ మొహంతి, సెంచూరియన్ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షురాలు డా. సుప్రియా పట్టనాయక్, భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘం అధ్యక్షుడు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు తదితరుల సమక్షంలో ఒడిశా గవర్నరు, గౌరవనీయులైన ఆచార్య శ్రీ గణేష్‌లాల్ గారు 2022, నవంబర్ 24వ తేదీన, భువనేశ్వర్‌లో జరిగిన 44వ భారతీయ భాషాశాస్త్రజ్ఞుల అంతర్జాతీయ సమావేశం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా చేసిన అధ్యక్షోపన్యాసంలో ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు సమావేశానికి విచ్చేసిన అందరికీ హృదయపూర్వక స్వాగతం తెలుపుతూ భారతీయ భాషాశాస్త్రజ్ఞుల (లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ ఇండియా) సమావేశం ఈ సంఘం చరిత్రలో ఒక ప్రత్యేకమైన రోజుగా పేర్కొన్నారు.




ప్రసంగిస్తున్న అధ్యక్షుడు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు

భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘం భారత ఉపఖండంలో స్థాపించబడిన విద్యాసంబంధ సంఘాలలో అత్యంత పురాతనమైనది. ఇదే త్వరలో శతాబ్ది ఉత్సవాలు చేసుకోనుంది.

1928లో లాహోర్‌లో ప్రారంభమై ఆ తర్వాత 1938లో కోల్‌కతాకు చేరి ఆ పిమ్మట 1950లో పూణేకు మారింది. పూణేలోని ఇండియన్ ఫిలోలాజికల్ అసోసియేషన్ భాషాశాస్త్రజ్ఞుల సంఘంలో విలీనం చేయబడింది. భాషాశాస్త్రజ్ఞుల సంఘం భారతీయ భాషాశాస్త్రం పేరుతో ఒక ప్రతిష్ఠాత్మకమైన పత్రికను ప్రచురిస్తోంది. ఇది,

1. భారతీయ భాషాశాస్త్రాన్ని అభివృద్ధి పరచటం;

2. భారతీయ భాషల శాస్త్రీయ అధ్యయనం అనే రెండు విభిన్న లక్ష్యాలతో స్థాపించబడింది:

నేడు, భారతీయ భాషలు మరియు భాషా అధ్యయనాలు అనేక సమస్యలనూ సవాళ్లనూ ఎదుర్కొంటున్నాయి. స్వాతంత్ర్యానంతర కాలంలో డజన్ల కొద్దీ భాషలు కనుమరుగైపోయాయి. ఇంకా డజన్ల కొద్దీ భాషలు అంతరించిపోయే దశలో ఆపన్న భాషలుగా చలామణిలో ఉన్నాయి. అలాంటివాటిని వెంటనే అవి ఎదుర్కొంటున్న ముప్పునుండి కాపాడటం మొట్టమొదటి వ్యాపకం. ప్రధాన భాషలైన తెలుగు మొదలైనవి ప్రపంచీకరణ సాకుతో తరగతి గదుల నుండి బయటకు నెట్టబడుతున్నాయి. ఇప్పటికే ఉన్న చాలా భారతీయ భాషా కోర్సులు కూడా కొద్దో గొప్పో సాహిత్యపరమైనవి కావటంతో విద్యార్థులకు భాషాపరమైన జ్ఞాన సంపాదనకు అవకాశం తక్కువ. భాషాబోధనలో ఆధునిక విజ్ఞాన రంగాలకు సంబంధించిన పాఠ్యవిషయాలు లేకపోవడం, ఆధునిక సమాచార యుగంలో ఒక లోపం. పాఠశాల విద్యలో, భాషా బోధన ప్రాముఖ్యత గురించి మాట్లాడే జాతీయ విద్యావిధానం 2020కి బోధనా మాధ్యమంగా మాతృభాష ఉండాలంటోంది. అయితే దాన్ని అమలుపరిచేందుకు కావలసిన భారతీయ భాషల సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేసుకొనేందుకు భరత ప్రభుత్వంగానీ రాష్ట్ర ప్రభుత్వాలుగానీ ఇప్పటివరకూ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. ప్రపంచీకరణ పేరుతో విద్య వ్యాపార కార్యకలాపంగా మారింది. ముఖ్యంగా ప్రాథమిక విద్యలో విద్యార్జన భాషతో సన్నిహితంగానూ ఇంకా అంతర్గతంగానూ ముడిపడి ఉందనేది అందరికీ తెలిసిందే. భారత రాజ్యాంగంలో కూడా, అధ్యాయం IV. - ప్రత్యేక

ఆదేశాల కింద: ఆర్టికల్ 350 A లో పేర్కొన్నట్లు... "ఇది ప్రతి రాష్ట్రం, ఆ రాష్ట్రంలో ఉన్న పిల్లలకు విద్య యొక్క ప్రాథమిక దశలో ప్రతి స్థానిక అధికారానికిలోబడి మాతృభాషలో బోధనకు తగిన సౌకర్యాలు కల్పించాలి...." అని పేర్కొంది: అటువంటి రాజ్యాంగ హక్కులను కూడా ప్రభుత్వేతర సంస్థలూ కొన్ని ప్రభుత్వాలూ కూడా బహిరంగంగానే ఉల్లంఘిస్తున్నాయి. పైపెచ్చు, ప్రభుత్వేతర ఇంకా ప్రభుత్వ పాఠశాలలలోనూ ఆంగ్లాన్ని బోధనా మాధ్యమంగా ప్రవేశపెడుతున్నాయి. మన దేశంలో చదువు మానేసే పిల్లలు పెరగడానికి ఇది ఒక ప్రధాన కారణంగాకూడా చెబుతున్నారు.

భారతదేశంలో అక్షరాస్యత కనీస స్థాయిలో లేకపోవడానికీ ముఖ్యంగా కొన్ని రాష్ట్రాలలో దేశ సగటుకంటే కనీస స్థాయికి దిగజారటానికీ ప్రాథమిక స్థాయిలో ఇంగ్లీషును మాధ్యమంగా ప్రవేశపెట్టబడటమే ప్రధానకారణం.

భాష అనేది మనకు జన్యుపరంగా సంక్రమించిన విషయమే. అయితే వివిధ రంగాలలో అవసరమైన వ్యక్తీకరణ పెరుగుదలకు రాజకీయ, సామాజిక-సాంస్కృతిక పద్ధతులే ఆధారం. భారతదేశం 75 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం అమృతోత్సవాలు జరుపుకుంటున్నప్పటికీ అందరికీ అక్షరాస్యత అనేది ఒక భ్రమగా మిగిలిపోయింది అనేది స్పష్టం. ప్రపంచ అక్షరాస్యతలో 195 దేశాలలో భారతదేశం 159వ స్థానాన్ని మాత్రమే దక్కించుకోగలగటానికిగల ముఖ్య కారణాలో ఒకటి ఆంగ్ల మాధ్యపు విద్యే. మనం ప్రతి యేటా ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో గ్రాడ్యుయేట్‌లను తయారు చేస్తున్నాం (2016). ఈ విషయంలో, అమెరికాను అధిగమించాం కూడా. ఇంకా, భారతదేశం 2016లో (ఫోర్బ్స్ ప్రకారం) 26 లక్షలమంది స్టెమ్ (విజ్ఞాన, తంత్ర సాంకేతిక యాజమాన్య విషయాలలో, STEM) గ్రాడ్యుయేట్‌లను తయారు చేయగా అమెరికా దాన్లో నాల్గవవంతు అంటే 568,000 మందిని తయారు చేయగలిగింది. అయితే, మేధో సంపత్తి హక్కులపై మన వాటా అన్నింటి కంటే చాలా తక్కువ. ఇతర దేశాలలో. ఉదాహరణకు, దక్షిణ కొరియాలో ప్రతి 200 మందికీ ఒక (1) పేటెంట్‌ను సంపాదించగా, జపాన్ ప్రతి 300 మందికి ఒక (1) పేటెంటునూ, జర్మనీ ప్రతి 500 మందికీ ఒక (1) పేటెంటునూ, చైనా ప్రతి 1000 మందికీ ఒక (1) పేటెంటును సంపాదించగా, భారతదేశం ప్రతి 100,000 మందికి రెండు (2) పేటెంట్లను మాత్రమే సంపాదించ గలుగుతోంది. భారతదేశంలో ఇంత నాసిరకమైన విద్యనూ, ఈ రకమైన విద్యాపరమైన అసమర్థతకూ కారణాలు ఏమిటో విశ్లేషిస్తే, దీనికి లోప భూయిష్టమైన మన భాషా విధానం అనే తెలుస్తోంది. 1980లలో ప్రాథమిక విద్యలో ఆంగ్ల మాధ్యమాన్ని బోధనా మాధ్యమంగా ప్రవేశపెట్టడం ప్రారంభించాం. 1997లో ప్రాథమిక విద్యలో ఇంగ్లీషు బోధనా మాధ్యమంగా 5% ఉండగా 2009లో అది 15%గా నమోదైంది. భారతీయ ఆర్థిక గణాంకాలకు సంబంధించిన అధ్యయనంలో, మన స్థూల జాతీయోత్పత్తిలో 83% భారతీయ శ్రామిక శక్తి ద్వారా భారతీయ భాషల వినియోగంతోనే సమకూడుతోందని తేలింది. ఈ వాస్తవాలు భారతీయ భాషలను ప్రాథమిక స్థాయిలో బోధనా మాధ్యమంగా తిరిగి తరగతి గదిలో ప్రవేశపెట్టక తప్పనిసరి అని తేల్చేస్తున్నాయి.

భాషావేత్తలు భాషాశాస్త్రాన్ని బోధించడమే కాకుండా ప్రయోగాత్మక విషయాలలో కూడా తీరికలేకుండా ఉన్నారు. అనేక చిన్నాచితకా గిరిజన భాషలను రాయడానికి వీలుగా లిపీకరణ, వర్ణన తద్వారా వాచక రచనలతో తరగతి గదిలో ప్రవేశపెట్టాలి. ఈ నేపథ్యంలో, మేధావులు, విధాన నిర్ణేతలు అందరూ ముందుకురావాలని విజ్ఞప్తి చేస్తూ తరగతి గదులలో భారతీయ భాషలను పునరుద్ధరణకు ఉద్యమించవలసిన తరుణం ఇది అని చెప్పక తప్పదుఅంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

**ఒడిస్సా గవర్నర్ శ్రీ గణేశ్‌లాల్ జీ ప్రారంభోత్సవ ప్రసంగం:**

ముఖ్య అతిధిగా విచ్చేసిన ఒడిస్సా గవర్నర్ శ్రీ గణేశ్‌లాల్ జీ సమావేశంలో ప్రారంభోత్సవ ప్రసంగం చేస్తూ ఈ దేశానికి తనవంటూ కొన్ని భాషలు ఉన్నై. ఈ ప్రజలు వాళ్ల భాషలలోనే తరతరాలుగా మాట్లడుకోవటమే గాక వాటిద్వారానే తమ సాంస్కృతిక వారసత్వాన్ని నిలుపుకోగలుగుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 యేండ్లు గడిచినై.




మన దేశంలో విద్యా వ్యవస్థ విఫలమయింది. ఇది నేను అనటంలేదు, అమెరికా, జర్మనీ మొదలైన దేశాలవాళ్లే అంటున్నారు. అందుకనే కేంద్ర ప్రభుత్వం NEP పేరుతో జాతీయ విద్యా యోజన అనే సరికొత్త వ్యవస్థకు రూపుదిద్దుతోంది. భారతీయ భాషలలో ప్రాథమిక విద్య తప్పనిసరి చేస్తూ చర్యలు చేపట్టే విధానం అది. తమ తమ మాతృభాషలలో చదువుకున్న దేశాలే జ్ఞానార్జనలో ముందున్నాయి. వారికే ఎక్కువ పేటెంట్లు వస్తున్నాయి. నేను ఒకసారి కొరియా వెళ్లాను. జనాభా 5 కోట్లే. అక్కడ ఇంగ్లీషులేదు, హిందీ రాదు గవర్నరుతో మాట్లాడాలంటే మధ్యవర్తి కావాల్సివచ్చింది. డాక్టర్లు కొరియను భాషలోనే పనిచేస్తున్నారు, పరిశోధనలు వాళ్లభాషలోనే నడుస్తున్నై. అదే వారి విజయానికి కారణం. మన ప్రతిభ ఇతరుల ప్రతిభల నీడలో బతుకులీడ్చేందుకు కాదు. ఇతర భాషల గాలికి కొట్టుకుపోకూడదు. మన తలుపులూ కిటికీలు తెరిచే ఉంటాయి, అందరినుంచి మంచిని ఆశిస్తూనే ఉంటాం. కానీ ఎవరికీ అమ్ముడుబోం. ఆ వాకిళ్ళూ కిటికీలనుంచీ వచ్చే గాలికి కొట్టుకుపోం. ఈ దేశ భాషలు ఈ జనానికి ఊపిరి. వాటి అవసరం మన దేశ అభివృద్ధికీ భవిష్యత్తుకూ అవసరం. భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘం అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ భాషాశాస్త్రజ్ఞుల సమావేశంలో అందరూ ఇంగ్లీషులోనే మాట్లాడారు. అయితే నేను ఇంగ్లీషుతోపాటు హిందీ ఇంకా ఈ రాష్ట్ర భాష ఒడియాలో కూడా మాట్లాడనివ్వండంటూ మిగిలిన తన ప్రసంగాన్ని ఒడియాలో కొనసాగించి ఎక్కడైనాసరే దేశభాషలవాడకానికి హద్దులు లేవు, ఉండవు,

**తరువాయి 21వ పుటలో....**

కుర్రా జితేంద్రబాబు
98488 82600

# ఆంధ్రపితామహుడు మాడపాటి హనుమంతరావు



**కను వెలుగు :** 22 జనవరి 1885
**కను మరుగు :** 11 నవంబరు 1970

తెలుగుజాతిలో అత్మాభిమానం
రగిలించడానికై సాటిలేని కృషిచేసిన
'ఆంధ్రపితామహుడు' మాడపాటి హనుమంతరావు.
తెలంగాణాలో ఆంధ్రమహాసభ నేతగా
పలురీతుల్లో ఉద్యమాలను నిర్మాణం చేసిన
తెలుగుజాతి వైతాళికుడు
మాడపాటి హనుమంతరావు.
తెలుగునాడును వెలుగునాడుగా మార్చిన
ఆయన పట్టుదల ఎన్నటికీ మరువరానిది.

**హైద్రాబాదు సంస్థానంలో, తెలుగుతనానికి జీవం పోసి, తెలుగువారిని నిద్రావస్థ నుంచి మేలుకొలిపి, వారిలో దేశాభిమానము, ఆత్మగౌరవము, రాజ్యాంగ భావాలను, రాజకీయ ఆలోచనలను కల్పించి, సాంఘిక, ఆర్థిక, విద్య మొదలైన సంస్థలను నెలకొల్పి, ఆంధ్రోద్యమాభివృద్ధి, బాలికల పాఠశాల, పరోపకారిణీ బాలికా పాఠశాల, గ్రంథాలయోద్యమము లాంటి అనేక ప్రజాహిత కార్యక్రమాలకు రూపకల్పన చేసి, తెలుగువారి వ్యక్తిత్వానికి తెలుగుభాషకు, అస్తిత్వము నెరపిన విరాజమానుడయిన త్యాగధనుడు, ఆంధ్ర పితామహుడుగా ప్రజల చేత గౌరవించబడినవాడు- మాడపాటి హనుమంతరావు.**

హైద్రాబాదు సంస్థానంలో, తెలుగువారి హక్కుల కోసం, తెలుగు భాషా వికాసం కోసం, తెలుగు ప్రజల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం తపించిన మహనీయుడు హనుమంతరావు. తాను పూనిన కార్యాలను సమర్థవంతంగా నిర్వహించిన ద్రష్ట హనుమంతరావు.

మాడపాటి హనుమంతరావు గారు తన సమకాలీనులైన కొమర్రాజు లక్ష్మణరావు గారి వలె చారిత్రకవేత్తలు కాదు, రాజా బహదూర్ వేంకట రామారెడ్డి వలె ఉన్నతోద్యోగులు కాదు, కాశీనాథుని నాగేశ్వరరావు వలె ధనవంతులు కాదు. కొండా వెంకట రంగారెడ్డి వలె భూస్వాములు కాదు, సర్వేపల్లి రాధాకృష్ణ లాగా తత్వశాస్త్ర పరిజ్ఞానులు కాదు, పట్టాభిసీతారామయ్య వలె రాజనీతి కోవిదులు కాదు. కాని అన్ని విషయాలలో విఖ్యాత పురుషులతో సమానంగా తులదూగువారు కాకపోయినా, అన్ని విషయాలలో వారికి సమానంగా కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించి, తాను తెలంగాణలో తెలుగుతనానికి చిహ్నంగా, తెలుగువారికి ఆదరణీయ స్థలంగా వారి గృహం 'ఆంధ్ర కుటీరం' నిలిచింది.

మాడపాటి హనుమంతరావు ఆర్వేల నియోగి శాఖకు చెందిన ఆపస్తంబ సూత్రులు కౌశిక గోత్రీకులైన బ్రాహ్మణులు. వెంకటప్పయ్య, వేంకట సుబ్బమ్మలు వారి జననీ జనకులు. ఆనాడు తండ్రిగారు గ్రామోద్యోగులుగా కృష్ణాజిల్లా, నందిగామ తాలూకా, పొక్కునూరు గ్రామానికి పనిచేశారు.

వీరి పెద్దకుమారుడు తిరుమలరావు- హనుమంతరావు కన్న మూడు సంవత్సరాలు పెద్ద. హనుమంతరావుగారు 22 జనవరి 1885న జన్మించారు. వీరి ఐదవ యేట తండ్రిగారు మరణించారు. హనుమంతరావు గారి తల్లి జమలాపురం వారి ఆడపడుచు. ఆమె సోదరులు వేంకటరావు, రామచంద్రరావులు ఎర్రుపాలెం సమీప గ్రామమైన గోపవరం గ్రామ నివాసులు. వారు హనుమంతరావు, తిరుమలరావుల విద్య, పోషణ బాధ్యతను తీసుకొన్నారు.

జమలాపురం వేంకటరావు సూర్యాపేటలో తహశీల్దారు కచేరిలో

పేష్కారు పదవి నిర్వహిస్తూ ఉండటం వల్ల హనుమంతరావు అక్షరాభ్యాసం అక్కడే శ్రీ తిరునగరి సాతాని నర్సయ్య వద్ద ప్రారంభమై మూడు సంవత్సరాలు కొనసాగింది. వేంకటరావునకు ఆ తర్వాత ఇబ్రహీంపట్టణం, జడచర్లలో ఉద్యోగించుట వల్ల, అక్కడా విద్యావకాశాలు లేకపోవడంతో రెండవ మేనమామ నల్లగొండలో పేష్కారుగా పనిచేస్తున్నందున 1894లో వచ్చి అక్కడ 1898లో ఉర్దూ మీడిల్ పరీక్షలో ఉత్తీర్ణులైనారు.

ఇంగ్లీషు భాషాభ్యాసం ప్రారంభించి 1900లో ఇంగ్లీషు మిడిల్ పరీక్ష కూడా ఉత్తీర్ణులైనారు. ఆ తర్వాత హనుమకొండలోని ఉన్నత పాఠశాలలో చేరి ప్రీమెట్రిక్, మెట్రిక్యులేషన్ అను మద్రాసు యూనివర్శిటీ పరీక్షలు 1903లో ముగించారు. అప్పుడు హనుమకొండ ఉన్నత పాఠశాలకు ఎల్.పి. కన్నయ్య ప్రధానోపాధ్యాయులుగా ఉన్నారు. మాడపాటి హనుమంతరావుతోపాటు ఆ సంవత్సరము మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులయినవారిలో ఖమ్మంమెట్టు గోపాలరావు, కోట సుబ్బారావు, కాచెగారి రాజన్నలున్నారు. ఆనాటికి వారి మేనమామలు మరియు వారి పెద్దతల్లి కుమారుడు ఏలూరి నరసింహారావు అకాలమృత్యువాత పడటంతో సోదరుడు తిరుమలరావు ద్రవ్య సహాయంతో విద్యాభ్యాసం కొనసాగించారు. నిజాం ప్రభుత్వం నెలకు అయిదు రూపాయల చొప్పున విద్యార్థి వేతనం ఇచ్చినది.

1901, 1902 సంవత్సరం హనుమకొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు మెట్రిక్యులేషన్ పరీక్షకు గుంటూరు సెంటరు తీసుకొన్నారు. వారి వెంట టి. నారాయణాచార్యులు వెళ్ళటం జరిగింది. వీరు ఆ సమయంలో ఆ ప్రాంతంలోని పరిస్థితులు గమనించి, హనుమకొండలో ఒక ఆంధ్ర భాషా నిలయం స్థాపించదలచి హనుమకొండకు వచ్చిన తర్వాత వారి మిత్రులు కొమరిగిరి సీతారామారావు, కె.తిరుమలరావులతో సంప్రదించి గ్రంథాలయ ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ సమయంలో శ్రీ హంపీ విరూపాక్ష శంకర స్వాములవారు హనుమకొండకు రాగా, వారిని కలిసి గ్రంథాలయ స్థాపన గురించి తెలియజేయగానే సంతోషించి 100 రూ॥ వాగ్దానం చేశారు. ఆ తర్వాత ఒక శిష్యుడు గ్రంథాలయ స్థాపనకు ఇష్టపడక స్వామి వారితో లేనిపోనివి కల్పించి చెప్పడంతో స్వాములవారు తమ వాగ్దానాన్ని వాపసు తీసుకొన్నారు. ఈ విషయం తెలిసి కొందరు విద్యార్థులను తీసుకొని మాడపాటి హనుమంతరావుగారు స్వాముల వారిని దర్శించి, ఆరంభింపరు నీచ మానవులు, తమ కార్యంబు పరిత్యజించియు అను రెండు పద్యాలు చదివి వినిపించి, తిరిగి వారి ఆశీర్వాదం పొంది వాగ్దానం సాఫల్యం చేసుకొని వచ్చినారు. హైస్కూలు విద్యార్థులు కొన్ని నాటకములు ప్రదర్శించి, వచ్చిన ద్రవ్యముతో కొన్ని గ్రంథాలు సేకరించి రాయ్ మురళీధర్ సుబేదారు బహద్దరు గారిని ఆశ్రయించి వారి సానుభూతిని పొంది 6 సెప్టెంబరు 1904న వారి అధ్యక్షతన సభ జరిపి రాజరాజ నరేంద్ర ఆంధ్ర భాషానిలయాన్ని ప్రారంభించారు. ఈ నాటకముల ప్రదర్శనలలోను, గ్రంథాలయ ఏర్పాటులోను హనుమంతరావు గారు పాల్గొన్నారు. ఆనాడు సహకరించిన విద్యార్థులు, గోపాలరావు, కాచ రాజన్న, ఆలూరు గురురాజారావు, కోటి వెంకట సుబ్బారావు, మాడపాటి హనుమంతరావు, గోవిందరావు, పులిజాల వేంకట రంగారావు, మోతునూరు వెంకటేశ్వరరావులు.

మెట్రిక్యులేషన్ పూర్తి అయిన తర్వాత కుటుంబ పోషణ కొరకు 1904లో విద్యాశాఖ సదరు మొహతమాం (ఇన్‌స్పెక్టరు) కచేరిలో గుమస్తా (మీరుమున్షీ)గా నెలకు రూ.40/-ల జీతముతో హనుమకొండలో చేరినారు. ఆనాటి విద్యాశాఖ ఇన్‌స్పెక్టరులు హర్డీకరు, పుట్టపర్తి శ్రీనివాసాచారిల క్రింద ఉద్యోగము దక్షతతో 8 సంవత్సరాలు నిర్వహించారు. ఈ సమయంలో రాజరాజనరేంద్ర భాషా నిలయం నిర్వహణా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు.

న్యాయవాది కావాలనే ఆకాంక్షతో కొంతకాలము సెలవుపెట్టి హైద్రాబాదు వచ్చి తర్ఫీదు తీసుకొంటున్న సమయంలో విద్యాశాఖ సదరు మొహతమీం కచేరిలో రూ.50 ల వేతనంతో సిరస్తేదారు పదవి దొరికినది. 1912లో ఈ పదవిలో చేరి మూడు నెలలు మాత్రమే పనిచేశారు.

నిజాం రాష్ట్ర శాసన నిర్మాణశాఖలో ఇంగ్లీషు, ఉర్దూ, తెలుగుభాషలలో నిష్ణాతుడైన అనువాదకుడు కావలసి ప్రకటన ఇవ్వగా 12 మంది దరఖాస్తులు పెట్టినారు. అందులో హనుమంతరావుగారు ప్రథములుగా ఉత్తీర్ణులై నెలకు 100 రూ.లు వేతనముతో నియమించబడినారు. ఆనాడు శాసన నిర్మాణ శాఖాధికారిగా ఉన్న రావు బహద్దూరు కృష్ణమాచారి-హనుమంతరావు ప్రజ్ఞను గుర్తించి ప్రోత్సహించినాడు. ఈ ఉద్యోగములో 1917 వరకు కొనసాగినారు. ఈ కాలంలోనే ప్రజాసేవాకార్యాలకు, స్వతంత్ర జీవనానికి అనుకూలమైన వృత్తి- వకీలు వృత్తి అని భావించి, క్రమంగా సువ్వందర్జా, దువ్వందర్జా, అవ్వల్ దర్జా వకాలత్ పరీక్షలు ఉత్తీర్ణులయి శాసనసభ ఉద్యోగానికి రాజీనామా చేసి, న్యాయవాద వృత్తిలో ప్రవేశించారు. ఈ వృత్తిలో వాక్స్వాతంత్ర్యము, కార్యాచరణ స్వాతంత్ర్యము ఉంటుందనే ప్రవేశించారు.

తొలుత రాయ్ విశ్వేశ్వరనాథ్ బి.ఎ.ఎల్.ఎల్.బి. వద్ద కొంతకాలము జూనియర్‌గా పనిచేశారు. ఆనాటికి రాయ్ విశ్వేశ్వరనాథ్ ప్రముఖ న్యాయవాదులలో ఒకరు. వారు క్రమంగా న్యాయమూర్తిగా, ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి రాజ బహద్దర్ బిరుదును కూడా పొందారు. హనముంతరావు సొంత ప్రాక్టీసు ప్రారంభించిన తర్వాత తీసుకొన్న మొదటి కేసు నెగ్గలేదు. కాని ఆనాటి న్యాయమూర్తి నవాబ్ అక్బర్ యార్‌జంగ్ యువ న్యాయవాది అయిన హనుమంతరావును తన చాంబర్‌లోకి పిలిచి- 'మిస్టర్ హనుమంతరావు, మీరు వాదించిన తీరు, మీరు చెప్పిన పాయింట్లు అన్నీ చాలా చక్కగా, సక్రమంగా ఉన్నాయి. మీరు చాలా కష్టపడి స్టడీ చేసి వచ్చినట్లు గమనించాను. కాని కొన్ని సందర్భాల్లో న్యాయధర్మసూక్ష్మ విషయాలను గమనించి, మేము తీర్పు చెప్పుతూ ఉంటాము. కాబట్టి, దీనిని మీరు ఓటమిగా భావించగూడదు. జయాపజయాలు జంకకుండా మీ కర్తవ్యాన్ని నిర్వహిస్తూ ఉండండి' అన్నారట. ఈ వాక్యాలు హనుమంతరావునకు ధైర్యము, ప్రోత్సాహము, వృత్తిపై దృఢ విశ్వాసము కలిగి న్యాయవాద వృత్తిలో కొనసాగారు. కొద్దికాలానికే సమర్థులైన న్యాయవాది అనే పేరు హనుమంతరావుకు స్థిరపడి, వారి సత్యసంధత, ఋజువర్తన, కార్యదీక్ష అనేకమందిని



ఆకర్షించి, ప్రముఖ న్యాయవాదిగా నిలిచేటట్లు చేశాయి. న్యాయశాస్త్ర పరిజ్ఞానం, సమయస్ఫూర్తి, వాదనాపటిమ, యుక్తి ప్రయుక్తులు, తర్కము, క్రమశిక్షణ, లౌక్యముతో ప్రజల వలన, ఉన్నతాధికారులతో సత్సంబంధాలు ఏర్పడినాయి. న్యాయమూర్తులు, పోలీసు, రెవెన్యూశాఖల వారు ముఖ్యంగా ఆనాటి రెవెన్యూ మంత్రి మిస్టర్ టాస్కర్‌తో మైత్రి ఏర్పడిరది. ప్రజల కష్టసుఖాలను గూర్చి వారితో తరచుగా ప్రస్తావిస్తూ ప్రభుత్వ కార్యవిధానమును విమర్శిస్తూ, కర్తవ్యమును సూచించేవారు.

ఒక అభియోగములో మాదిరాజు రామకోటేశ్వరరావు వాదిపక్షమున, హనుమంతరావు ప్రతివాది పక్షమున నిలిచినారు. రామకోటేశ్వరరావు హనుమకొండ నుండి హైద్రాబాదు వచ్చి, హనుమంతరావు ఇంట్లోనే బస చేసినారు. ఇద్దరు కలిసి కోర్టుకు వెళ్ళేవారు. ఒకనాడు కోర్టుకు వెళ్ళు సందర్భములో హనుమంతరావు 'నీలగిరి' పత్రికను తెస్తూ, ప్రయాణంలో పత్రిక పుటలను తిప్పుతూ చదువుతూ ప్రయాణం కొనసాగించారు. రామకోటేశ్వరరావు, హనుమంతరావుతో "బావా! కోర్టుకు కూడా 'నీలగిరి' పత్రిక ఎందుకయ్యా! ఇచ్చటకూడా దేశ సేవా గొడవేనా అని రామకోటేశ్వరరావుగారు ఉల్లాసమాడిరి. హనుమంతరావు చిరునవ్వు నవ్వి ఊరకున్నారు. ఆనాటి వాయిదాకు ప్రతివాది, సాక్షులు రాలేదు. అందువల్ల వాది పక్షమున తీర్పు చెప్పవలసినదిగా రామకోటేశ్వరరావు కోర్టులో బలముగా వాదనలు వినిపించారు. దానికి సమాధానముగా హనుమంతరావు లేచి, పెనుతుఫాను వీచి, చెఱువులు తెగి, ప్రతివాది నివసించు ప్రాంతమంతా జలమయమయిందని అందువల్ల బాటలు చెడి, రైళ్ళ రాకపోకలు నిలుచుట వల్ల, పంచభూతములాగ్రహించి బీభత్సము చేయుచున్న సమయంలో మానవులకయినా ప్రయాణావకాశములు ఉండగలవా? అని ప్రశ్నించారు. తన కక్షిదారుడు ఈ భయానక పరిస్థితుల మూలముగా రాలేకపోయినాడని వాయిదా ఇప్పించమని కోరినాడు. "ఇది వట్టిసాకు, ఇందు సారము లేదు, తుఫానుకు ప్రతివాదికి సంబంధము లేదు" అని రామకోటేశ్వరరావు గారు గట్టిగా ప్రతిఘటించగా, హనుమంతరావు నీలగిరి పత్రికలో తేదీలవారీగా తుఫాను వర్ణన భాగములను చదివి, కక్షిదారుడు గ్రామము ఎలా వదులుటకుకు వీలుగాలేదో వివరించారు. కోర్టువారు హనుమంతరావు వాదమును విశ్వసించారు. 'బావా! ఇందుకా 'నీలగిరి' పత్రికలను తెచ్చినది? ఎంత మోసము చేసినావయ్యా?" అని రామకోటేశ్వరరావు కేరడమాడినాడు.

హైద్రాబాదులో అనేక న్యాయస్థానాలున్నాయి. ఒక వకీలు అన్ని కోర్టుల్లో ఒకేసారి వ్యవహరించుట సాధ్యం గాదు. అందువల్ల కొండా వెంకటరంగారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, కైలా బలవంతరెడ్డి, మందుముల రామచంద్రరావు, పి.శ్రీనివాసరెడ్డి, మాడపాటి హనుమంతరావు గారలు ఒక కూటమిగా ఏర్పడి కోర్టులలోని పనిని పంచుకొన్నారు. హనుమంతరావు మాల్గుజారి (రెవెన్యూ కోర్టు), బూర్గుల రామకృష్ణారావు, మందుమల రామచంద్రరావులు హైకోర్టు, పి.శ్రీనివాసరెడ్డి, కైలా బలవంతరెడ్డి గార్లు అత్రాఫ్ బల్దా జిల్లా (హైద్రాబాద్ జిల్లా)లో మొత్తం కోర్టులు, కొండా వెంకటరంగారెడ్డి సెషన్స్ కోర్టులో పని విభజన చేసుకొని, 1925 నుండి 1933 వరకు న్యాయవాద వృత్తి చేశారు. 1941లో సంపాదించిన కలిమితో తృప్తినొంది హనుమంతరావు న్యాయవాద వృత్తిని వదలివేశారు.

హనుమంతరావు హనుమకొండలో విద్యాభ్యాసము చేయుచున్న దశలోనే మూడు ఉద్యమాలు ఆనాడు యువకులను సుప్రాతలూగించినాయి. మొదటిది తెలుగుభాషా వికాసోద్యమము, రెండవది సంఘసంస్కరణోద్యమము, మూడవది రాజకీయోద్యమము ఈ మూడు ఉద్యమాలతో అనుబంధం హనుమంతరావుకు విద్యార్థి దశనుండే ఏర్పడింది. 1901లో మునగాల రాజానాయని వెంకట రంగారావు, రావిచెట్టు రంగారావు ప్రభృతులు హైద్రాబాద్‌లో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయ స్థాపనతో- తెలుగు భాషా వికాసోద్యమము ప్రారంభమైనదని చెప్పవచ్చు.

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయ వార్షికోత్సవ సందర్భంలో మైలవరపు నరసింహశాస్త్రి రచించిన పద్యాలు - ముఖ్యంగా

"పరభాష లభ్యసింపగ వచ్చు హెచ్చుగా
మాతృభాషనదేల మానవలెను
ద్రవ్యంబు గడియించు దారి చూడగవచ్చు
మాతృభాషనదేల మానవలయు
పరమర్మభేదనోపాయంబు గనవచ్చు
మాతృభాషనదేల మానవలెను
సత్యమార్గంబున జరియింపగా వచ్చు
మాతృభాషనదేల మానవలెను

మానరాదని మన మభిమానముంచి
గారవించిన మన తల్లి గౌరవంబు
సూర్యచంద్రులు త్రోవలు సురిగెనేని
మరిగిపోవునే భువి నాంధ్ర సూనులార"

అని చేసిన విన్నపము హనుమకొండలో శ్రీ రాజరాజనరేంద్రాంధ్ర భాషా నిలయము స్థాపనలోను, అభివృద్ధి విషయములోనూ మాడపాటి హనుమంతరావు సహకారముతోపాటు తెలుగు గ్రంథాధ్యయనము చేసి భాషా పాండిత్యము సంపాదించుట జరిగింది.

ఈ ఆంధ్రభాషా నిలయము చేయుచున్న పనికి దోహదముగా మునగాల రాజానాయని వేంకట రంగారావు, రావిచెట్టు రంగారావు, కొమర్రాజు వేంకట లక్ష్మణరావు, ఆచంట లక్ష్మీపతి, అయ్యదేవర కాళేశ్వరరావులు 1905లో "విజ్ఞానచంద్రికా గ్రంథమండలి"ని స్థాపించి తెలుగులో నవ్యగ్రంథాలను ప్రకటింపసాగిరి. ముందుగా 1907లో 'అబ్రహాం లింకన్' జీవిత చరిత్రను గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు రాయగా లక్ష్మణరావుగారి సంపాదకత్వంలో వెలువడినది. ఈ గ్రంథం హనుమంతరావునకు ఉత్సాహంనినుమడింపజేసింది. రెండవ ముద్రణలో ఉపోద్ఘాతము తీసివేసినందుకు వగచుచు పత్రికలో వ్యాసము కూడా హనుమంతరావుగారు ప్రకటించారు. విజ్ఞానచంద్రిక గ్రంథములలోని లక్ష్మణరావు గారు రచించిన హిందూమహాయుగము, మహ్మదీయ మహాయుగము, వీరిని ఎక్కువగా ఆకర్షించి ఆవేశపూరితులుగా చేసినవి.

కందుకూరి వీరేశలింగం గారి రచనలు పది సంపుటములుగా ఆనాడు వెలువడినవి. వాటిని చదివి హనుమంతరావు, ఏకేశ్వరోపాసనము, వర్ణవ్యవస్థ, వితంతూ ద్వాహము, ప్రౌఢ వివాహుములు, వర్ణాంతర వివాహములు, సర్వమానవ సోదరభావములు, వేశ్యానిగర్వణము, సంఘదురాచారాలు, సంఘైక్యము, మతసహనము మొదలైన విషయాలు హనుమకొండలో విద్యాభ్యాస కాలము నుండే మిత్రులతో చర్చలు చేస్తూ వచ్చారు.

బెంగాలు విభజన కాలంనాటి రాజకీయాలు వార్తాపత్రికలలో వాడి, వేడి చర్చలు హనుమంతరావుకు రాజకీయాలపై ఆసక్తిని కలిగించాయి. ఆనాడు హైద్రాబాదు సంస్థానంలో 8 జిల్లాలో 60 లక్షల తెలుగు ప్రజలున్నారు. బ్రిటీషు ఆంధ్రులతోను, హైద్రాబాదు సంస్థానంలోని మహారాష్ట్ర, కర్ణాటక జిల్లాల స్థితితో పోల్చి చూచిన తెలుగువారి పరిస్థితి విచారకరముగా ఉన్నది. 8 జిల్లాలలో ఒకటి మాత్రమే ఇంగ్లీషు హైస్కూలు ఉన్నది. మహారాష్ట్ర, కర్ణాటక జిల్లాలతో పోల్చితే తెలంగాణావాసుల విద్యాదారిద్ర్యము స్పష్టంగా కనపడుతున్నది. జనులలో విద్యాభివృద్ధికి సహకారము గాని, ఆ ఉద్దేశ్యము కలవారు గాని లేకుండిరి. పత్రికా ప్రచారము, పత్రికా పఠనేచ్ఛ మృగ్యముగా నుండెను. దేశభాషలపై అభిమానము ఉభయత్రా శూన్యముగా నుండెను. తెలుగువారి చరిత్రకు దోహదపడు శాసనములు వందలుగా ఉన్నప్పటికి, వాటిపై దృష్టి పెట్టినవారు లేరు. ధనవంతులు, సంస్థానాధీశులు, దేశముఖులు, వర్తకులు దేశాభివృద్ధి పట్ల విముఖులై మెలుగుచున్నారు. వ్యవసాయము తాతలనాటి పాత పద్ధతులతో జరుగుతూ రైతులను కృంగదీయుచుండెను. అనుదిన జీవనమునందు సమయాసమయములు లెక్కచేయక ఉర్దూభాషను మాట్లాడుకొనుటే పరమార్థము, ఆనాటి నాగరికత తెలంగాణా ప్రజల వెనకబాటుతనము, అజ్ఞానము హనుమంతరావును కలిచివేసినవి. ఈ దృశ్యాలను ఇంగుర్తి నుండి వద్దిరాజు సోదరులు స్థాపించిన తెనుగు పత్రికలో వ్యాసాలుగా రచిస్తూ హనుమంతరావు గారు సూచించారు. మచ్చుకు కొన్ని తునకలు:

"అన్ని విధములగు నౌన్నత్యము నలవడజేయు నత్యవసరమగు సంఘీభావము, పూర్వ చరిత్రను గూర్చిన గౌరవమును, భావి భాగ్యోదయ విషయమున విశ్వాసమును తెలుగువారి హృదయక్షేత్రము లందంకురింపనిచో మృతతుల్యులుగా నున్న వీరి భావి సంతానము గతి ఏమి కావలయును?" అని ఒక వ్యాసములో వాపోయినారు.

మరొక వ్యాసములో ''అరువది లక్షల జీవులు నిజాం రాష్ట్రమునకును, భారత వర్షమునకును, చిరకాలము భారముగా నుండవలసినదేనా? అని ప్రశ్నించారు.

తెలంగాణలోని తెలుగువారిలో అవిద్య, అజ్ఞానము, మూఢత్వము, నిస్పృహత్వము, దాస్యభావము తొలగించిన గాని వికాసము జరగదని మొదట హనుమంతరావు గుర్తించారు. హైద్రాబాద్ రాగానే శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంతో అనుబంధము ఏర్పరచుకున్నారు. అప్పుడు ఈ నిలయం 4-80 రూపాయలు అద్దె గల చిన్న గదిలో నడుస్తున్నది. నిలయం జనాకర్షకమై కార్యజాతము పెరుగుచుండుట చేత, విశాలభవన అవసరమును గుర్తించినప్పటి స్వప్నసంఘటనగా మిగిలినది. హనుమంతరావు 1914-15 నుండి కార్యదర్శి పదవి స్వీకరించి బద్ధకంకణులైనారు. అప్పటికి రావిచెట్టు రంగారావు గారు మరణించినారు. వారి ధర్మపత్ని శ్రీమతి లక్ష్మీ నరసమ్మను ప్రోత్సహించి రంగారావు స్మృతిచిహ్నంగా నాలుగువేల రూపాయలతో భవన నిర్మాణానికి అంకురార్పణ చేసి ఒక సుందర భవనాన్ని శ్రీకృష్ణదేవయాంధ్ర భాషా నిలయానికి అమరేటట్లు చేశారు.

యాదవ, ముదిరాజు, మున్నూరు, హరిజన, పద్మశాలి, గౌడ వర్గీయులను మేల్కొలిపి వారి ఐక్యతకు కృషి చేశారు. ఆంధ్ర విద్యార్థులకు ప్రోత్సాహం, జీవరక్షా ప్రచారిణీ సంఘము, హిందూ సంఘసంస్కారసభ, ఆది హిందూ సంఘ సంస్కార సభ, ఆదిహిందూ సేవా సమితి మొదలైన సంస్థలతో కలిసి పనిచేశారు. ఆర్యసమాజము, బ్రహ్మసమాజము, దివ్యజ్ఞాన సమాజము మొదలైన మతసంస్థలలో ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా, వారి సత్కార్యాలకు ప్రోత్సాహాన్నిస్తూ వచ్చారు. శ్రీమతి యన్.సీతమ్మ నడుపుతుండిన పరోపకార బాలికా పాఠశాల నిర్వహణా భారము వహించారు. నీలగిరి పత్రిక, తెనుంగు పత్రికలు, వీరి ప్రోత్సాహముతో నడుస్తుండినవి. గోలకొండ పత్రిక, సుజాత (మాస) పత్రిక వీరి సహాయకకృషి ఫలితముగా ప్రారంభమైనవి. నిజాము ప్రభుత్వము వివిధోద్యమాలను నిషేధిస్తూ 'గష్తీ నిషాన్ తిర్పన్' అన్న ప్రఖ్యాత ఉత్తర్వు 53 కి వ్యతిరేకంగా ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక బేదము లేకుండా కలిసి ఏర్పడిన ఆందోళన సంఘానికి కార్యదర్శిగా హనుమంతరావుగారు పనిచేశారు. స్టేట్ రిఫార్మ్ అసోసియేషన్, హిందూ మహాసభలలో బాధ్యతాయుత పదవులు స్వీకరించారు. హైద్రాబాద్ సంస్థానంలో ఏర్పాటయిన ప్రతి ప్రగతిశీల చైతన్య సమాజానికి సలహాలు ఇస్తూ వచ్చారు. సూర్యాపేట వర్తకసంఘానికి నియమావళిని




1936 షాద్‌నగర్‌లో జరిగిన 5వ ఆంధ్ర మహాసభ అధ్యక్షులుగా శ్రీ కె.వి. రంగారెడ్డి గారితో శ్రీ మాడపాటి హనుమంతరావు తదితరులు

రూపొందించారు.

ఒక సందర్భంలో 'ప్రబుద్ధాంధ్ర'లో వ్రాసిన ఒక వ్యాసంలో హనుమంతరావుగారిని గూర్చి సురవరం ప్రతాపరెడ్డి గారు ఇలా రాశారు. "వీరిలోనొక గొప్ప లక్షణము గలదు. ప్రజాసేవకులను వ్రాయసకాండ్రను గుర్తించుటలో వీదికి పక్షిచూపు కలదు. అట్టి వారిని జారిపోదమన్నను జారనీయక తమ దృక్పథమందే యుంచుకొని ప్రోత్సాహపరచి రంగములోకి లాగుచుందురు. సహాయకులను, అనుయాయులను సిద్ధము చేసుకొనుట నాయకలక్షణములలో నొకటి" అని వీరిని గూర్చి తెలిపినారు.

ప్రజలలో జాగృతిని గుర్తించి, వర్ధిల్లుతున్న సంస్థలను ప్రోత్సహించి, యువకులలో నూతన ఉత్సాహాన్ని నింపి, పరస్పర వైరుధ్య భావము లేకుండా సక్రమ మార్గాన, పాయలు, పాయలుగా ఉన్న వివిధోద్యమాలను ఏకోన్ముఖముగా నడిపించుటలో హనుమంతరావు గారి కృషి అనన్య సామాన్యమైనది.

11, 12 నవంబర్ 1921న శనివారం రాత్రి, గౌలీగూడలోని వివేకవర్ధనీ థియమేటర్‌నందు హిందూసంఘ సంస్కార సభ జరుగుచున్నది. దీనికి పూనాలో మహిళా విశ్వవిద్యాలయపు ప్రతిష్ఠాపకులు, సంఘసంస్కార పరాయణులు అయిన థొండు కేశవ కార్వే అధ్యక్షత వహించారు. అధ్యక్షులు మహారాష్ట్ర వారగుటచేత ఈ సభలో మహారాష్ట్ర, కర్ణాటక వారు ఎక్కువగాను తెలుగువారు తక్కువగానూ వున్నారు. అందువల్ల సభలో మరాఠి, కన్నడ భాషలలోనే ఉపన్యాసములు జరుగుతున్నవి. వేదికపైన ఉన్న హనుమంతరావు ప్రభృతులు తెలుగులో ఉపన్యసించాలని నిర్ణయించుకున్నారు. **హనుమంతరావు గారు తెలుగులో ప్రసంగించినపుడు కొంచెం శాంతముగా ఉండి, ఆలంపల్లి వేంకట్రామారావు, హైకోర్టు వకీలు ప్రసంగిస్తున్నపుడు అల్లరి చేయసాగినారు. వారి ఉపన్యాసం మధ్యలో ముగించవలసి వచ్చినది. ఇది తెలుగువారికే జరిగిన అవమానంగా భావించారు. అసమ్మతి సూచనంగా ఆ సభ నుండి 12 మంది తెలుగు పెద్దలు సభను విడిచివెళ్ళినారు. ఆ రాత్రే ట్రూప్బజారులో గల టేకుమళ్ళ రంగారావు, హైకోర్టు వకీలు ఇంట్లో సమావేశమై 'ఆంధ్రజనసంఘము' ను స్థాపించి, హనుమంతరావును కార్యదర్శిగాను 1. టేకుమళ్ళ రంగారావు 2) మిట్టా లక్ష్మీనరసయ్య 3) ఆదిరాజు వీరభద్రరావు 4) నడింపల్లి జానకిరామయ్య 5) బూర్గుల రామకృష్ణారావు 6) మందుముల నరసింగరావు 7) బోయినపల్లి వెంకట రామారావు 8) కొమ్మవరపు సుబ్బారావు 9) బూర్గుల నరసింహారావు 10) పందిటి రామస్వామినాయుడులు సభ్యులుగా నియమింపబడి ఒక రూపాయి చందానిచ్చు తెలుగువారు సభ్యుల ఉండునట్లు నిర్ణయించి ఆంధ్రోద్యమానికి విఘ్నేశ్వరపూజ చేసినారు. ఆనాటినుండి హనుమంతరావు విధి విరామము లేకుండా ప్రచారము సాగించి మూడు నాలుగు సంవత్సరాలలో వరంగల్, ఖమ్మం, పరకాల, నల్లగొండ, సికింద్రాబాదులలో ఆంధ్ర జనసంఘాలు 50 వరకును, సుమారు 90 గ్రంథాలయములు స్వతంత్రముగా ఏర్పడి విద్యా ప్రచారము చేసినవి. హనుమకొండలో ఆంధ్ర జనసంఘముల ప్రతినిధులు 1923 మార్చి నెలలో సమావేశమై 'నిజాం రాష్ట్రాంధ్ర జనకేంద్రసంఘము" ఏర్పాటు చేయుటకు తీర్మానములు చేసినారు.** 277 జులై 1923 హైద్రాబాదులోని ట్రూప్‌బజారులో గల హనుమంతరావు గారింట్లో ప్రథమ ఆంధ్ర జనకేంద్రసంఘ సమావేశం జరిగింది. దీనిలో ఇతర తీర్మానాలతోపాటు గ్రంథాలయాలను, పఠనా మందిరాలను స్థాపించుట, విద్యార్థులకు సహాయము, ప్రోత్సాహము చేయుట, తాళపత్ర గ్రంథాలు, శాసనములు స్వీకరించుట, పరిశోధించుట, ఆంధ్ర భాషా ప్రచారమునకై ప్రచారము చేయుట వంటి తీర్మానాలు చేసినారు. రెండవ సమావేశము నీలగిరి పత్రికా సంపాదకులు షబ్నవీసు వేంకట నరసింహారావు కార్యాలయ ఆవరణ నల్లగొండలో 21 మార్చి 1924న జరిగింది. ఇక్కడ చేసిన తీర్మానాలలో ఒకటి 'ఆంధ్ర పరిశోధక మండలి' పేరుతో ప్రారంభమైన పరిశోధనా సంఘాన్ని కొమర్రాజు, వేంకట లక్ష్మణరావుగారు మరణించుట వల్ల 'లక్ష్మణరాయ పరిశోధక మండలి'గా మార్చి ఆంధ్రజనకేంద్రసంఘం క్రింద పనిచేయునట్లు తీర్మానం చేసినారు. 2 డిసెంబర్ 1922న సూర్యాపేటలో వర్తకసంఘం స్థాపించారు. ఈ సంఘనియమాలను మాడపాటి హనుమంతరావు రూపొందించి అందించారు. ఈ నియమాలే తదనంతరము స్థాపితమైన అనేక వర్తక సంఘాలకు మార్గదర్శకమైనాయి.

మూడవ కేంద్ర జనసంఘ సమావేశము 21 ఫిబ్రవరి 1924లో




1336 షాద్‌నగర్‌లో జరిగిన 5వ ఆంధ్ర మహాసభలో పాల్గొన్న అధ్యక్షులు శ్రీ కొండా వెంకటరంగారెడ్డి, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు మరియు ఇతర నాయకులు

మధిరలో, పింగళి వెంకటరామారెడ్డి కర్మాగార ఆవరణలోను జరిగింది. నాలుగవ సమావేశము 22, 23, 24 జూన్ 1926 న సూర్యాపేటలో జరపటానికి నిశ్చయించి అన్ని ఏర్పాటులు చేసుకొన్నప్పటికి, జిల్లా పోలీసు మొహతెమీం ఈ సభల సమావేశ విషయము నిజాం ప్రభుత్వ అంగీకారము పొందిన గాని వీలులేదని తానే స్వయంగా సూర్యాపేట వచ్చి ఆహ్వాన సంఘ సభ్యులను పిలిపించి సభలను నిలిపివేయాలని ఆదేశించారు. మాడపాటి హనుమంతరావు, కోదాటి రామకృష్ణారావులు స్వయంగా వెళ్ళి మొహతమీముకు ఎంతో నచ్చజెప్పినా అన్ని ప్రయత్నములు వ్యర్థమయినవి. ఈ సభల విషయం హైకోర్టుకు లాగాలని నిర్ణయం తీసుకొని అమరవాది వెంకటనర్సయ్య జిల్లా న్యాయస్థానంలో పిటిషన్‌దాఖలు చేయగా, 19 జూన్ 1926న తీర్పు ఇస్తూ, ఈ సభలకు నిజాం ప్రభువు అనుమతి కావాలని పేర్కొన్నారు. దీనిపై పుంజాల రంగారావు హైకోర్టునందు అప్పీలు దాఖలు చేసినారు. హైకోర్టునందు తీర్పు ప్రజాపక్షమునకు అనుకూలముగా వచ్చినది. అయినను పోలీసు అధికారులు తీర్పును తమకు అనుకూలంగా మలుచుకొని, సభకు అనుమతి నిరాకరించారు. ఆంధ్ర జన కేంద్ర సంఘ కార్యదర్శిగా ఉన్న హనుమంతరావు ఈ విషయాన్ని కొత్వాల్ నాజము గారికి దరఖాస్తు ద్వారా నివేదించుకోగా '' you will note that within its (Farmas) prorisionl are included all meetings withch likely to produce any in this insteous Director general is not prepare to limit the diserition desereation of local officers...(9.5.1927) అని ప్రత్యుత్తరమిచ్చినాడు. దీనిలో రాజ్యాంగ విషయక ఫలితములను కలిగించగలవని తోచు సభలన్నిటికి చేరియున్నవి. అందువలన నాజముకొత్వాల్ స్థానికాధికారుల వివేచనకు హద్దులు ఏర్పరుచుటకు సిద్ధంగా లేదు అని హైకోర్టు ఉత్తర్వునకు విపరీతార్థము ఇచ్చినాడు. ఈ ఉత్తర్వులతో ఏవి రాజకీయ సభలు అనే చర్చ మాడపాటి హనుమంతరావు ప్రజల్లో సమర్థవంతముగా రేకెత్తించాడు. రాజకీయములననేమి? రాజకీయ విషయములేవి? తనకు పట్టిక దయచేసి పంపండి, దానినుసరించుకొని మా కార్యక్రమము సవరించుకొందుము. అని ప్రభుత్వమునకు హనుమంతరావు పదే పదే వ్రాసిరి. ప్రభుత్వము నుండి తృప్తికరమైన సమాధానము రాలేదు. గస్తీ నిషాన్-53 విషయములో నిజాంసంస్థానం ప్రముఖులను, పోలీసుశాఖ మంత్రిని అనేక మార్లు కలిసి విజ్ఞాపన పత్రములందించారు. 'మందమందముగానైన గట్టి పట్టుదలతో ముందంజవేయవలయును' అనే సూక్తితో నిరంతరం గస్తీనిషాన్ ఎత్తివేయుటకు హనుమంతరావు కృషి చేశారు. 30.9.1925 నాడు ఉస్మానియా విశ్వవిద్యాలయ పట్టభద్రుల సన్మానసభను, హనుమంతరావు, కొండా వెంకట రంగారెడ్డి, కైలా బలవంతరెడ్డిలు నిర్వహించారు. ఈ రెండవ సభను హనుమంతరావుగారు 5-12-1926న నిర్వహించారు. హైద్రాబాదులో మొదటి ప్రజాపక్ష విద్యా మహాసభ నిర్వహించటానికి ప్రారంభ సమావేశం 21 ఆగస్టు 1928న మాడపాటి హనుమంతరావు, కేశవరావు కొరట్కర్, వినాయకరావు విద్యాలంకార్, బూర్గుల

రామకృష్ణారావులు నిజాంరాష్ట్రంలో విద్యారంగంలో జరుగుతున్న పక్షపాత వైఖరికి నిరసనగా సుదీర్ఘంగా చర్చించి, తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మాతృభాషలో విద్య కొనసాగించాలని భావించారు. ఆ నిర్ణయానుసారం మొదట ప్రజాపక్ష విద్యామహాసభ 1929 అక్టోబరులో రాజా ధన్‌రాజ్‌గిరి అధ్యక్షతన జరిగింది. రెండవసభ 5 ఆగస్టు 1930న ధర్మవీర్‌వామన్‌నాయక్ అధ్యక్షతన జరిగింది.

హనుమంతరావు గారు విసుగు, విరామము లేకుండా గ్రంథాలయ సభలు, ఆంధ్ర యువకసభలు, ఆంధ్ర మహిళాసభలు, వైశ్యయువజన సభలు లాంటి అనేకసభలు వివిధ వర్గసభ్యుల ఆశయాలతో ఏకీభవించి, ఆ సభా సమావేశాలను ప్రోత్సహించి, పోటీతత్వము లేకుండా, పరస్పర విద్వేషభావం లేకుండా, అన్ని సంఘాలను బలోపేతము చేసినపుడే తెలుగువారి పూర్ణవికాసం జరుగునని భావించారు. ఈ వివిధ వేదికలపై యుండువారిని ఒక్క వేదికపై కెక్కించుట అవసరకర్తవ్యమని భావించి హనుమంతరావు తెలంగాణాలోని సకలాంధ్ర జనాభ్యుదయ ఆశయముతో ఆంధ్ర మహాసభను స్థాపించుటకు హనుమంతరావు సంకల్పించారు.

ప్రథమాంధ్ర మహాసభ సమావేశము నిర్వహణకు మెదకు జిల్లాలోని జోగిపేట పౌరులు ఉత్సాహం జూపినారు. 5 మార్చి 1930న ఈ సమావేశం సురవరం ప్రతాపరెడ్డి గారి అధ్యక్షతన జరిగినది. క్రమంగా ఈ సభలు 1946 వరకు 14 ఈ సభలు జరిగాయి. సిరిసిల్లలో జరిగిన నాల్గవ ఆంధ్రమహాసభకు అధ్యక్షుగా మాడపాటి హనుమంతరావుగారు ఎన్నుకోబడినారు. మొదటి మూడు సభలలో యువకులను ముందుకు తోసి అధ్యక్షులుగా వారిని నియమించి ప్రోత్సహించినారు గాని తాము అధ్యక్షులుగా ఉండటానికి ఇష్టపడలేదు. ఈ విషయాన్ని గ్రహించిన ఆహ్వానసంఘం వారు, వివిధ సంఘములవారు ఏకవాక్యముగా హనుమంతరావునే అధ్యక్షులుగా ఉండ నిర్బంధించిరి. ఈ సిరిసిల్ల సభలో ఆంధ్రమహాసభను శాఖలుగా గ్రామసంఘాలు, తాలూకాసంఘములు, జిల్లా సంఘములు స్థాపించుట, ఆంధ్ర మహాసభకు ప్రతినిధుల నెన్నుకొనుట, ఆ ప్రతినిధులలో నుండి స్థాయిసంఘము ఏర్పడుట, స్థాయిసంఘం నుండి కార్యకారిణీ సంఘం నెన్నుకొనుట ఈ విధంగా వివిధ దశల్లో నిర్మాణమును రూపొందించినారు. దీనికై నియమావళి, ఉపనియమావళిలు రూపకల్పన చేసినారు. ఈ సభలో హనుమంతరావు, లౌకికప్రజ్ఞ, దూరదర్శిత్వము, సమయోచిత ప్రస్తావన, రాజకీయ శాస్త్రాల మర్యాద ప్రియత్వము, రాజ్యాంగ సూత్ర వేదిత్వము సోపానపరంపరా నిర్మాణ కౌశల్యము ఈ సభలో ప్రస్ఫుటముగా కన్పించాయి.

ఈ సభలు సక్రమంగా జరుగుతూ తెలుగువారు తెలివిమీరి నిజామాబాద్ నందు జరిగిన ఆరవ ఆంధ్ర మహాసభలో చిన్న అపస్వరము ప్రతిధ్వనించి 'అభివృద్ధి పక్షము పేరిట కొందరు విద్యావంతులైన యువకులు సురవరం ప్రతాపరెడ్డి ప్రోత్సాహంతో చిన్న పూరిత పస్వరాన్ని వినిపించగా ఆ సభాసమావేశములో గద్గదిగ కంఠంతో బాష్పపూరిత నేత్రములతో హనుమంతరావు గారు చేసిన ప్రసంగముతో అభివృద్ధి పక్షము వికసించకమునుపే అంతరించింది. అభివృద్ధి పక్షీయులు తమ పొరపాటును గ్రహించి మల్కాపురంలో జరిగిన ఏడవ ఆంధ్ర మహాసభలో యువకుల దృక్పథం కొత్తవిధముగాకానవచ్చెను. రష్యావారి సామ్యవాదము ఆనాటికే యువకులలో ప్రవాహరూపాన ప్రవేశించి చిలుకూరులో జరిగిన ఎనిమిదవ ఆంధ్రమహాసభ నాటికి ఆ జడివానలో తడిసి, అవభృథస్నానముతో యువకులు కామ్రేడు బిరుదాంకితులైరి. వీరి నూతన ఆవేశము ఆ సభల తర్వాత భిన్నదృక్పథం త్రొక్కింది.

ఆంధ్రమహాసభలతోపాటు నడింపల్లి సుందరమ్మ సహకారంతో ప్రత్యేకముగా ఆంధ్ర మహిళా సభలను జరుపు ఏర్పాట్లు చేసి చివరివరకు నిర్వహించారు. హరిజనుల విద్య విషయములో రాయి కిషన్ బారిస్టర్ సహాయ కార్యదర్శులుగాను, ఆది హిందూ సాంఘిక సేవాసమితి కార్యకర్తలుగా కొంతకాలం కృషి సల్పియున్నాడు. సంవత్సరము పొడుగున ప్రజలు స్వయంగా స్వవిషయములను తెలుసుకొని ధైర్యముతో పాటుపడుటకు గాను లఘు పుస్తక ప్రచురణ ప్రారంభించి సుమారు 25 పుస్తకములు ప్రకటించారు. అందులో- నిజాం రాష్ట్రాంధ్రులు, వర్తక స్వాతంత్ర్యము, వెట్టిచాకిరి, వ్యవసాయకులకు కొన్ని సూచనలు, మద్యపానము, గ్రంథాలయములు, మన వాక్స్వాతంత్ర్యము, ఋణబాధానివారణ, మన విద్యాసమస్యలు, గష్తీనిషాన్ 53 యొక్క వివరణము, జనపరిగణన వృత్తాంతములు, నిజాం రాష్ట్రాంధ్రుల అభివృద్ధి మార్గములు, మొహతర్పా, న్యాయస్థాపనములు, దేశభాషలు అనునవి ముఖ్యముగా పేర్కొనదగినవి. వీటి వెల అర్ధణా, అణా మాత్రమే. వేలకొలది కాపీలు అమ్ముట వలన ప్రజలలో చైతన్యం కలిగినది. ఈ పుస్తకాలను దేశాభిమానులైన కార్యకర్తలు పలువురు రచించారు.

ఆంధ్రుల మహిళా ఉద్యమము చక్కగా సాగవలెనంటే స్త్రీలు విద్యావంతులు కావాలని భావించి హనుమంతరావుగారు పరోపకారిణి బాలికా పాఠశాలను, అఫ్‌జల్‌గంజ్ బాల సరస్వతీ యాంధ్ర భాషా నిలయములో నెలకొలిపి నిర్వహించారు. రామచంద్రనాయక్, రాయ్ విశ్వేశ్వరనాథ్, అహల్యాభాయి, మల్లన, శ్రీమతి సులోమాభాయిల సహకారముతో ఒక సంఘముగా ఏర్పడి రెసిడెన్సీ బజారు బ్రిటీషు యాధిపత్యములో నుండుట చేత అచ్చట ఎట్టి చిక్కులు లేని స్వేచ్ఛావాతావరణం ఉండుటతో తెలుగు మహారాష్ట్ర భాషలలో ఉన్నత విద్య నిచ్చే 1946లో బాలికా పాఠశాలను రెసిడెన్సీ బజారులో స్థాపించారు. హనుమంతరావు మొత్తం తానే వహించి మహారాష్ట్రులతో సంబంధము లేకుండా దానిని ఆంధ్ర బాలికల ఉన్నత పాఠశాలగా మార్చిరి. ఉస్మానియా, నాగపూరు, ఆంధ్ర విశ్వవిద్యాలయాలతో హనుమంతరావు గారు సంప్రదింపులు జరిపినప్పటికిని వీరు ఈ బాలికల ఉన్నత పాఠశాలను తాను విశ్వవిద్యాలయ అనుబంధ సంస్థగా గుర్తించ నిరాకరించిరి. దానితో పూనాలోని శ్రీమతి నాతీభాయి దామోదర థాకర్సె భారత మహిళా విశ్వవిద్యాలయం వారితో సంప్రదింపులు జరిపారు. దీనికి ప్రభుత్వ ఆమోదం లేనప్పటికి, మహిళా విద్యా విషయమున ఎం.ఏ. పరీక్ష వరకు మంచి వ్యవస్థ కల్పించి మాతృభాషకు ప్రాధాన్యమిచ్చుచుండెను. ఈ విశ్వవిద్యాలయమువారు ఆంధ్రములో పరీక్షలు నిర్వహించి యోగ్యతా పత్రమును ఇచ్చుటకు సమ్మతించిరి. ఈ పాఠశాలను 1932లో హనుమంతరావుగారు పై

విశ్వవిద్యాలయమునకు అనుబంధముగా మార్చినారు. ఈ పాఠశాల హైద్రాబాదులోని తెలుగు బాలికల విద్యా విషయంలో కల్పవల్లిగా మారింది. హనుమంతరావుగారి కృషి ఫలితంగా 1945లో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అనుబంధంగా మారింది. ఈ పాఠశాలలో సామాన్య విద్యయేగాక, ప్రథమ చికిత్స, కుట్టుపని, సంగీతము, మాతృభారతి పత్రిక మొదలగు విశేష శాఖలలో శిక్షణను హనుమంతరావు బాలికలకు ఇప్పించారు.

బ్రిటీషు ఆంధ్రులు-నిజాం ఆంధ్రులు అను నినాదము శ్రీకృష్ణదేవరాయంధ్ర భాషానిలయములో చేసి గొప్ప వివాదమునకు కారణము కాగా హనుమంతరావు మునగాల రాజా నాయని వేంకట రంగారావులు ఇతర కార్యకర్తల సహకారముతో ఈ వాదాన్ని ఖండించారు. ఆంధ్రోద్యమము రాజకీయ ఉద్యమము గాదని హనుమంతరావుగారి వాదన. అందువలన "తెనుగు పత్రికలు" మన సంఘములు ముఖ్యముగా విద్య, విజ్ఞానము, నీతిని వీటిని అభివృద్ధి పరప యత్నించారు. దయామయులగు ప్రభుత్వము వారు సర్వవిషయములందును మన అభివృద్ధికై పాటుపడుచున్నారు. కనుక రాజ్యాంగ విషయములతో మనకేమాత్రము పనిలేదు" అని వ్రాసినారు. కాని ఆంధ్ర మహాసభ రాజకీయ సభలుగా మారుటకు హనుమంతరావు అంగీకరించనప్పటికీ, ప్రభుత్వ నిర్బంధము, ఆంక్షలు మాత్రమే కారణం. రాజ్యతంత్రము మారినగాని, సమావేశ స్వాతంత్ర్యము, వాక్స్వాతంత్ర్యము లభించదని యువకులకు రూఢీ అయినది. ఎనిమిదవ సభ నుండి ఆంధ్రోద్యమ కార్య విధానము, ఆదర్శము మారినది. సభల విషయమునెట్లో, పత్రిక విషయములోను నిజాం సర్కారు అట్లే వ్యవహరించినది. హనుమంతరావు 'హైద్రాబాద్ పత్రిక' అను పేర ఒక పత్రికను నడపదలచి మూడుసార్లు ప్రభుత్వ అనుమతి కోరి విఫలులైరి. తర్వాత తెలంగాణా పత్రికను స్థాపించుటకు ప్రయత్నించి ప్రభుత్వానుమతి దొరకలేదు. ప్రభుత్వం దృష్టిలో హనుమంతరావు అపాయకరమైన వ్యక్తిగా నుండెను. క్రమంగా హనుమంతరావును గూర్చి, ప్రజాహిత కార్యక్రమాలు నిబద్ధతను గూర్చి తెలుసుకుని ప్రభుత్వం అనుమతి ఇవ్వ సిద్ధపడగా, హనుమంతరావు సంసిద్ధులుగాలేరు. అప్పుడు శ్రీమాన్ బుక్కపట్టణం రామానుజాచారి సర్కారువారి అనుమతి పొంది 'తెలంగాణ పత్రిక' నిర్వహించగా వారికి హనుమంతరావు సహకారము అందించినారు.

హనుమంతరావు వైదుష్యము విశాలమైనది. వారికి తెలుగు, ఉర్దు, ఫారసీ, ఇంగ్లీషు భాషల యందు గట్టిసాహిత్య పటిమ, మరొకటి హిందీ భాషల పరిచయము ఉంది. ఈ భాషలలో అనువాదము చేయగల పాండిత్య ప్రతిభ ఉండినది. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో చమత్కారముగా, ఆకర్షణీయంగా, ధారాళముగా ఉపన్యసించి ప్రేక్షకులను ఆకర్షించేవారు. వీరి మొట్టమొదటి గ్రంథము బంకించంద్ర 'ఆనందమఠ గ్రంథం అనువాదం. ఇది ముద్రాముఖము చూడకముందే దొరసామయ్య అనువాదము వెలువడుటచే దీనిని ప్రచురించలేదు. ఆ తరువాత గ్రంథం ఇటలీ దేశభక్తుడు గ్యారీబాల్డీ జీవితం. దీనిని 1911లో వ్రాసినారు. ఈ గ్రంథరచన తెలుగులో చేయుటకు కారణం తెలుగులో మంచి స్వాతంత్ర్య సమర యోధుల జీవిత చరిత్రలు లేకపోవుట, దేశాభిమాన పూరిత రచనల చారిత్రక అవసరము అని గుర్తించి రచించినారు. మచిలీపట్నంలోని ఆంధ్ర భాషాభివర్ధినీ సంఘమువారు కొంతకాలము ఉంచుకొని ప్రచురించక వెనక్కి ఇచ్చివేసినారు. కోలవెన్ను రామకోటేశ్వరరావు ప్రయత్నించినారు గాని ప్రచురించలేదు. రోమన్ సామ్రాజ్య చరిత్ర, మూడవ గ్రంథం. ఇది అసంపూర్ణం. 'క్షాత్రకాలపు హిందువ్యార్యులు' వీరి నాల్గవ గ్రంథం. ఇది 1927లో ముద్రణ భాగ్యమునొంది కీ.శే. పువ్వాడ వేంకటప్పయ్య తమ కృషి ప్రచారిణి గ్రంథమాలలో రెండవ కుసుమంగా వెలువరించారు. ఇది బొంబాయి వాస్తవ్యులు, హనుమంతరావు మిత్రులు రావు బహద్దర్ చింతామణిరావు వైద్య వ్రాసిన 'ఎపిక్ ఇండియా' అను ఆంగ్ల గ్రంథములోని వ్యాసాలకు తెలుగు అనువాదం వీరి 'మహాభారత సమీక్షణము'ను కూడా హనుమంతరావు తెగించి ఆంధ్రభారతి, ఆంధ్రాభ్యుదయము, దేశబంధు మాసపత్రికలలో ప్రచురించారు. ఫారసీ కవుల గురించి కొన్ని వ్యాసాలు సుజాత పత్రికలో వెలువరించారు. కథానికలు తెలుగులో తెలంగాణలో నూతన పద్ధతుల మీద రాసిన ఘనత హనుమంతరావు గారిదే వాటి పేర్లు 1.హృదయశల్యము 2. రాశీసారంధా 3. ముసలిదాని యుసురు 4. నేనే 5. అగ్నిగుండము 6. నాడు నీ పంతము నేడు నా పంతము 7. ఆత్మార్పణము 8. విధి ప్రేరణము 9. ఎవరికి? 10. న్యాయమా 11. ఎవరిది తప్పు 12. ఇక కావలసినదేమి 13. నిజమేనా? మొదలైనవి. ఇందులో మొదటి 7 కథలు మల్లికాగుచ్ఛము పేరున మచిలీపట్టణములోని సరస్వతీ నికేతనమువారు 1911లో పుస్తక రూపేణ ప్రచురించారు. 'విధి ప్రేరణము' ఎవరికి? అనునవి హైద్రాబాదు నగరంలో అణాగ్రంథమాల వారు ప్రచురించారు. మిగతా నాలుగు కథలు సుజాత, భారతి, శారద మాసపత్రికలలో దాగుకొన్నాయి.

'నిజాం రాష్ట్రంలో రాజ్యాంగ సంస్కరణలు' అను ప్రజాపరిషత్ వల్ల ఏర్పడిన కమిటీ నివేదికను తెలుగు, ఆంగ్ల భాషలలో హనుమంతరావు గ్రంథ రూపేణ ప్రచురించారు. నిజాం ప్రభుత్వం రాజ్యాంగ ప్రణాళికను నిర్మించుటకు అహరహము అయ్యంగార్ కమిటి ఏర్పరచగా, ప్రజల అభిప్రాయాలు సూచించుటకు ప్రజాపక్షమున ఒక సమితి ఏర్పడిరది. ఈ సమితిలో హిందు, మహమ్మదీయ, ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రముఖ నాయకులు ఉన్నారు. దీనికి అధ్యక్షులుగా హనుమంతరావు గారే ఉన్నారు.

వీరి తెలుగు కవిత్వరీతిని తెలుపుటకు రెండు పద్యములు ఉదహరించుచున్నాను.

**1. ఫిర్దౌసీకృత పార్సీపద్యమునకనువాదం.**

"హీనుల మహోన్నత పదవి కెత్తుటయును
ఎత్తివారి యుపకృపఆశించుటయును
స్వీయమానధనము బుగ్గిసేయుటకును
సర్పమును దనజేబులో సాదుటగును"

**2. స్వంత పద్యము**

ఫలముల చేత గొన్నిటిని
బల్లవ సంతతిచేత గొన్నిటిన్
సలలిత సౌఖ్యదాయి యగు
ఛాయను గొన్నిటి వే విధాల నీ
యిలను ననేక ప్రాణులక
హీన సుఖింబిడు వృక్షరాజమున్

బలువడి పీకి వైచితె తు

పాన! వినాశము చేసి వైచితే

1946లో మాడపాటి హనుమంతరావు షష్టిపూర్తి ఉత్సవాలను తెలంగాణా అంతటా ఉత్సాహంతో ప్రజలు నిర్వహించినారు. హైద్రాబాద్‌లో మా రాజబహద్దూర్ వెంకట రామిరెడ్డి అధ్యక్షతన, కొండా వెంకట రామారెడ్డి గారు కార్యదర్శిగా ఆహ్వానసంఘం ఏర్పడి 1946 ఫిబ్రవరి 6, 7 తేదీలలో రెడ్డి హాస్టల్ ఆవరణలో కడపకోటిరెడ్డి అధ్యక్షతన పండగ వాతావరణంలో సభలు జరిపి సాహిత్య విలువ గల షష్టిపూర్తి, సంచికను జీవిత విశేషాలతో ప్రచురించారు. తెలంగాణలో జరిగిన "ఆంధ్రోద్యమాన్ని" రెండు భాగాలుగా హనుమంతరావు గారు రచించారు. ఈ గ్రంథాన్ని సూర్యాపేట వర్తక సంఘం వారు హనుమంరతావు గారి సేవకు ప్రతిగా ప్రచురించి సూర్యాపేటలో 1946లో ఆవిష్కరించారు.

పోలీసు యాక్షన్ తర్వాత 1951లో హైద్రాబాద్ నగరపురపాలక సంఘానికి ప్రథమ మేయర్‌గా మాడపాటి హనుమంతరావుగారు ఎన్నికయి 1954 వరకు కొనసాగారు. 1951 నుండి ఉస్మానియా విశ్వవిద్యాలయ సెనట్ శాశ్వత సభ్యులుగా కొనసాగారు. 1956లో జరిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్‌ను హనుమంతరావునకు ప్రధానం చేశారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత 1958లో లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు శాసనసభ్య నియోజకవర్గం నుండి ఎన్నికై, శాసనమండలి ఛైర్మన్‌గా ఎన్నుకోబడి 1958 నుండి 1964 వరకు ఆరు సంవత్సరాలు శాసన మండలి కార్యక్రమాలను హుందాగా, నిష్పక్షపాతంగా నిర్వహించారు. 1955లో కేంద్రప్రభుత్వం 'పద్మభూషణ్' బిరుదునిచ్చి సత్కరించింది. ఈ బిరుదు అందుకొన్న తొలి తెలుగువారు వీరే. హనుమంతరావుగారికి తన మేనమామ కుమార్తె అన్నపూర్ణమ్మతో వివాహం జరిగింది. ఆమె 1917లో మరణించగా, గోళ్ళమూడి హనుమంతరావు కుమార్తె మాణిక్యమ్మతో రెండవ వివాహం 1918లో జరిగింది. హనుమంతరావు పుత్రికను గుంటూరులో న్యాయవాదిగా వున్న గోవిందరాజుల దత్తాత్రేయరావునకు ఇచ్చి వివాహం చేశారు. రెండవభార్య మాణిక్యమ్మ, హనుమంతరావుతో అన్ని ప్రజాహిత కార్యక్రమాల్లోను పాల్గొన్న విద్యా వివేకవతి.

హనుమంతరావుగారు 1970 నవంబరు 11న హైద్రాబాద్‌లో ప్రజాజీవితయాత్రను చాలించారు.

**హనుమంతరావు గారి ఆంధ్రాభిమానం, తెలంగాణ జాగృతం చేసిన చైతన్యం, తెలుగువారిలో ఆత్మాభిమానం కలిగించడానికి చేసిన కృషి- కాపులేని మందవలె బెదిరి బెదిరి ఉన్న తెలంగాణ తెలుగు సమాజాన్ని కూడగట్టి, తన ప్రతిభా ఉత్పత్త్యభ్యాసములచే ప్రతికూల పరిస్థితులను తొలగించి, క్రమశిక్షణా దక్షమయిన మార్గమున నడిపించి, తెలుగునాడును వెలుగునాడుగా మార్చిన ఆయన పట్టుదల ఎన్నటికీ మరువరానిది. తెలంగాణా ప్రజానీకం ఎప్పుడూ 'ఆంధ్రపితామహుడు' గానే వీరిని స్మరించుకుంటుంది.**

వ్యాసకర్త ప్రముఖ పరిశోధకుడు,
రచయిత, గ్రంథకర్త.

12 వ పుట తరువాయి ....

## 44వ భారతీయ భాషా శాస్త్రజ్ఞుల...

ఉండకూడదు, అంటూ సదస్సుకు వచ్చినవారికి అభినందనలు తెలుపుతూ ముగించారు.

మూడు రోజులపాటు జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో మూడు వందలమందికి పైగా వివిధ రాష్ట్రాలనుంచీ వివిధ దేశాలనుంచి ప్రతినిధులు పాల్గొనగా, రెండువందలకుపైగా పరిశోధకులు 136 పరిశోధనా పత్రాలను ప్రకటించారు. వీటితోపాటు క్లాసికల్ భాషల సదస్సును ఒకదానిని నిర్వహించారు. సదస్సుకు ప్రత్యేక ఆహ్వానితులుగా అమేరికాలోని స్టోనీబ్రూక్ విశ్వవిద్యాలయ ఆచార్యులైన శ్రీ ఎస్.ఎన్. శ్రీధర్ నాగరిక ప్రక్రియగా భాషా మిశ్రణం: భారతీయ బహుభాషీయత, బహుభాషా సిద్ధాంతంలో భాషా పరస్పరత, సాహిత్య సృజనాత్మకత అనే విషయంపై సదస్సులో అత్యంత ఆసక్తిని రేకెత్తించిన ప్రసంగం చేశారు. అందులో ప్రధానంగా భాషలు ఇచ్చి పుచ్చుకోవడంద్వారానే సాహిత్య సృజనకు వీలు కలిగించిందనీ తద్వారా నేటి భారతీయ భాషా సమాజం ఏర్పడిందనీ పేర్కొన్నారు. ఆచార్య దేవయానీ శర్మ, క్వీన్ మేరీ విశ్వవిద్యాలయం, లండన్ నుంచీ 'భారతీయ ఆంగ్లంలో వాక్యనిర్మాణ భేదాలు, ప్రాకృతిక భాషా ప్రక్రియలలో వాటి ప్రమేయం' అనే విషయం పైనా, ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండీ ఆచార్య శోభాసత్యనాథ్ '60వ దశకం ఆపైన సామాజిక భాషాశాస్త్రంలో పోకడలపై సింహావలోకనం' అనే అంశంపైనా, ఆచార్య ప్రొబాల్ దాస్ గుప్త, 'వ్యాకరణానికి భావుకత తోడు: భాషశాస్త్ర అధ్యయనంలో నియత సామాన్య పద్ధతిపై రవీంద్రనాథ ఠాకూర్ విమర్శ' అనే అంశంపైనా ప్రసంగించారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ నిర్దేశకుడైన ఆచార్య మృణాల చటర్జీ 'భాషల పునర్నవానికి అనువాదాలు' అనే అంశంపై ప్రసంగించారు. డెక్కన్ కాలేజ్ డీమ్డ్ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులైన ఆచార్య ప్రమోద్ కుమార్ పాండే మూడు రోజుల సదస్సు ముగింపు సమావేశంలో 'భాషల వర్ణ విన్యాసంలో, వర్ణోత్పత్తి' పై ఆసక్తి రేకెత్తించే ప్రసంగం చేశారు.

ఈ సమావేశంలో గడిచిన 90 యేండ్లనుండి ప్రచురిచితమవుతున్న ఇండియన్ లింగ్విస్టిక్స్ వెనకటి సంపుటాలన్నింటినీ కలిపి సుమారు 27000 పుటలను డిజిటల్ రూపంలో అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా భారతీయ భాషా శాస్త్రజ్ఞుల సంఘం కొత్తగా పునర్నిర్మించిన జాలస్థలి(వెబ్ సైట్)ని ఆచార్య దేవీ ప్రసన్న పట్టనాయక్ గారి చేతులమీదుగా జాతికి పునరంకితం చేస్తూ విడుదలచేశారు. చివరిగా, 44వ భారతీయ భాషా శాస్త్రజ్ఞుల అంతర్జాతీయ సమావేశ నిర్దేశకులు పద్మశ్రీ దేవీ ప్రసన్న పట్టనాయక్ గారికీ, సెంచూరియన్ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షురాలు డా. సుప్రియా పట్టనాయక్ గారికీ, 44వ భారతీయ భాషా శాస్త్రజ్ఞుల అంతర్జాతీయ సమావేశ నిర్వాహకులైన డా. బిశ్వనందన్ దాస్ గారికీ కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశం ముగిసింది.

సాంకేతికత

శ్రీ గణేశ్ తొట్టెంపూడి
+49 17630163660

# సాంస్కృతిక రక్షణలో సెమాంటిక్ వెబ్ - 1

**చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండగా తెలియని విషయాలకోసం గుగూల్లో వెతకటం ఈ కాలంలో సర్వసాధారణం. కాస్మోటిక్స్ నుండీ కరెంట్ ఎఫైర్స్ దాకా, గ్రామ వార్డునుండీ ప్రపంచ రాజకీయాలదాకా ప్రతిదానికీ గుగూల్ ని వాడుతున్నాం. మనకు కావలసిన సమాచారాన్ని ఆ సర్చి బాక్స్ లో సంధించగానే దానికి సంబంధించిన విభిన్నమైన పేజ్ లింకులు మనకు కింద కనపడతాయి. మనం శోధనకు వాడే గుగూల్ ఒక వెబ్సైట్ మాత్రమే. ఆ సెర్చ్ వెబ్ పేజ్ సైజ్ కూడా KB ల్లోనే ఉంటుంది. మరి మనకు చూపించే డేటాను ఎక్కడ నుండీ శోధించి తీసుకువస్తోంది? ఇంత తొందరగా మిల్లీ సెకన్లలో ఎలా సంబంధిత సమాచారాన్ని తీసుకు రాగలుగుతోంది? ఎప్పుడైనా ఆలోచించారా?**

చాలా మంది చెప్పే సమాధానం ఇంటర్నెట్ లోనుంచి వస్తోంది అని. నిజంచెప్పాలంటే ఇది సరైన సమాధానం కాదు. ఇంటర్నెట్ అన్నది ఒక అనుసంధాన జాలం మాత్రమే. ఇక్కడ మనం ఒక మహానుభావుణ్ణి స్మరించుకోవాలి. ఆయనే టిం-బెర్నెస్-లీ. మనం గుగూల్, మొజిల్లా లాంటి విభిన్న బౌజర్లు వాడేటప్పుడు మనం టైప్ చేసే www ని కనిపెట్టింది వీరే. ఈరోజు మనం వాడుతున్న ఆధునిక సర్చి ఇంజన్‌లకి బీజాలు వేసింది లీ మాత్రమే. ఈ బీజాలు మార్చి 1989 లో మొదటిసారి ప్రారంభించబడి నవంబర్ 1990 నాటికి మొదటి హైపర్ టెక్స్ట్ రూపంలో మొదటి వెబ్ సర్వర్ ప్రజల్లోకి అందుబాటులోకి వచ్చాయి. సుమారు 21 నెలల్లో వెబ్ సర్వర్ తో పాటు హైపర్ టెక్స్ట్ నిర్మించ బడింది. ఇలా నిర్మించ బడ్డ www విభిన్న స్థాయిల్లో సాంకేతిక పరిణామాలని పొంది నేడు మనం వాడుతున్న ఆధునిక అంతర్జాల ఆధారిత శోధనోపకరణాల వాడకానికి అకరంగా ఉపయోగపడుతోంది.

ఇప్పటిదాకా ఈ www చరిత్ర చెప్పటంలో ప్రధాన ఉద్దేశం ఆ పరిణామక్రమంలో ఈ 21వ శతాబ్దంలో ఈ వెబ్ సాంకేతికతకు ఆపాదించబడిన కృత్రిమ భౌద్ధికత ఆధారిత ఆధునిక అనుసంధానం "సెమాంటిక్ వెబ్". పేరుని బట్టే మనం కొంత గ్రహించవచ్చు. భాషాశాస్త్రంలో సెమాంటిక్ అన్న ఆంగ్ల పదానికి "అర్థం" అని అర్థం చెప్పుకుంటే అర్థవంతంగా వెబ్‌లో నిక్షిప్తమైన సమాచారాన్ని ఉపయోగించుకోటం లేదా అర్థవంతమైన (ఖచ్చితంగా) సమాచారాన్ని వెబ్ నుండీ దిగుమతి చేసుకోటం అని స్థూలంగా ఇప్పటికి అర్థం చెప్పుకుందాం. అంటే ఒకవిధంగా చెప్పాలంటే గుగూల్లో మనం ఒక అంశాన్ని సర్చి చేస్తున్నప్పుడు చాలా లింకులు మనకి కింద కనిపిస్తాయి. అలాకాకుండా ఖచ్చితమైన సమాచారాన్ని చూపించటమే ఈ సెమాంటిక్ వెబ్. మనిషి భౌద్ధికత ఏదైనా ప్రశ్న అడిగినప్పుడు, ఆ ప్రశ్నకి ఒక సమాధానం ఇస్తుంది. దీనికి ప్రధాన ఆకరాలుగా, ఇచ్చిన ప్రశ్నని అర్థం చేసుకోవటం, దానికి సంబంధించి మన మెదడులో నిక్షిప్తమైన సమాచారాన్ని అంతా అర్థం చేసుకుని దానికి ఒక సమాధానం ఇవ్వటం. అంటే 'అర్థం' అన్నది రెండు పార్శ్వాలలోనూ ప్రధాన భూమిక పోషిస్తుంది అన్నమాట.

ఇప్పుడు సెమాంటిక్ వెబ్ గురించి తెలిసుకుందాం. దీన్ని వెబ్ 3.0 అనికూడా పిలిస్తారు. ఇది www కి ఇది అడ్వాన్స్ వర్షన్ అనొచ్చు. ఇంకో విధంగా చెప్పాలంటే ఇంటర్నెట్‌లో టెర్రా బైట్స్‌లో ప్రతిరోజూ ఎగుమతి అవుతున్న డేటాను కంప్యూటర్ అర్థం చేసుకునేలా చేసే విధానం సెమాంటిక్ వెబ్. సోషల్ మీడియాద్వారాకానీ, బ్లాగులద్వారా కానీ ఆడియో, వీడియో విధానాలద్వారా కానీ చాలా డేటా ప్రతి నిమిషం ఇంటర్నెట్లోకి ఎగుమతి అవుతూ ఉంటుంది. అది స్ట్రక్చర్డ్ డేటా, అన్‌స్ట్రక్చర్డ్, సెమీ స్ట్రక్చర్డ్ రూపంలో ఉండొచ్చు. దీన్ని ఇంతకు ముందు చెప్పినట్లు కంప్యూటర్, మనిషి మెదడు అర్థం చేసుకున్నట్లు ఈ విభిన్న రకాల డేటాలను అర్థంచేసుకుని దానిమీద సర్చిలో వినియోగదారుడు అడిగిన ప్రశ్నలకి సరైన ఒక్క సమాధానం ఇవ్వటమే సెమాంటిక్ వెబ్ టెక్నాలజీ ప్రాముఖ్యత. రీసోర్స్ డిస్క్రిప్షన్, ఆంటాలజీఅన్నవి ఈ అర్థం చేసుకోటంలో ప్రధాన భూమికని పోషిస్తాయి. సాధారణ హెచ్ టి ఎం ల్ పేజ్‌ని అర్థం చేసుకోటానికి టాగ్స్ ఎలానో ఈ రెంటికీ (రీసోర్స్ డిస్క్రిప్షన్, ఆంటాలజీ) మెటా డేటా అలా ఉపయోగపడుతుంది. మెటా డేటా అంటే డేటా గురించిన డేటా అని అర్థం. ఈ సాంకేతిక పదజాలం గురించి ముమ్ముందు మీకు నా ప్రాజెక్టులో ఉదాహరణలతో సహా వివరిస్తాను. ఫేస్ బుక్ "మెటా" వినే ఉంటారు కదా ఇదికూడా ఇలాంటిదే.



సెమాంటిక్ వెబ్ సృష్టికర్త : టిం-బెర్నెస్-లీ

ఈ సెమాంటిక్ వెబ్ టెక్నాలజీని వాడి మన చరిత్రను, సంస్కృతిని డిజిటల్ రూపంలోకి అనువర్తించి ఎలా పరిరక్షించుకోవచ్చో వచ్చే సంచిక నుండీ ప్రతి సాంకేతిక పదాన్నీ క్లుప్తంగా వివరిస్తూ, మేము గత 4 సంవత్సరాలుగా ఈ టెక్నాలజీలో చేస్తున్న ప్రాజెక్టులను ఉదహరిస్తూ చెప్తాను. ఇలాంటి టెక్నాలజీ మన భాషల్లో అందుబాటులోకి రావాలంటే ప్రధానంగా కావలసింది మన తెలుగు భాష డిజిటల్ రంగంలో విస్తృతంగా అందుబాటులో ఉండాలి. అమ్మభాషను ఆధునిక ఉపకరణాల్లో విస్తృతంగా వాడదాం.

## ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

కృష్ణాజిల్లా రచయితల సంఘం, ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), తానా ప్రపంచ సాహిత్య వేదిక, సిలికానాంధ్ర, సిద్ధార్థ అకాడెమీ- విజయవాడ సౌజన్యంతో ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో

# 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

2022 డిసెంబరు 23,24 శుక్ర, శని వారాల్లో రాజరాజనరేంద్ర సభాప్రాంగణం, పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం, విజయవాడలో విజయవంతంగా జరిగాయి.



'గమ్యం-గమనం' పుస్తకాన్ని విడుదల చేస్తున్న జస్టిస్ నూతలపాటి వెంకట రమణ, తక్కిన పెద్దలు

**స్ఫూర్తిని నింపిన 5వప్రపంచ తెలుగు రచయితల మహాసభలు**

**5వ** ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ఘనంగా జరిగాయి. దేశ విదేశాల నుండి 1600 మంది ప్రతినిధులు తరలివచ్చి, తెలుగు భాషా పరిరక్షణ బాధ్యత తీసుకోవలసిందిగా జనబాహుళ్యాన్ని ఏకగ్రీవంగా కోరిన సమాచారం ప్రజలను చేరింది. మనం మాట్లాడే వాడుక బాషే పెనుప్రమాదంలో ఉన్నదని, తెలుగు వాడకంలో ఉంటేనే భాష సజీవంగా ఉంటుందనే గ్రహింపు తెలుగు వారిలో కలిగించటానికి ఈ మహాసభలు ఎంతగానో ఉపకరించాయి. తెలుగు పత్రికలు ఈ విషయంలో నిర్వహించిన పాత్ర గణనీయమైనది. సహకరించిన సంపాదకులకు పాత్రికేయులకు కృతజ్ఞతలు.

యువ రచయితలు, ఉపాధ్యాయులు ఈ సభల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా ప్రతినిధులు తమ గళాన్ని ఘనంగా వినిపించారు. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో రచయితల పాత్ర అనే అంశంపై ప్రధానంగా జరిగిన సదస్సులలో వివిధ రంగాలకు చెందిన రచయితలు పెచ్చుమీరుతున్న వాణిజ్య సంస్కృతి పట్ల ప్రజల్ని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత గురించి విస్తృతంగా చర్చించారు.

మూడు వేదికలపైన సమాంతరంగా 30కి పైగా సదస్సులు, కవిసమ్మేళనాలు, వివిధ సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. జాతీయ ప్రఖ్యాతి పొందిన యువ అష్టావధానులతో అద్భుతావధానం, 15 మంది కవులతో గజల్స్ ముషాయిరా, కళారత్న కె వి సత్యనారాయణ బృందం నిర్వహించిన ఆముక్తమాల్యద నృత్య రూపకం, నేక్షిత అనే చిన్నారి చేసిన నృత్యప్రదర్శన ఈ మహాసభల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విదేశీ ప్రతినిధుల కోసం, రాష్ట్రేతరాంధ్ర ప్రతినిధులకోసం వేర్వేరు సదస్సులు జరిగాయి.

సభలను ప్రారంభించి, భాషోద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుపోవలసిన అవసరాన్ని భారత పూర్వ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు నొక్కి చెప్పగా, భారత సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ యన్. వి. రమణ తెలుగు భాషను ఆధునీకరించి, సాంకేతిక ప్రగతితో అనుసంధానం చేయటం ద్వారా తెలుగును 'ప్రపంచతెలుగు'గా తీర్చిదిద్దాలన్నారు. యువతను అభ్యుదయమార్గాన నడిచేలా మార్గదర్శనం చేయాల్సిన అవసరాన్ని శ్రీ జె. డి. లక్ష్మీనారాయణ నొక్కి చెప్పగా ప్రభుత్వాధినేతలకన్నా రచయితలే ఎక్కువ ప్రభావశీలురని, సమాజాన్ని మేల్కొల్పగలిగేది వారేనని శ్రీ గరికపాటి అన్నారు. ఎన్ని ఇతర భాషలను ప్రోత్సహించినా మాతృభాషకు ప్రాధాన్యత తగ్గకూడదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ ఎ. వి. శేషశాయి అన్నారు.

సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. భవిష్య కార్యాచరణతో మరిన్ని కార్యక్రమాల నిర్వహణకు ఈ మహాసభలు స్ఫూర్తిదాయకం కాగలవని నమ్ముతున్నాం.

మండలి బుద్ధప్రసాద్, గుత్తికొండ సుబ్బారావు, డా॥ జి.వి.పూర్ణచందు
గౌరవాధ్యక్షుడు అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి

# 'ప్రజల భాషలోనే పరిపాలించాలి; ప్రాథమిక విద్య మాతృభాషలో ఉండాలి': ప్రపంచ రచయితల సభలను ప్రారంభిస్తూ గౌ.శ్రీ వెంకయ్యనాయుడు ఉద్ఘాటన



ముఖ్య అతిథి భారత మాజీ ఉపరాష్ట్రపతి గౌ. శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు జ్యోతి వెలిగించి సభను ప్రారంభిస్తున్న దృశ్యం

**భా**వితరాలకు అమ్మభాష చేరువ చేసేందుకు మాతృభాష పరిరక్షణ ఉద్యమం ఇంటి నుంచే ప్రారంభం కావాలి, ప్రతి తెలుగు లోగిళ్లలో తెలుగులోనే మాట్లాడాలి! అని ఈ సభలను ప్రారంభిస్తూ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు.

భాష, శ్వాస రెండు సమానమే, శ్వాస ఆగిపోతే మరణం ఎలా సంభవిస్తుందో, భాష ఆగిపోతే జాతి ఉనికికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. అలా జరగకూడదు అని తెలుగు వారు అనుకుంటే వారి వారి ఇళ్ళ నుంచే ప్రయత్నం ఆరంభించాలని అందులో భాగంగా గుడిలో, బడిలో, ఇంటా బయటా ఎక్కడ ఉన్నా ప్రతి ఒక్కరూ తెలుగులోనే మాట్లాడాలని ఆయన పిలుపునిచ్చారు.

ఫ్రాన్స్ దేశస్థుడైన డేనియల్ నేగర్స్ లాంటివాళ్ళు తెలుగులో చాలా చక్కగా మాట్లాడుతున్నారు. అలాంటిది తెలుగు గడ్డపై ఉన్నవాళ్లు మమ్మీ డాడీ సంస్కృతిని ప్రోత్సహించడం ఎంతవరకు సబబు అనే విషయాన్ని ఆలోచించాలి. భాషాభివృద్ధికి తెలుగు రాష్ట్రాలలో విశేషమైన కృషి జరగాలి, అది ఒక ప్రజా ఉద్యమంగా రూపు దాల్చేందుకు నడుం బిగించాలి.

తెలుగును రక్షించాల్సిన బాధ్యత, భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత రచయితలపై ఉంది. కనుక నూతన సాహిత్యాన్ని సృష్టించడంతోపాటు పూర్వ సాహిత్య సంపదని కాపాడాల్సిన బాధ్యత కూడా ఉందనేది గుర్తించాలి. భాష, సంస్కృతి సజీవంగా ఉండాలంటే రచనల వల్లనే సాధ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.

తెలుగు భాషను కాపాడుకోవడంలో ప్రభుత్వాల చొరవతో పాటు, ప్రజా భాగస్వామ్యం చాలా ముఖ్యమని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. ముందు మన తెలుగులో పట్టు సాధించిన తర్వాత ఎన్ని భాషలు నేర్చుకున్నా తప్పులేదు. అమ్మ భాష అన్నం పెట్టదేమో అన్న భయం తల్లిదండ్రులలో నెలకొనడం ఆందోళన కలిగించే అంశమన్నారు. స్వంత భాష మనకు వస్తేనే ఏదైనా సాధించగలమనే వాస్తవాన్ని గుర్తించాలి అని ఆయన అన్నారు.

కవులు, రచయితలు, మేధావులు విలేకరులు అందరూ సామాజిక స్పృహతో పాటు బాధ్యతాయుతంగా రచనలు చేయాల్సిన అవసరముందని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. నేటి తరానికి ఉపయోగపడే అంశాలను నీతితో కూడిన విషయాలను సులభశైలిలో అందించే ప్రయత్నం జరగాలని, ఉపాధ్యాయులు తెలుగు అభివృద్ధికి, విస్తృత వ్యాప్తికి నూతన మార్గాలను అన్వేషించాలని అన్నారు.

తెలుగును కాపాడుకోవడానికి ఐదు తప్పనిసరి కార్యక్రమాలను ఆయన ఈ సందర్భంగా సూచించారు. అందులో మొదటిది ప్రాథమిక విద్యను మాతృభాషలోనే అందించాలి,పరిపాలన తెలుగులో తప్పనిసరిగా సాగాలి, న్యాయవ్యవస్థలో తీర్పులు, వాదనాలన్నీ తెలుగులోనే జరగాలి, ఉన్నత సాంకేతిక విద్యను మాతృభాషలో ప్రవేశపెట్టాలి వీటితో పాటు ఇళ్లలో ప్రతి ఒక్కరూ తెలుగులోనే మాట్లాడాలని ఆయన సూచించారు.



## ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు

# డా॥ మండలి బుద్ధప్రసాద్ తొలి ప్రసంగం

**ఇది** రాజరాజ నరేంద్రుని పట్టాభిషేకం జరిగిన వెయ్యేళ్ళ పండుగ. అలాగే, ఆదికవి నన్నయ ఆంధ్రమహాభారత రచనకు శ్రీకారం చుట్టి, ఆదికావ్య అవతరణకు నాందీపలికి వెయ్యి సంవత్సరాలైంది. ఈ వెయ్యేళ్ళ సందర్భాలను మనం ఘనంగా జరుపుకుంటున్నాం. 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ఈ వెయ్యేళ్ళ సందర్భాన్ని ఒక పండుగలా నిర్వహించటం ముదావహం. రాజరాజనరేంద్రుడు చిరస్మరణీయుడైన చక్రవర్తి. తెలుగు భాషాసంస్కృతుల్ని పదిలపరచి, భారతీయతను పునరుద్ధరించాలని ఒక లక్ష్యంగా నిర్దేశించుకుని ఆచరణలో పెట్టడం ద్వారా తెలుగు ప్రజల హృదయాల్లో 'తెలుగుమూర్తి'గా నిలిచిపోయాడు. ఆయన పాలించిన రాజ్యం విస్తారం రీత్యా చిన్నదే అయినా, నిరంతర యుద్ధాలతో ఒక యుద్ధజీవిగా ఆయన గడపవలసి వచ్చింది. ఏ రాజు పడనన్ని కష్టాలు ఎదుర్కొన్నాడు. దాయాదులపోరు ఆయన్ని అస్థిరపరచింది. సోదరుడి చేతిలో పలుపర్యాయాలు రాజ్యభ్రష్టుడై, చివరికి రాజధానిని రాజమహేంద్రవరానికి మార్చుకుని అక్కడ సుస్థిర పాలనను నెలకొల్పుకోగలిగాడు వాస్తవానికి ఏ రాజు చరిత్ర అయినా ఇంచుమించు ఇలానే ఉంటుంది. అయినా రాజరాజనరేంద్రునే ఎందుకు స్మరించుకుంటున్నామంటే, ఆయన తెలుగు భాషపట్ల మమకారం కలిగినవాడు కాబట్టి! తెలుగులో ఆదికావ్య అవతరణకు కారకుడు కాగలిగాడు కాబట్టి! భాషా సాహిత్యాలను పరిపోషించిన పాలకులు చరిత్రలో నిలిచి, ప్రజలహృదయాల్లో గూడుకట్టుకుని ఉంటారనటానికి రాజరాజనరేంద్రుడు, భోజమహారాజు, శ్రీకృష్ణదేవరాయలు మనకు ప్రత్యక్ష ఉదాహరణలు. మన ప్రజాపాలకులు ఇంత చిన్న అంశాన్ని గమనించగలిగితే, భాషా సాహిత్య పరిరక్షణకు దోహదపడి ప్రజా హృదయాలను చూరగొని, చిరస్మరణీయులు కాగలుగుతారు. మనది భాషాప్రయుక్త రాష్ట్రం. చదువు, పాలనల్లో తెలుగుకు అగ్రస్థానం ఇవ్వాలి. ఆంధ్రమహావిష్ణువు శ్రీకృష్ణదేవరాయలుకు "తెలుగదేలయన్న... దేశంబు తెలుగు'' అని చెప్పిన విషయాన్ని పాలకులు సదా గుర్తుంచుకోవాలి. నన్నయ భట్టారకుడు తెలుగులో పద్యరచనకు, గద్యరచనక్కూడా ఆద్యుడు. మహాభారత రచనకు ఆయన వేసిన ప్రణాళిక కవులందరికీ మార్గదర్శనం చేసింది. ప్రసన్న కథా కలితార్థయుక్తి, అక్షరరమ్యత, నానారుచితార్థ సూక్తిసుధలతో పాటు లోకజ్ఞత ప్రదర్శిస్తూ ఈ ప్రణాళికను వేసుకున్నారాయన. ప్రణాళికా బద్ధంగా రచన సాగించటానికి ఆయన మార్గం అందరికీ ఆదర్శమయ్యింది. అందుకనేఆయన ఆదికవి అయ్యారు. ఆదికవి మార్గం ఈనాటికీ అనుసరణీయమే! తమ రచనలు సమాజానికి ఎంతవరకూ ఉపయుక్తంగా ఉన్నాయో రచయితలు పునఃపరిశీలన చేసుకోవాలి. అనింటికన్నా ముఖ్యం రచయితకు లోకజ్ఞత కావాలి. మారుతున్న సమాజంలో వేగంగా విస్తరిస్తున్న సాంకేతిక విప్లవాన్నిఅందిపుచ్చుకుని మన భాషను కాపాడుకోవటం, మన సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేసుకోవటం ఎలా? అనేది ప్రస్తుతం మన ముందున్న ప్రశ్న. సాంకేతిక రంగ నిపుణులు, భాషావేత్తలతో పాటు రచయితలకూ ఇందులో బాగస్వామ్యం ఉంది. రచయితలు ఈ సమాజానికి ఇచ్చేచేతులై వెలగాలి! సాహిత్యసృష్టిలో భాష ప్రధానపాత్ర వహిస్తుంది. రచయిత భాష ద్వారా తన భావాలను, ఆలోచనలను, ఆదర్శాలను లోకానికి పంచుతాడు. ఆమేరకు జనజాగృతికి కారకుడౌతాడు. భాషని కోల్పోయాక భావాలను పంచే పరిస్థితే లేకుండా పోతుంది. ఈరోజున మన మాతృభాష అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది. రచయిత ఎంత స్పందింపచేసినా స్పందించవలసిన ప్రజానీకం వాడకంలోంచి తెలుగుభాష అదృశ్యం అయిపోతోంది. పరభాషా వ్యామోహం, పరసంస్కృతీ వ్యామోహం తెలుగువారిలో పెచ్చు పెరగటం చేత రచయితల ఘోష జనవాహినిని చేరలేని పరిస్థితి. ప్రభుత్వాలు కూడా వారి వ్యామోహాన్ని పెంచిపోషించే విధానాలనే అనుసరిస్తున్నాయి.

తల్లిపాలు శిశువుకు శ్రేష్టమన్నట్టే, తల్లిభాషలో చదివితే భావతుష్టి, ఆలోచనాత్మక శక్తులు పెరుగుతాయని శాస్త్రవేత్తలుచెప్తున్నారు. తల్లిపాలలో పెరిగితే తరువాత పోతపాలైనా, ఘనాహారాన్నయినా స్వీకరిచగలిగినట్టే, ప్రాథమిక విద్యని తల్లిభాషలో ప్రారంభిస్తే ఎదిగేకొద్దీ ఇతర భాషల్ని నేర్చుకోవటం తేలికౌతుందన్న యునెస్కో నిర్దేశాన్ని కూడా మన పాలకులు పెడచెవిని పెట్టడమే కాదు, తెలుగు పేరు చెప్తే తప్పైపోతున్న పరిస్థితి నెలకొని ఉంది. మా భాషలో చదువుకోవటానికి, మా భాషలోపాలన చేసుకోవటానికి మాకు ప్రత్యేక రాష్ట్రం కావాలని 1913లో ప్రారంభమైన ఆంధ్రోద్యమం ఆశయం మన కళ్ళముందే సజీవ సమాధి అయ్యింది. భాష అనేది అభిప్రాయప్రకటనకు మాత్రమే ఉపయోగించే సాధనం కాదు. భాష ఒక జాతి ఉనికిని కూడా చాటుతుంది. జాతి అస్థిత్వానికి భాష ప్రతీక. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఇదే ప్రతిపాదిత సిద్ధాంతం. మనది భాషాపూర్వకంగా ఏర్పడ్డ జాతి. భాష నశించిన రోజున జాతికూడా నశిస్తుందన్న సత్యాన్ని మనం గుర్తించాలి. ఇటీవల విజయవాడలో కలెక్టరుగారు ఒక పాఠశాల సందర్శనకు వెళ్లినప్పుడు తమ పేరును తెలుగులో వ్రాయమని అడిగితే విద్యార్థులు వ్రాయలేకపోయిన సంఘటన నేటి విద్యావిధాన దుస్థితిని

చాటిచెప్తుంది. తెలుగుకు ఎలాంటి డోకా ఉండదని నమ్మబలికేవారు గమనించుకోవలసిన అంశమిది.కేంద్రప్రభుత్వం ఆమోదించిన జాతీయ విద్యావిధానం ప్రకారం ప్రాథమిక విద్య మాతృభాషలో బోధించాలని నిర్ణయించటం హర్షదాయకం. అయితే, ఈ నిర్ణయాన్ని రాష్ట్రప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు పరచాలనే నిర్దేశం కూడా జరిగినప్పుడే దాని మంచి ఒనగూరుతుంది. ప్రజలలో భాషాభిమానాన్ని, జాత్యభిమానాన్ని, స్వాభిమానాన్ని పెంపొందించే బాధ్యత రచయితలు స్వీకరించాలి. తదనుగుణమైన ప్రబోధాత్మక రచనలు చేసి జాతిని జాగ్రుతపరచాలి. తెలుగు సజీవంగా లేకపోతే రచనలకు సజీవత్వం సిద్ధించదు సాహిత్యం నిరర్థక శ్రమగా మిగిలిపోతుంది. మన విద్యావిధానంలో తెలుగు మాత్రమే కాదు, చరిత్ర సామాజిక శాస్త్రాలక్కూడా చెడ్డకాలం దాపురించింది. అవి నిరరథకమైన సబ్జెక్టు అనే భావన పాలకవర్గాల్లో ఉంది. తల్లిదండ్రులు కూడా అదే అభిప్రాయంలో ఉన్నారు. కళాశాలల్లోనూ, విశ్వవిద్యాలయాల్లోనూ తెలుగు శాఖలతో పాటు చరిత్ర శాఖలు కూడా మూతపడ్తున్నాయి. బోధన ద్వారా తమ చరిత్రను తెలుసుకోవటం వలన జాతి కొత్త శక్తిని సంతరించుకుంటుంది. మన వారసులు మనల్ని చూసి ఎంతగర్వించాలని కోరుకుంటామో మన సాహిత్య, సాంస్కృతిక వారసత్వ సంపద పట్ల కూడా మన పిల్లలు గర్వించగలగాలి. అప్పుడే ఈ జాతి ఉనికి సుసంపన్నం అవుతుంది. ఇది జరగకపోతే మనం ఏ ఘనతా లేని వారిమనే ఆత్మన్యూనతా భావన వారిని వెంటాడుతుంది. అది వారిని బలహీనులుగా మారుస్తుంది.పిల్లల్లో తెలుగుభాషపట్ల మమకారం కలిగించటంలో సాహిత్య అధ్యయనం వైపు వారి దృష్టి మరల్చటంలో ఉపాధ్యాయులపాత్ర ప్రముఖమైంది. చిన్ననాడు మన ఉపాధ్యాయులు మనల్ని భాషాభిమానులుగా ప్రేరేపించటం వల్లే మనలో భాషాభిమానం సాహిత్య ప్రయత్నాలు అలవడ్డాయి. ఈనాటి రచయితల్లో ఎక్కువమంది ఉపాధ్యాయవృత్తిలో ఉన్నవారే! ఉపాధ్యాయులు, ముఖ్యంగా భాషాపండితులు భాషాభిమాన ప్రేరకులుగా ప్రజలను తెలుగు భాషానురక్తుల్ని చేసే గురుతర బాధ్యతను వహించాలి.ప్రభుత్వాలు మాతృభాషా మాధ్యమానికి వ్యతిరేక ధోరణి ప్రదర్శిస్తున్నాయి. ఇంక మిగిలింది ఒకక్లాసు తెలుగు. ఈ ఒక్క క్లాసులో తెలుగు ఉపాధ్యాయులు ఎంత తెలుగుని పిల్లలకు నేర్పించగలరన్నది వారి చాకచక్యం పైన ఆధారపడి ఉంటుంది. పిల్లల్లో మనం తెలుగువారిమనే భావనని మొదట కలిగించాలి. తెలుగుదనాన్ని కాపాడుకోవాలనే ఆలోచనని ప్రేరేపించాలి. విద్యార్థులు తెలుగుని ఇష్టపడి చదివితే ఎంత తెలుగైనా వస్తుంది. వారిలో ఆ ఇష్టతని తెలుగు ఉపాధ్యాయులే కలిగించాలి.నేటికాలపు విద్యార్థులకు సెల్ఫోన్లు, కంప్యూటర్లు బాగా అందుబాటులోకొచ్చాయి. ఇంటర్నెట్టుని బోధనాభ్యాసాలకు మలుచుకునే ప్రయత్నం జరగాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తెలుగులో కూడా ఎంతో అందుబాటులో ఉంది. తెలుగులో చదివితే తెలుగు బిడ్డకు జ్ఞానం ఎక్కువ అందుతుంది.తెలుగు భాషా సాహిత్యాలపై టెక్నాలజీ ప్రభావాన్ని చర్చించవలసిన అవసరం ఉంది. ప్రపంచంలో సాంకేతిక విప్లవం తెచ్చిన మార్పుల్ని రచయితలు ఉపయోగించుకోవాలి. కంప్యూటర్లలో తెలుగు వాడకం పెంచి భాషా సాహిత్యాల వ్యాప్తికి కృషిచేయాల్సి ఉంది.యూనికోడ్ ఫాంట్స్ వల్ల సాంకేతికంగా తెలుగు భాష వాడకం పెరిగింది. గూగుల్ సంస్థ తెలుగు ఫాంట్లు ఉచితంగా అమ్దించటమే కాకుండా అనువాద ఉపకరణాలు అందుబాటులోకి తెచ్చింది. ప్రతీవారి జీవితంలోకి ఇంటర్నెట్టు ప్రవేశించింది. ప్రజల జీవనశైలిని మార్చివేసి, శాసించే స్థాయికి ఎదిగింది.ఇంటర్నెట్టుని ఉపయోగించుకుని మన భాషను పరిరక్షించటానికి, మన సాహిత్యాన్ని విశ్వవ్యాపితం చేయటానికి కేవలం సాంకేతిక నిపుణులే కాదు, రచయితలూ ప్రయత్నించాలి. సాంకేతికత ద్వారా భాషాపరిరక్షణ అనేది ఈ యుగపు నినాదం మాత్రమే కాదు విధానం కూడా! అంతర్జాలం ద్వారా భాషాబోధన ఇప్పుడు సులభం అయ్యింది. రచయితలు చాలామంది స్వంత వెబ్ సైట్ల ద్వారా, బ్లాగుల ద్వారాతమ సాహిత్యాన్ని అంరజాలంలో పదిలపరుస్తున్నారు. తద్వారా వారి రచనలకు అంతర్జాతీయ ప్రాచుర్యం లభిస్తోంది. వాట్సప్, ఫెస్'బుక్ వగైరాలు జీవితంలో భాగమయ్యాయి. సామాజిక మాధ్యమాలు వహిస్తోన్న పాత్ర ప్రాముఖ్యత సంతరించుకుంది.అయితే, సంక్షిప్త సందేశాల్లో కొత్త బాష పుట్టుకొస్తోంది. భాష పెనుమార్పులకు లోనౌతోంది. రచయితలే ఒక కంట కనిపెట్టి జాగ్రత్త వహించాల్సిన అంశాల్లో ఇదొకటి. భాష తన ప్రాధాన్యతను కోల్పోయే పరిస్థితి రాకూడదు. సాంకేతికత వలన సమకూరిన వేగం భాష మరణాన్ని వేగిరపరచకుండా జాగ్రత్త వహించాలి.పెద్ద పత్రికలు కరోనా కారణంగా కానీ, కాలవైపరీత్యం వలన కానీ కొన్ని మూతపడగా, కొన్నింటికి విస్తృతి తగ్గిపోయింది. పత్రికల్లో సాహిత్యానికి, సాహిత్యపత్రికలకు కానికాలం దాపురించింది. ఇందుకు విరుగుడు మందుగా 'ఇ-పత్రికలు' వెల్లువలా వస్తున్నాయి. అచ్చు పత్రికలు కూడా అంతర్జాలంలో లభిస్తున్నాయి. చదవాలనే ధ్యాస ఉండాలే గాని, అంతర్జాలం నిండా అంతరిక్షం అంత సమాచారం ఉంది. అయితే, వీటిని ఉపయోగించటంలో మెళకువల్ని తెలుసుకోవటంతో పాటు మన భాషా సాహిత్యాలకు సక్రమ రీతిలో వ్యాప్తి జరిగే ప్రయత్నాలు ముమ్మరం కావాలి. రచయితలు తమ రచనల్ని వేగంగా ప్రచురించటానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠకులతో పంచుకోవటానికి అంతర్జాలాన్ని సద్వినియోగపరచుకోగలగాలి. కలమూ కాగితాలు కాలం చెల్లినవై పోతోన్నాయి. ఒక్క వేలుతో మీట నొక్కుతూ సెల్ ఫోన్ల ద్వారా, కంప్యూటర్ల ద్వారా అద్భుత సాహిత్య సృష్టి జరుగుతోంది.ఇటీవలఆక్స్ ఫర్డ్ ఆంగ్లనిఘంటువులో గోబ్లిన్ మోడ్ అనే పదాన్ని చేర్చినట్టు వార్త వచ్చింది. ఏదీ పట్టని తనానికి ఈ పదం వర్తిస్తుంది. భాష విషయంలో మనం కూడా ఈ గోబ్లిన్ మోడ్ లోంచి బైటపడి భాషను కాపాడాలనే మూడ్ లోకి మారాల్సిన సమయం ఇది. దేశ విదేశాలనుండి అత్యధిక సంఖ్యలో ప్రతినిధులుగా నమోదు చేసుకుని ఈ మహాసభలకు తరలివస్తోన్న రచయిత లందరికీ పేరుపేరునా నా హృదయపూర్వక స్వాగత సుమాంజలులు అర్పిస్తున్నాను. మీరంతా బాషా సత్యాగ్రహులుగా, భాషోద్యమ సైనికులుగా, భాషా పరిరక్షకులుగా నిలవాలని కోరుతున్నాను. రానున్నది యువతరానికి ఆధిపత్యం లభించే కాలం. వారు మన భాషా సంస్కృతుల పట్ల అభిమానం కలిగిన వారైనప్పుడు జాతి ఉనికి పదిలం అవుతుంది. ఈ మహా సభలకు గతంతో పోలిస్తే యువత ఎక్కువమంది తరలి రావటం ఆనందంగా ఉంది. అందరికీ పేరుపేరునా మరొకసారి స్వాగతం పలుకుతున్నాను.



# భారత సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ ప్రసంగం

1. ఈ విజయవాడ నగరంతో నాకున్న అనుబంధం గురించి గతంలో ఎన్నో మార్లు గుర్తు చేసుకున్నాను. నాకు న్యాయవాద వృత్తిలో నడకలు నేర్పిన నగరమిది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల భవితను శాసించేది రాజకీయాలేనని, మంచి రాజకీయాలే సమాజపు మంచి భవితకు, ప్రగతికి పునాది రాళ్ళని, ఆవేశంలో ఉన్న నా తరం వాళ్ళకు అర్థమయ్యేలా నేర్పింది ఈ విజయవాడ నగరమే. తెలుగు వారందరినీ ఒక్క తాటిపైకి తెచ్చేందుకు సాగిన పలు ప్రగతిశీల సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలకు కేంద్రం ఈ నగరం. తెలుగు ప్రాంతాలకి ఈ నగరం రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, సాహితీ రాజధానిగా విలసిల్లింది. ఒకప్పుడు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రధాన కార్యాలయాలు ఇక్కడే ఉండేవి. దాదాపు అన్ని దిన, వార, మాస పత్రికల ప్రధాన కార్యాలయాలు కూడా ఇక్కడే ఉండేవి. తెలుగు ప్రచురణలకు ఇది అప్రకటిత రాజధాని.

2. ఈ ఘనమైన వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న కృష్ణా జిల్లా రచయితల సంఘం గత యాభై యేళ్లుగా అనేక జాతీయ, అంతర్జాతీయ సాహితీ కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తోంది. ప్రపంచ తెలుగు రచయితల సంఘాన్ని నెలకొల్పటం ద్వారా తెలుగు భాషకు ఒక అంతర్జాతీయ వేదికను కల్పించటం ఆనందకరం.

3. ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో, కృష్ణా జిల్లా రచయితల సంఘం, తానా, తానా ప్రపంచ సాహిత్య వేదిక, సిలికానాంధ్ర, సిద్ధార్థ అకాడెమీల భాగస్వామ్యంతో ఈ ఐదవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించడం ఎంతో సంతోషకరం. చారిత్రక, సమకాలిక ప్రాధాన్యత గల పలు అంశాలపై అర్థవంతమైన, ప్రయోజనకరమైన చర్చలకు బాటలు వేసిన నిర్వాహకులకు నా హృదయపూర్వక అభినందనలు.

4. ఎన్నో త్యాగాలకోర్చి, సుదీర్ఘ పోరాటాలతో తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రం సాధించుకున్న తర్వాత మూడు దశాబ్దాలు గడిచాక కూడా, మనల్ని ఉత్తరాదిన మదరాసీలుగానే చూసేవారు. వారి మత్తు వదిల్చి, తెలుగు వారిగా మన ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు గారి శతజయంతి సందర్భంగా ఆయనకు నా నివాళి.

5. ప్రపంచ వ్యాప్తంగా పలు భాషలు సంక్షోభం ఎదుర్కొంటున్న ఈ తరుణంలో ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన 15 వందల మంది తెలుగు రచయితలు, అనేక రంగాలకు చెందిన భాషాభిమానులు భాషను కాపాడుకోవాలనే తపనతో ఇక్కడ సమావేశం కావడమే ఒక సందేశం.

6. "రచన ప్రయోజనం ప్రపంచ శ్రేయస్సే" అని నమ్మిన జాతి మనది. కవులకు, రచయితలకువిశ్వశ్రేయస్సే పరమావధి. ప్రజలను చైతన్యవంతులను చేయడంలో, మన దేశాన్ని స్వాతంత్ర్య పథంలో నడిపించడంలో, అంతకు ముందూ, ఆ తర్వాతా సామాజిక సంస్కరణలకు ఊపునివ్వడంలో తెలుగు సాహిత్యం ఎంతో కీలక పాత్ర పోషించింది. "దేశమును ప్రేమించుమన్నా! మంచియన్నది పెంచుమన్నా'' అన్న గురజాడ వాక్యాలు జాతీయోద్యమానికి ఎంత స్ఫూర్తి దాయకమయ్యాయో మనకు తెలుసు.

7. ఈనాటి సామాజిక పరిస్థితుల్లో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. వాణిజ్య సంస్కృతి తాండవిస్తోంది. మానవతా విలువలు అడుగంటుతున్నాయి. మనుషుల మధ్య సంబంధాలు సన్నగిలుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రచయితల పాత్ర గురించి చర్చించాలనే ఆలోచనని స్వాగతిస్తున్నాను.

8. సామాజిక, వ్యక్తిగత విలువలు భాషా సంస్కృతులతో ముడిపడి ఉంటాయి. భాషను, సంస్కృతిని కాపాడుకోవటానికి రచయితలు నడుం కట్టవలసిన సమయం ఇది.

9. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో తెలుగు అనుసంధానం జరగాలంటే భాషలో ఆధునికత రావాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా భాషలో మార్పులు రావాలి. వాడుక భాషా ఉద్యమం ద్వారా తెలుగును సామాన్యుడి భాషగా నిలబెట్టక పోతే బహుశా మన భాష మనుగడే కష్టమయ్యేదేమో. న్యాయస్థానాల్లో కూడా మాతృభాషను ప్రవేశపెట్టక తప్పదు. అందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం కోసం, సరైన పదజాలం కోసం పరిశోధన వేగవంతం చేయాలి. సాంకేతిక నిపుణులు, న్యాయనిపుణులు, భాషావేత్తలు, తెలుగు పండితులతో పాటు రచయితలు కూడా ఇందులో భాగస్వాములు కావాలి. అలాగే, మాతృభాషలో ప్రాథమిక విద్యని నేర్పించటానికి, శాస్త్ర సాంకేతిక పాఠ్యాంశాలు తెలుగులో వివరించటానికి వైజ్ఞానిక రచయితల పాత్ర ఎంతైనా ఉంది.

10. నా స్వీయ అనుభవంతో చెపుతున్నాను. భాష వ్యాప్తిలో, భాష బోధనలో. ఉపాధ్యాయులు పోషించగల పాత్ర మరెవ్వరూ పోషించలేరు. నేనే కాదు, నా తరం వారెందరో, మాతృభాషలో గురువులు నేర్పిన విద్యా బుద్ధుల కారణంగానే సమాజానికి ఎంతో కొంత ఉపయోగపడుతున్నాం..

11. భాష మన ఉనికిని చాటుతుంది. దాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనందరి మీద ఉంది. ప్రతి ఇంట్లోను తెలుగు వెలిగిన నాడే

వ్యక్తుల మనోవికాసం. సమాజ వికాసం జరుగుతాయి. ఇంటి భాషగా తెలుగు వాడకం పెరగాలి. మాతృభాష మనసుల్ని, మనుషుల్ని దగ్గర చేస్తుంది.

12. మీలాంటి ఉద్దండ పండితుల సమక్షంలో సాహిత్యం గురించి ఎక్కువగా మాట్లాడే దుస్సాహసం చేయను. కానీ, ఒక సగటు తెలుగు వాడిగా నా ఆవేదన మాత్రం పంచుకోదలచుకున్నాను. మన తెలుగు జాతి ప్రగతికి మనమే ప్రతిబంధకమవుతున్నాం. డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య గారి మాటల్లో చెప్పుకోవాలంటే:

"కొన్ని కొన్ని విషయాల గురించి మనం ఆత్మ పరిశీలన చేసుకోవాలి. మనలో త్యాగధనులున్నారు. నిష్కళంక దేశభక్తులున్నారు..... అయితే మనలో కొన్ని లోపాలున్నాయి. అందులో ఒకటి మహా పాపిష్టి ఈర్ష్య. మరొకటి మహా ప్రమాదకరమైంది గర్వం. మనలో ఒకరు పైకి రావడం, అగ్ర శ్రేణికి చేరడం మన తోటివారికే ఇష్టం ఉండదు. పాతిక అర్జీలు, వంద ఆకాశరామన్న ఉత్తరాలు తయారవుతాయి. ఇలాంటి వాటి వలన మనకు మంచి జరగదు సరికదా కీడు హెచ్చుతుంది. మనమంతా ఒక కుటుంబం వారమనే సమిష్టి భావం పెంపొందించుకోవాలి. ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో సమస్యలను పరిష్కరించుకోవాలి. దేశ క్షేమం దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగి పోవాలి."

13. ఇవి 1942 లో చెప్పిన మాటలు. దురదృష్టవశాత్తు పరిస్థితులు మారాయని ఇప్పటికీ చెప్పుకోలేకపోతున్నాం. చాలా ఏళ్ళ తర్వాత పి.వి.నరసింహారావు గారు కూడా ఇవే అభిప్రాయాలు మరో విధంగా వెలిబుచ్చారు. ఆయనిలా అన్నారు:

"ఇతర రాష్ట్రాల్లో చరిత్ర ప్రసిద్ధి పొందిన మహావ్యక్తులు ఆయా రాష్ట్రాలకొక వ్యక్తిత్వాన్ని అందించారు. వారి చుట్టూ, వారి గొప్పదనం చుట్టూ అల్లుకొని ఆయా రాష్ట్రాలకు ఒక వ్యక్తిత్వం వచ్చింది. మన ప్రత్యేకత ఏమిటంటే, ఎవరికీ వ్యక్తిత్వం రాకుండా చేసుకోవడం."

14. మన తెలుగు జాతి ఒక్కతాటిపై నిలిచే జాతి అని ప్రపంచానికి చాటి చెప్పగలిగితే, తెలుగు వాడి ఘన కీర్తిని ముక్త కంఠంతో నలు చెరగులా వ్యాపింపజేస్తే మనకు విశ్వవ్యాప్తంగా రావలసిన గుర్తింపు తప్పక వచ్చేది. గురజాడ గారి రచనలు చదివిన ప్రతిసారీ మనస్సు చివుక్కుమంటుంది. ఇంతటి ప్రతిభాశాలికి, ప్రగతిశీల రచయితకు, తన కాలం కంటే ఎంతో ముందున్న మహా కవికి సాహిత్యంలో నోబుల్ బహుమతి రాకపోవడం ఎంత అన్యాయం అని, అలాగే తెలుగు సాహిత్యం ద్వారా సృజనాత్మక రచనా ప్రపంచాన్ని సుసంపన్నం చేసిన ఎందరో మహానుభావులు జ్ఞానపీఠ్ అవార్డుకు సైతం నోచుకోలేదు.

15. నేను ఆశావాదిని. మనం దిద్దుబాటు చేసుకోగలం. మన ఐక్యతే మన శక్తి. ఈ విషయం గుర్తెరిగితే చాలు. ఒక్కో తరంలో ఒక్కో జాతిని చిమ్మచీకటి కమ్ముకుంటుంది. జాతిని అలసత్వం అలముకుంటుంది. కానీ, అది తాత్కాలికమే! నిస్తేజం కమ్ముకున్న ప్రతిసారీ నూతన చైతన్యం ఏదో పొంగి పొరలుతుంటుంది. గత శతాబ్ది కాలంలో దిగ్గజాల్లాంటి నవ్యాంధ్ర నిర్మాత లెందరో తెలుగు నేలపై వెలిగిన నిజం కళ్ళకు కడ్తుంది.

16. మన తెలుగు వారి శక్తి యుక్తుల గురించి, మనలోని బలహీనతల గురించి జాతిపిత మహాత్మా గాంధీ గారు ఏమన్నారో ఈ సందర్భంగా గుర్తు చేసుకుందాం.

"ఆంధ్ర దేశానికి అంతులేని అవకాశాలున్నాయి. అక్కడ సాహసవంతులైన మనుష్యులున్నారు. ఆంధ్ర స్త్రీలను దక్షిణాఫ్రికాలో సైతం నేనెరుగుదును. వారు శక్తి గలవారు. కష్టపడి పనిచేసేవారు. ఆంధ్రులకు అవసరానికి మించిన ఔదార్యం వుంది. మిమ్ములను సరిగా నడిపించేవారుంటే మీరు ఎంతటి గొప్ప త్యాగాలనైనా చేయగలరు. ప్రశ్నించడానికి వీలులేని ధైర్యం మీది. కానీ దురదృష్టవశాత్తు జాతికి ఎంతో మంచి సేవ చేయగలిగిన స్థితిలో వున్నవారు, సేవ చేయడం కంటే నాయకత్వం వహించడానికి ఎక్కువ ఆత్రుత చూపుతున్నారు. విమర్శ అవసరమైన చోట్ల విమర్శించడానికి జంకుతున్నారు. సందేహిస్తున్నారు. ప్రతి తప్పును ఏదో విధంగా కప్పి పుచ్చడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ మన సామాన్య జాతీయ దౌర్బల్యంలో మీరు కూడా భాగస్వాములవుతున్నారు. ఈ తప్పులను గురించి నేను మీకు తెలియజెప్పి, వాటిని మీరు మీ శక్తి కొద్ది తొలగించుకోవలెనని ప్రబోధించకుంటే నేను మీ పట్ల అపచారం చేసినవాడినవుతాను"

17. గాంధీ మహాత్ముడి ఈ సందేశాన్ని సైతం వ్యాప్తి చేసి, తెలుగువాడి ఆత్మ గౌరవాన్ని తట్టిలేపి, తెలుగు జాతి ప్రగతికి తోడ్పాటునిచ్చే కృషిలో ఈ మహాసభలు సఫలం కావాలని మనసారా ఆశిస్తున్నాను.

18. ఆప్తమిత్రులు మండలి బుద్ధ ప్రసాద్ గారు తెలుగు భాషకోసం అనునిత్యం తపించే అరుదైన వ్యక్తి. వారి అండతో ఇలాంటి పవిత్ర కార్యాలెన్నో సంవత్సరం పొడవునా ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉంటాయి. తానా, తానా ప్రపంచ సాహిత్య వేదిక, సిలికానాంధ్ర లాంటి సంస్థలు తెలుగు భాష కోసం ప్రపంచ వ్యాప్తంగా చేస్తున్న కృషి ఆదర్శప్రాయం. మీరంతా కలిసి, నన్ను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి, నాకు ఈ అరుదైన గౌరవాన్నిచ్చినందుకు మీ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు.

**'కోటి మాటల మూట'**

తెలుగు భాషలో వాడుకలో ఉన్న, లేని అన్ని పదాలను ఒకే చోట చేర్చి 'కోటి మాటల మూట అనే పుస్తకాన్ని రూపొందిస్తున్నట్టు సిలికాన్ ఆంధ్ర వ్యవస్థాపకులు కూచిభట్ల ఆనంద్ సభికులకు తెలిపారు. ఆ బృహత్తర కార్యక్రమానికి సంబంధించిన ప్రాథమిక దశ సంచికను సభలో వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పుస్తకం రూపకల్పన వేగవంతంగా సాగుతోంది. అన్ని తెలుగు పదాలను సేకరించి తెలుగు వారిగా మాతృభాషకు ప్రాణం పోద్దామనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు ఆనంద్.

**ఇంకా, మహాసభల ప్రారంభోత్సవ కార్యక్రమంలో...**

ప్రపంచ రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, పద్మశ్రీ, సరస్వతీ సమ్మాన్ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్, తానా అధ్యక్షుడు అంజయ్య చౌదరి, తానా ప్రపంచ సాహిత్య వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, సాంస్కృతిక కళా సమితి, సింగపూర్‌కు చెందిన రాధిక శ్రీదేవి శ్రీకాంత్ బొచ్చు, తదితరులు పాల్గొన్నారు.

24 వ తేదిన సాయంత్రం గం.4 లకు ఆదికవి నన్నయ్య వేదికపై జరిగిన భాషోద్యమ సదస్సుకు శ్రీ గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షత వహించగా, మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీ ఎన్. తులసి రెడ్డి గౌరవ అతిథిగా తొలి ప్రసంగం చేశారు. తరువాత ప్రసంగించిన వారిలో కొందరి ప్రసంగ సారాంశాలను ఈ క్రింద ఇస్తున్నాము.



## అమ్మనుడి సంపాదకుడు, తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షులు

# డా. సామల రమేష్‌బాబు ప్రసంగం

**తె**లుగు భాష ముందుకు సాగాలంటే తెలుగుజాతి మొత్తం ఐక్యంగా కదలాల్సిన అవసరం ఉందని అమ్మనుడి సంపాదకులు, తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షులు డాక్టర్ సామల రమేష్‌బాబు అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నూటికి నూరుపాళ్లు భాష విషయంలో తప్పు చేస్తోందని అంటూ ప్రైవేట్ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని తొలుత అనుమతించిన ప్రభుత్వం ఏదో సభికులే గుర్తుచేసుకోవాలని చిక్కుప్రశ్నని వదిలారు. నేటివరకూ తెలుగు రాష్ట్రాన్ని, తెలుగు రాష్ట్రాలను పాలిస్తున్న ప్రభుత్వాలన్నీ భాష విషయంలో పి.వి.నరసింహారావు, రామారావు గార్లు తప్ప- విజ్ఞతతో ప్రవర్తించలేదన్నది వాస్తవం అని ఆయన నొక్కి చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం తెలుగు మీడియాన్ని పూర్తిగా రద్దుచేసి పూర్తిగా ఆంగ్ల మీడియంలోకి మార్చిందని దాని వల్ల అభివృద్ధి జరుగుతుందనే భ్రమలో ఉన్నదని, దీని ఫలితం నిప్పుల్లోకి తాను దూకుతూ, జాతిని నిప్పుల్లోకి నెట్టడమేనన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల రెండవ రోజు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఐదవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల నిర్వాహకులను అభినందించారు. ఎంతో శ్రమకోర్చి చేస్తున్నారని, ఇంతలా కృషి చేస్తున్నవారు లేరని అన్నారు.

2002లో మండలి బుద్ధప్రసాద్, సి.ధర్మారావుగార్లతో తాము కలిసి శ్రీకాకుళంలో సభలు జరిపిన విషయాన్ని, అనంతరం తెలుగు భాషోద్యమ సమాఖ్య అనే ఉద్యమ సంస్థను రూపొందించిన విషయాన్ని, ఆ సంస్థ నడిపిన చరిత్ర, చేసిన ఉద్యమాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తమ సంస్థ తెలుగు భాషకోసం నిరంతరం పోరాడుతూనే ఉన్నదన్నారు. ఉద్యమాలు లేకుండా, ప్రజలను చైతన్యపరచకుండా ప్రజాస్వామ్య దేశంలో ఏదీ సాధ్యం కాదని ఆయన అన్నారు. 2012లో తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభలను ప్రభుత్వం నిర్వహించిన సమయంలో తొమ్మిది కోర్కెల జాబితాతో ఉద్యమించి అప్పటి ముఖ్యమంత్రిని కలిసి విన్నవించి, అప్పటికీ నెరవేరకుంటే తిరుపతిలో భారీ కార్యక్రమాలు కూడా నిర్వహించి కొన్ని కోరికలను సాధించుకోవడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. దాని వెనుక మండలి బుద్ధ ప్రసాద్‌గారి నైపుణ్యం, కృషి ఎంతో ఉందని ఆయన తెలిపారు. తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని అప్పుడు జి.వో. సాధించామని, అప్పటి ప్రభుత్వం దాన్ని ఏర్పాటు చేసినప్పటికీ అదే సమయంలో ఎన్నికలు రావడంతో ఆ సంస్థ ఒకరకంగా మూలన పడిందని సామల రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు.

భారత దేశం వంటి ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వం పూనుకోనిదే ఏదీ జరగదన్నారు, ప్రభుత్వం పక్కదోవ పడుతుంటే ప్రజలే పూనుకొని, పోరాడి ప్రభుత్వాన్ని లొంగ దీయకపోతే ఈ నేలపై ఏదీ సాధ్యం కాదని ప్రజాస్వామ్య మూల లక్షణాన్ని అని ఆయన సభ ముందుంచారు.

ప్రస్తుతం తెలుగుజాతి మొత్తం కలసికట్టుగా భాషా స్వాతంత్ర్య ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని, ఎవరి భాషలో వారి పాలన, విద్య ఉండేలా పోరాడాల్సిన అవసరం అన్ని భాషాజాతలకు ఉందని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందా? పోయిందా? అనేది గమనించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన హెచ్చరించారు.

భారతదేశంలోనే మొట్టమొదటిసారి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకూ మాతృభాషా మాధ్యమంలో ఉండేందుకు కృషి చేసిన భాషా రాష్ట్రం సమైక్య ఆంధ్రప్రదేశ్ అని, ఆ స్థాయికి తెలుగును చేర్చిన ఖ్యాతి మాజీ ప్రధానమంత్రి దివంగత పివి నరసింహారావుకి దక్కుతుందని, కాగా అధమ స్థాయికి తెచ్చిన ఘనత కూడా తెలుగువారికే దక్కుతుందని, ఇలా బహిరంగంగా ప్రకటించడానికి ఒక తెలుగు వాడిగా సిగ్గుపడుతున్నానని అన్నారు. అమ్మనుడి రక్షణ కోసం తిరగబడాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని ఆయన మరోసారి తెలియజేశారు

తెలుగు భాషోద్యమంలో యువత ముందుకు రావడం లేదన్నది అవాస్తవమని, తెలుగుకు సంబంధించిన టెక్నాలజీ వంటి అనేక విషయాలపై యువతే ప్రస్తుతం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. తెలుగుజాతి, తెలుగు యువత, తెలుగు భాషలకు అద్భుతంగా పురోగమిచగల శక్తి ఉన్నదని, నేటి యువత తెలుగుకు వ్యతిరేకం కాదని ఆయన అన్నారు

తెలుగుజాతి అన్నింటా ప్రతిభావంతమైన జాతి అని, కనుక తమను తాము తగ్గించుకోవాల్సిన అవసరం లేదని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఆయా ప్రభుత్వాల మెడలు వంచాల్సిన బాధ్యత భాష విషయంలో పెద్దలకు, అన్ని స్థాయిల్లోని ప్రజాప్రతినిధులకు ఉన్నదని ఆయన అన్నారు.

ప్రస్తుతం భాషకోసం జాతి మొత్తం సమైక్యంగా ఉద్యమించడం మాత్రమే అందరి ముందున్న పెద్ద లక్ష్యమని డాక్టర్ సామల రమేష్‌బాబు తన ప్రసంగాన్ని ముగించారు.

### చిమ్మె జాన్ బర్న్‌బాస్



రాష్ట్రంలో తెలుగు భాష పరిస్థితి ఎలా ఉందో, దేశంలో కూడా అలాంటి పరిస్థితులే నెలకొన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఒకే దేశం ఒకే భాషా అని మొదలు పెట్టారని. దీనిని గమనిస్తే రాజ్యాంగ ఉల్లంఘనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాల్పడుతున్నాయని సామాజిక కార్యకర్త న్యాయవాది చిమ్మే జార్న్ బర్న్‌బాస్ విమర్శించారు. దేశంలో 29 రాష్ట్రాలకు కలిపి తొమ్మిది వేల న్యాయస్థాన ధిక్కార కేసులు ఎదుర్కుంటుంటే ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం దాదాపూ మూడు వేల కేసులు ఎదుర్కుంటోందని అలాంటి వారి రాజ్యాంగ ధిక్కారానికి వ్యతిరేక ఆలోచనలతో కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. భాషకు కావలసినది రాజ్యాంగ పరిష్కారం అని, జనం బ్రతికి ఉంటేనే భాష అవసరమని, ప్రస్తుత పరిస్థితులు బ్రతికేందుకూ సహకరించడం లేదన్నారు. పాలకుల నిర్ణయాలవల్ల రాష్ట్రంలోనే కాదు, దేశంలోని అన్ని ప్రాంతీయ భాషలకు ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన ప్రజాపోరాటాన్ని నిర్మించడం ద్వారానే భాషను కాపాడుకోగలమని అభిప్రాయపడ్డారు.

### పరవస్తు శేషశయన సూరి



ఈనాటి ప్రభుత్వం తెలుగు భాషను సర్వనాశనం చేయడానికి కంకణం కట్టుకుంది అందులో అనుమానమేమీ లేదు అని పరవస్తు శేషశయనసూరి వ్యాఖ్యానించారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వాలు సరైన పంథాలో నడిచి ఉంటే ప్రస్తుత ప్రభుత్వానికి తెలుగు భాషను నాశనం చేసే అవకాశం ఉండేది కాదని అన్నారు. గతంలో మునిసిపల్ పాఠశాలల్లో ఆంగ్ల మీడియం ప్రవేశపెడితే తెలుగు భాషోద్యమకారులు వ్యతిరేకించారు. తెలుగు దండు ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ధర్నాలు నిర్వహిస్తే, వైసీపీ నాయకులు కూడా ఆ ధర్నాలలో పాల్గొని తెలుగు భాష కోసం ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అధికార భాషా సంఘం అధ్యక్షునిగా పనిచేసిన యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వంటి వారు కూడా ఆ ధర్నాలలో పాల్గొన్నారని, కానీ వారి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఆయా నాయకులకు ఏదో ఒక పదవి రాగానే ఆ విషయాన్ని మరచిపోవడం సిగ్గుచేటన్నారు. వారు గిరీశాల్లా వ్యవహరించే రాజకీయనాయకులను నమ్మి ఉద్యమాన్ని వారికి అప్పగించడం కన్నా, మన భాషకోసం మనమే ఉద్యమించాలని అన్నారు. తెలుగు భాషాభివృద్ధిలో అధికార భాషా సంఘం సంపూర్ణంగా విఫలమైందని విమర్శించారు. రెండు చక్కటి పద్యాలతో భాష విషయంలో తెలుగువారి పరిస్థితిని ఎండగట్టారు.

ఇంకా డా. సిహెచ్ బాబావలి, సంకేపల్లి నాగేంద్రశర్మ, తదితరులు ప్రసంగించారు.



# ప్రపంచ తెలుగు రచయితల 5వ మహాసభలు
## వేదిక : పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల అడిటోరియం, విజయవాడ
## సభలో ఏకగ్రీవంగా చేసిన తీర్మానాలు

1) మాతృభాషాభిమానంతో భాషా సంస్కృతుల పరిరక్షకులుగా తెలుగువారంతా తెలుగు నేలపైన తెలుగును వర్ధిల్లచేయాలని జన బాహుళ్యాన్ని ఈ మహాసభ అభ్యర్థిస్తోంది.

2) శతక పద్యాలూ, సూక్తులు, జాతీయాలు, సామెతలు వంటివి నేర్పించడం ద్వారా పిల్లలను తెలుగులో ఎదగనివ్వాలని తల్లిదండ్రులను ఈ మహాసభ అభ్యర్థిస్తోంది.

3) ఎంత తెలుగు వస్తే అంత తేలికగా ఇతర భాషలు, శాస్త్ర సాంకేతిక విషయాలు వంటబడతాయనే యునెస్కో సూచనను పరిగణలోకి తీసుకోవాలని ఈ మహాసభ విద్యారంగ నిపుణులను కోరుతోంది.

4) ఆధునిక సాంకేతిక ఉపకరణాలలో తెలుగు వాడకం పెరగాల్సిన అవసరం ఉందని ఈ మహాసభ యువతీయువకులను కోరుతోంది.

5) శతక పద్యాలూ, సూక్తులు, జాతీయాలు, సామెతలు నేర్పించడం ద్వారా భాషను తల్లిదండ్రులే పిల్లలకు నేర్పించాలి. తెలుగువారి సాంప్రదాయ కళలు, సాంస్కృతికపరమైన అంశాలు గురించి వారికి అభిమానాన్ని, అభిరుచిని, అభినివేశాన్ని కలిగించేలా కృషి చేయాలని ఈ మహాసభ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తోంది.

6) పాఠశాలల్లో తెలుగు భాషా సాంస్కృతిక అంశాలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తూ, పిల్లలలో మాతృభాష పట్ల అవగాహన, మమకారం కలిగించాలని విద్యాసంస్థలకు ఈ మహాసభ విజ్ఞప్తి చేస్తోంది.

7) జాతీయ విద్యావిధానం 2022 ప్రకారం ప్రాథమిక స్థాయిలో ఒకటి నుండి ఐదవ తరగతి వరకు మాతృభాషలో విద్య బోధించాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ మహాసభ విజ్ఞప్తి చేస్తోంది.

8) ఇంటర్, డిగ్రీ స్థాయిలో రెండవ భాషగా తప్పనిసరిగా తెలుగును బోధించేలా చర్యలు తీసుకోవాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ మహాసభ విజ్ఞప్తి చేస్తోంది.

9) తమిళనాట తమిళ మాధ్యమంలో చదివిన వారికి ప్రభుత్వోద్యోగాలలో 20% రిజర్వేషన్ కల్పిస్తున్న పద్ధతిలో తెలుగు మాధ్యమంలో చదివిన వారికి కూడా రిజర్వేషన్ కల్పించాలని ఈ మహాసభ రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తోంది.

10)సర్వీస్ కమిషన్ పరిక్షలలో తెలుగులో చదివితే 5% ప్రోత్సాహక మార్కులు ఇచ్చే పద్ధతిని కొనసాగించాలని ఈ మహాసభ రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తోంది.

11) హైస్కూల్, కళాశాల స్థాయిల్లో పాఠ్యాంశాలలో చరిత్రకు సంబంధించిన అంశాలను కూడా చేర్చాలని ఈ మహాసభ రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తోంది.

12)విభజన క్రమంలో భాగంగా చారిత్రక ఆధారాల విభజనకు చర్యలను కుడా వేగవంతం చేయాలని ఈ మహాసభ రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తోంది

13) రాష్ట్రేతరాంధ్రులు, విదేశీ ఆంధ్రులు తెలుగు భాష పట్ల కనబరుస్తున్న మక్కువను, వారు భాషా పరిరక్షణ కోసం శ్రమిస్తున్న తీరును ఈ మహాసభ గుర్తించి అభినందనలు అందజేస్తోంది.

14) రాష్ట్రేతర ప్రాంతాలలో తెలుగు పాఠశాలలు నిర్వహణకు ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలుతోడ్పాటునందించాలని ఈ మహాసభ కోరుతోంది. రాష్ట్రేతరాంధ్రుల భాషాపరమైన అవసరాలు తీర్చడానికి ఒక సమన్వయ వ్యవస్థను నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ మహాసభ అభ్యర్థిస్తోంది.

15) త్రిభాషా సూత్రం ప్రకారం మనం హిందీనేర్చుకుంటున్నాం. కానీ, ఉత్తరాది రాష్ట్రాల వారికి దక్షిణాది భాషలు నేర్చుకోవాలనే ఆలోచన ఉన్నప్పటికీ, అవకాశాలు కల్పించటం లేదు. మన రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి, తెలుగు బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలి.

16) మారుతున్న సామజిక పరిస్థితులలో రచయితలు తమ దృష్టిని సారించాలని, మనం కోల్పోతున్న విలువలు, మనం వదిలేసుకుంటున్న మానవ సంబంధాలు, సమాజంలో పెచ్చు మీరుతున్నవాణిజ్య ధోరణుల గురించి ప్రజల్ని అప్రమత్తుల్ని చేసేందుకు సమాయత్తం కావాలని ఈ మహాసభ రచయితలను, కళాకారులను అభ్యర్థిస్తోంది.

17) భాషోద్యమ సైనికులుగా శ్రమించి, తెలుగు బాషోద్యమాన్ని ప్రజాపరం చేయడంలో భాగస్వాములుకావాలని, ఈ మహాసభలకు భాషాభిమానంతో విచ్చేసిన ప్రతినిధులు అందరిని ఈ మహాసభ కోరుతోంది.

18) ఆధునిక సాంకేతిక ఉపకరణాలలో తెలుగు అమలు కోసం తెలుగును ప్రపంచ తెలుగుగా తీర్చిదిద్దడం కోసం భాషావేత్తలు, రచయితలు, సాంకేతిక నిపుణులు ఒక సమన్వయ వ్యవస్థగా ఏర్పడి భాషోద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలని ఈ మహాసభ సూచిస్తోంది.

కె.యస్.బి.వి.కె.శివరావు
93955 82300

# ప్రజల భాషలో పాలించిన తెలుగు ముఖ్యమంత్రి



కనువెలుగు: 28 మే 1923
కనుమరుగు: 18 జనవరి 1996

1978 సంవత్సరం లండన్‌లోని ఇండియన్ ఎంబసీ ఆవరణలో జరుగుతున్న గణతంత్ర దినోత్సవ వేడుకలలో మువ్వన్నెల పతాకానికి ప్రణమిల్లాము. మా హృదయాలు పులకరించి పోయాయి. ఆ సందర్భంలో వై.ఎం.సి.ఎ. యు.కె. కార్యాలయ ప్రధాన కార్యదర్శి చిన్నదొరై గారు వణుకూరు నారాయణరావు, ఐ.ఎ.యస్. గార్ని, నన్ను (కె.యస్.బి.వి.కె. శివరావు) అక్కడి ప్రముఖులకు పరిచయం చేస్తూ వుండగా, మన ఎంబసీ డిప్యూటీ హైకమీషనరు విజయరాఘవన్ గారు చిన్నదొరై గార్ని పలకరించి, మమ్మల్ని చూసి "మద్రాసీలా? ఎప్పుడు వచ్చారని" పలకరించారు. నేను నమస్కరించి, తలవూపి, తెలుగు వారమండి, ఆంధ్రప్రదేశ్ అని తమిళంలో సమాధానమిచ్చాను. ఈలాంటి అనుభవాలే మన పొరుగు రాష్ట్రాలలోనూ ఎదురయ్యేవి. ఎంబసీ నుండి తిరిగి వచ్చేటప్పుడు "మద్రాసీ" అన్న పిలుపు గురించే నా ఆలోచనంతా.. మా నారాయణరావుగారు "శివా, ఏమాలోచిస్తున్నావని అడిగారు. అయ్యా ఆంధ్రప్రదేశ్ ఏర్పడి 22 సం॥లు అయినా మనల్ని ఇంకా "మద్రాసీ" లే అంటున్నారు అన్నాను. తెలుగు వారిగా మనకు గుర్తింపు ఏది?

ఎన్.టి. రామారావు గారు రాజకీయాలలో ప్రవేశించిన తరువాత ఏ వేదికపై నుండి ఉపన్యసిస్తున్నా **"మొదట నేను తెలుగు వాడిని, నాది ఆంధ్రదేశం"** అంటూ తెలుగుజాతి స్వాభిమానాన్ని చాటేవారు. అంతే కాకుండా తాను ఏర్పాటు చేసిన పార్టీకి **"తెలుగు దేశం పార్టీ"** అని పేరు పెట్టేరు. అటు తరువాత మద్రాసీ పిలుపు మరుగున పడింది.- తెలుగుజాతికీ గుర్తింపు ఏర్పడింది. 1983 సం॥లో ఎన్.టి.రామారావు గారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు.

**ప్రజల గుండెలలో గూడు కట్టుకున్న కొన్ని ముఖ్యాంశాలు :**

1.బడుగు వర్గాల వారికి కిలో 2 రూపాయలకు 5 కిలోల బియ్యం.

2. మహిళలకు ఆస్తి హక్కులు

3. పంచాయితీ పరిపాలనలో అధికార వితరణ, గ్రామ పరిపాలనలో మునసబు-కరణాలు, తెలంగాణలో పటేలు-పట్వారి పదవులు రద్దు; పంచాయితీ అధ్యక్షులకు అధికారాలు, మండళ్ళు, జిల్లా పరిషత్తులు ఏర్పాటు సంస్కరణలు, రాష్ట్ర సమగ్రాభివద్ధి.

4. మాతృభాష పరిరక్షణకు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు.

5. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం అమలు.

6. తెలుగుభాషలో రాష్ట్ర పరిపాలన.

మన రాష్ట్రంలో ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాలన్నీ తెలుగులోనే నడిపించాలని గత రెండు దశాబ్దాలకు పైగా ప్రభుత్వం చేస్తున్న కృషిలో 1988వ సంవత్సరం ఒక విశిష్ట స్థానాన్ని సంతరించుకున్నది. 1966వ సంవత్సరం మే 14 నుండి అమలులోనికి వచ్చిన ఆంధ్రప్రదేశ్ అధికారభాషా చట్టం తెలుగుభాషకు రాష్ట్ర అధికారభాషగా శాసన ప్రతిపత్తి కల్పించింది. అప్పటి నుంచి రాష్ట్ర పాలనా యంత్రాంగపు వివిధ స్థాయిలలో వివిధ వ్యవహార కలాపాలకు తెలుగును ప్రవేశపెట్టి అమలు చేయాలన్న కృషికి ఈ సంవత్సరంలో అనూహ్యమైన ఒక క్రొత్త ఊపు వచ్చింది. ఈ స్ఫూర్తిని కలుగజేసి 1988వ సంవత్సరాన్ని చిరస్మరణీయంగా చేసిన కీర్తి ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు గారికి చెందుతుంది.

ఆ రోజు మార్చి 14, సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రిగారి సమక్షంలో అధికార భాషాసమీక్షా సమావేశం జరుగనున్నది. ఆ సమావేశానికి అప్పటి ప్రధాన కార్యదర్శి శ్రీ శ్రావణ్‌కుమార్, ముఖ్యమంత్రి గారి కార్యదర్శి కే.శే. రాఘవేంద్రరావు, ఉపకార్యదర్శి శ్రీ చక్రపాణి, ప్రధాన పరిపాలనశాఖ కార్యదర్శి శ్రీ వళ్ళియప్పన్, న్యాయశాఖ కార్యదర్శులు శ్రీ విద్యాసాగర్, శ్రీ నారాయణరావు ప్రభృతులు హాజరయ్యారు. మరోవైపున అధికారభాషా సంఘం అధ్యక్షులుగా అప్పటికి నాలుగు మాసాల క్రితం పదవీ స్వీకారం చేసిన డా॥ నండూరి రామకృష్ణమాచర్య, వారి సంఘం సభ్యులు శ్రీ మధురాంతకం రాజారాం, డా॥ కొలకలూరి ఇనాక్, శ్రీ నాగభైరవ కోటేశ్వరరావు, డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి, సంఘం కార్యదర్శి శ్రీ సి. ధర్మారావు సమావేశానికి హాజరు అయ్యారు.

ఆ ఉదయం 11 గంటలవేళ సచివాలయంలోని తమ మందిరంలో మంద్ర గంభీర స్వరంలో ఆందోళనను మిళితం చేసి ముఖ్యమంత్రి శ్రీ రామారావు తమ ప్రసంగాన్ని ఒక ఉదుటున ప్రారంభించారు. తమ పరిపాలన ప్రారంభమై 5 సంవత్సరాలు పూర్తి అయినా తెలుగు ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్లలేదని



శివరావుగారిని నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుగారు సత్కరిస్తున్న దృశ్యం

అన్నారు. సచివాలయం అంతా ఇంగ్లీషుమయంగా కనిపిస్తున్నదని, తమకు ఒక్క ఫైలు కూడా తెలుగులో రావడం లేదని అంటూ, ఈ అశేష ఆంధ్ర ప్రజకు కనీసం తమ పరిపాలనను తెలుగులో అందించలేకపోతున్నామన్న బాధ తమను వెంటాడుతున్నదని అన్నారు. మళ్ళీ ప్రజల వద్దకు తాము ఏ మొహం పెట్టుకుని వెళ్లగలమనేది అర్థం కావడం లేదన్నారు.

అనుకోనిరీతిలో వచ్చిన ఈ హటాత్ పరిణామానికి సభ్యులందరూ ఆశ్చర్యచకితులయ్యారు.

జిల్లా యంత్రాంగం స్థాయిలో చాలా కాలంగా తెలుగు కొంతలో కొంత అమలు ఔతున్నదని, ప్రభుత్వం అనేక ఆదేశాలు జారీ చేసిందని, జిల్లా కార్యాలయాలలో 100కి 100 పాళ్ళు తెలుగు అమలు చేసే విషయమై మరింత శ్రద్ధ వహించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయగలమని ఉన్నతాధికార్లు సర్ది చెప్పారు. అధికారభాషా సంఘం అధ్యక్షులు, సభ్యులు కూడా తమ జిల్లా పర్యటనల్లో గమనించిన అంశాలు కొన్ని చెప్పారు. ఐతే అవేవీ ముఖ్యమంత్రి గారిని సంతృప్తి పరచలేదు. జిల్లా యంత్రాంగం మాట అటుంచి సచివాలయం సంగతి ఏమిటని నిగ్గదీశారు. తాము ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి 1983వ సంవత్సరంలోనే సచివాలయంలో కూడా తెలుగును ప్రవేశపెడుతూ ఉత్తర్వులు ఇచ్చాము కదా అని గుర్తు చేసుకున్నారు. సచివాలయానికి కూడా ఒకసారి ఉత్తర్వులు యిచ్చాక, మళ్ళీ తిరోగమనం కూడదని అధ్యక్షులు అన్నమాటను ముఖ్యమంత్రి బలపరిచారు. ఈ ఉత్తర్వులు అమలు పరచడంలో ఎవరూ ఏమీ పట్టించుకోలేదనే బాధను వ్యక్తం చేశారు. ఆత్మవిమర్శ ధోరణిలో దీనిలో తమ బాధ్యత కూడా కొంత ఉన్నదని, తమ చాపల్యాలు తమకు ఉన్నాయని ఆత్మవిమర్శ చేసుకున్నారు. తాము వెచ్చించవలసినంత సమయాన్ని దీనికొరకు వెచ్చించలేదన్నారు. మొత్తానికి ఏమైతేనేమి వెంటనే అందరూ కార్యోన్ముఖులు కావాలని ఉద్బోధించారు. ఇక ఒక్క క్షణం కూడా తాము వేచి ఉండే స్థితిలో లేమని, వచ్చే నెల ఆరంభం నాటికి అంటే ఏప్రిల్ 1 నాటికి సచివాలయంలో ఇంగ్లీషులో ఫైలు కనపడకూడదని, తాము ఒక్క ఇంగ్లీషు ఫైలును కూడా చూడదలచుకోలేదని నిష్కర్షగా చెప్పారు. వారు చెప్పవలసినది పూర్తయిందని అనిపించిన తరువాత, సంఘం అధ్యక్షులు తమ 8 అభ్యర్థనల్లో మకుటాయమానమైనది– మరో నాలుగు రోజులలో రానున్న తెలుగు క్రొత్త సంవత్సరం "విభవ"ను అధికారభాషా సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించాలి అన్నది. ఈ అభ్యర్థనలను ముఖ్యమంత్రి మౌనంగా, సావధానంగా విని, సమావేశం ముగింపు సూచించారు. వారి మౌనం సంపూర్ణ అంగీకారంగా సభ్యులు భావించారు.

అంతే! రాష్ట్ర అధికార భాషావికాస పరిణామ చరిత్రలో ఒక నూతన ఘట్టం ప్రారంభమైంది. సమావేశ ఫలితాలకు, అక్కడ జరిగిన నిర్ణయాలకు అమితంగా సంతోషపడింది అధికార భాషా సంఘం అధ్యక్షులూ, వారి బృందమూ అని వేరే చెప్పనక్కరలేదు.

**మరికొన్ని విజయాలు**

అధికారభాషా రంగంలో 1988వ సంవత్సరం కొన్ని విజయాలను చవిచూసింది. మార్చినెల ఆఖరికు తెలుగు టైపురైటింగ్ శిక్షణ పథకం ముగియడంతోటే వెంటనే రాజధాని నగరంలో తెలుగు షార్టుహాండులో శిక్షణ పథకం ఆరంభమైంది. ఈ శిక్షణ ఇంకా కొనసాగుతుంది. ఇంతకు ముందు నగరంలో పట్టుమని 10 మంది కూడా లేని తెలుగు స్టెనోలు ఈ రోజున 150 వరకు వున్నారు. మరో 60 మందికి శిక్షణ 1989 మార్చిలో మొదలైంది.

ఇక ప్రభుత్వ ముద్రణ శాఖకు అనుబంధంగావుండి అధికార భాషా విభాగపు ఆధ్వర్యంలో పనిచేస్తున్న తెలుగు పరిశోధనా విభాగం సాధించిన విజయం కలికితురాయి వంటిది. తెలుగు, ఇంగ్లీషు రెండు భాషలకు పనికివచ్చే విద్యుత్ ప్రేరకమీటల ఫలకం (బైలింగ్వల్ ఎలక్ట్రానిక్ కీబోర్డు) ఈ విభాగం రూపొంచింది. ఇది కేవలం యాంత్రికంగా కాక శబ్దానుగుణంగా (ఫోనోటికల్) రూపొందింది. పైగా ఈ మీటల ఫలకం ఎలక్ట్రానిక్ టైపురైటర్, వర్డ్ ప్రాసెసర్, టెలిప్రింటర్, ఫోటోటైపు సెట్టర్ ఆఖరున కంప్యూటర్ వంటి వివిధ సాధనాలలకు ఉమ్మడిగా పనికివస్తుంది. 596 రూపాలు వున్న తెలుగు లిపిని 52 రూపాలున్న ఇంగ్లీషు లిపిని ఈ మీటల ఫలకలో ఒదిగించారు. తెలుగు అక్షరాల సొగసు చెడకుండా ముచ్చటగా ముద్రణకంటే మిన్నగా రూపుదిద్దుకున్నవి. శబ్దానుగుణం కావడంవల్ల కాలం, కాగితం ఎంతో కలిసి వస్తాయి. ఉదా : 'మౌ' అనే అక్షరాన్ని మామూలు టైపురైటరులో నాలుగు సార్లు వత్తాలి. ఇందులో "మ, ఔ" గా విడదీసుకుని రెండు నిండు అక్షరాలను వత్తితే సరిపోతుంది. ముందు ముందు ఈ మీటల ఫలకాన్ని టెలిగ్రాములకు, టెలెక్సులకు నిరాక్షేపణీయంగా వాడవచ్చు. ఈ రంగంలో మన భాష మిగతా అన్ని

భారతీయ భాషలకంటే, కొన్ని అంశాలలో హిందీ కంటే కూడా, ముందంజ వేయడం మనకు గర్వకారణం.

ఈ విధంగా విద్యుత్ప్రేరక మీటల ఫలకం విజయానికి, టైపురైటింగు విస్తృత శిక్షణ పథకం విజయానికి కారకులైన 19 మంది ఉద్యోగులకు ప్రభుత్వం ఒక్కసారిగా ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఒక ఉద్యోగికైతే తక్షణ ఉన్నత పదవిని కట్టబెట్టింది. ఈ ప్రోత్సహకాలు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవమైన నవంబరు 1న ముఖ్యమంత్రిగారు ఉద్యోగులకు అందజేశారు. ఒకే అంశంలో ప్రభుత్వం ఇన్ని ప్రోత్సాహకాలను ఒకేసారిగా ఇవ్వడం రాష్ట్ర పాలనా చరిత్రలో పేర్కొనదగిన విశిష్టాంశం.

అలాగే సచివాలయ ప్రాంగణంలో వివిధ భవనాలకు ఎ, బి, సి, డి వగైరా పేర్ల స్థానాల్లో సమత, సుజల, స్రవంతి, సంక్షేమ, సర్వహితసంప్రీతి, సుబోధ, సుగమ, సురక్ష వంటి ముచ్చటైన పేర్లు వచ్చాయి. అనూచానంగా కేవలం ఇంగ్లీషులో మాత్రమే ముద్రణ అవుతున్న ప్రభుత్వ డైరీలు 1989వ సంవత్సరానికి తెలుగు, ఇంగ్లీషు రెండు భాషల్లోను వెలువడ్డాయి.

**ఆఖరు నోటిఫికేషను**

ఇంకా, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగువాడకం గురించి అఖరుది అని చెప్పదగ్గ ఒక చట్టపరమైన నోటిఫికేషన్ను ప్రభుత్వం అక్టోబరు, 28న జారీ చేసింది, ఇది 1988 నవంబరు 1 నుండి అమల్లోకి వచ్చింది. దీనిని అనుసరించి అన్ని ప్రభుత్వ ఉత్తర్వుల జారీకి, ఉత్తర ప్రత్యుత్తరాలకు తెలుగుభాషను వాడాలి. ఇంగ్లీషును వాడరాదు. ఐతే తెలుగుకు అదనంగా రాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో ఆయా మైనారిటీ భాషాల వాడకానికి ఈ ఉత్తర్వు భంగకరం కాదని ప్రభుత్వం స్పష్టపరిచింది. కాగా దిగువ చెప్పిన కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇంగ్లీషు వాడకాన్ని ప్రభుత్వం అనుమతించింది.

1. భారత ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు.
2. ఇతర ప్రభుత్వాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు.
3. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెలుపలగల ఆంధ్రేతర చిరునామా దారులతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలు.

**అన్న గారి ఆదరణ**

ఆంధ్రప్రదేశ్ అధికార భాష అధ్యక్షులు డా॥ నండూరి రామకృష్ణమాచార్యగారు 1988 జనవరి మూడవ వారంలో ముఖ్యమంత్రిగార్కి వారి మందిరంలో తెలుగు-ఇంగ్లీషు ఎలక్ట్రానిక్ టైపురైటరు యంత్రాన్ని బహూకరించారు. ముఖ్యమంత్రి గారు యంత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, తానే తన ప్రొటోటైపు పేరును టైపు చేసి, తెరపై చూచుకొని, కంప్యూటరులో తెలుగా? నమ్మలేక పోతున్నాను. ఆచార్లు గారు భేష్ అంటూ, దీని రూపకర్త ఎవ్వరండి అనగానే - మనవాడే శివరావు అంటూ పరిచయం చేశారు. ముఖ్యమంత్రిగారు నన్ను చేరపిలిచి కౌగిలించుకున్నారు. వీరిని మనం సంత్కరించుకుందాము. ఆ సమావేశంలో అధ్యక్షులతోపాటు వారి కార్యదర్శి, అధికార భాష ప్రత్యేక అధికారి శ్రీ సి. ధర్మారావు గారు, గౌ॥ అధికార భాష సహాయ మంత్రి శ్రీ దాడి వీరభద్రరావు గారు, గొద్రెజ్ కంపెనీ ప్రతినిధి శ్రీ పి.వి.ఆర్.కె. గాంధీ పాల్గొన్నారు.

**వినతి :**

మా కాలంలో ప్రభుత్వ ఉత్తర్వులు (గవర్నమెంటు ఆర్డర్స్ - జీ.ఓ.లు) శిలా శాసనాలు - వెంటనే అమలు చేయడం; వాటి ఫలాలను ప్రజలకు అందేటట్లు చేయడం ఉద్యోగుల బాధ్యత. ఇప్పుడు జీ.ఓ. చిత్తు కాగితం. ఈ రోజు జారీ అయిన ఉత్తర్వు రేపు మారిపోవచ్చు, రద్దూ కానూవచ్చు. భవిష్యత్తు అగమ్య గోచరం. మాతృభాష మరుగున పడుతున్నది. మన తెలుగుజాతి బాగోగులు తల్లి, తండ్రి, గురువులు చేతిలోనే యున్నవి. మా తరం ఆ నమ్మికతోనే బతుకుతున్నది.

**యుగానికి ఒక్కడు, తెలుగు ప్రజలు 'అన్నా' అని పిలుచుకునే రామన్నకు వర్ధంతి సందర్భంగా అక్షరకుసుమాంజలి.**

వ్యాసరచయిత విశ్రాంత పరిశోధన అధికారి(అ.భాష),
ముద్రణ, కా.సా., సా.కొ.శాఖ ఆం.ప్ర.
పూర్వ ఉపాధ్యక్షుడు, తెలుగు భాషోద్యమ సమాఖ్య

## ప్రాచీన తెలుగు విశిష్టఅధ్యయన కేంద్రం డైరెక్టరుగా ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్

నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్టఅధ్యయన కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉన్న ఆచార్య డి. మునిరత్నం నాయుడు పదవీకాలం ముగిసింది. డిసెంబరు 2వ తేదీ నుండి ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ డైరెక్టరుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గతంలో మదరాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ అధ్యక్షునిగా పనిచేయడమే కాకుండా, మెరీనా శాఖలో గల ప్రాచ్యభాషల పరిశోధనా శాఖకు డైరక్టరుగా కూడా వ్యవహరించారు. సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్, మారిషస్ మొదలైన దేశాల్లో తెలుగు సదస్సులలో పాల్గొని తెలుగు విశిష్టతను చాటిచెప్పారు. తమిళ్, హిందీ భాషల నుండి అనేక అనువాదాలను చేశారు. తెలుగులిపిపై బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ లిపుల సమావేశంలో పాల్గొని 'తెలుగులిపి ఉత్తమలిపి' అనే సంగతిని డా. టేకుమళ్ల వెంకటప్పయ్య ప్రచారం చేశారు.




డి. మునిరత్నం నాయుడు     మాడభూషి సంపత్‌కుమార్

# రంగనాయకమ్మ రచనలు

**నవలలు-16:**

1) కృష్ణవేణి - 80 రూపాయలు
2) పేక మేడలు
3) చదువుకున్న కమల - 60 (2వ, 3వ పుస్తకాలు ఒకే సంపుటంగా)
4) బలిపీఠం - 60
5) కూలిన గోడలు - 50
6) స్త్రీ - 40
7) రచయిత్రి - 80
8) ఇదే, నా న్యాయం! - 60
9) కళ ఎందుకు? - 50
10) స్వీట్ హోమ్ - 180
11) అంధకారంలో - 50
12) జానకి విముక్తి - 140
13) కళ్ళు తెరిచిన సీత - 140
14) దొంగ తల్లిదండ్రులుంటారు జాగ్రత్త! - 150
15) వాళ్ళిద్దరూ అంతేనా? - 150
16) కళ్యాణి కథ - 100

**నవలా పరిచయాలు-3:**

1) స్పార్టకస్ (హోవర్డ్ ఫాస్ట్ నవల)
2) టామ్ మామ ఇల్లు (హేరియట్ బీషర్‌స్టోవే నవల)
3) స్వేచ్ఛాపథం (హోవర్డ్ ఫాస్ట్ నవల)
(ఈ 3 పుస్తకాలూ, ఒకే సంపుటంగా)-- 80

**నవలికలు-7:**

1) ప్రేమ కన్నా మధురమైనది
2) ఆండాళమ్మగారు!
3) చుట్టాలు
4) పల్లెటూరు
5) నా డైరీలో ఒక పేజీ (కొంత భాగం)
(ఈ 5 పుస్తకాలూ, ఒకే సంపుటంగా) -70
6) రత్నమ్మ గారి కోడలు.
7) సుబ్బమ్మ గారి అల్లుళ్ళు
(6వ, 7వ నవలికలు ఒకే సంపుటంగా) - 80

**నవలికలూ, వ్యాసాలూ కలిసిన సంపుటాలు-3:**

1) పల్లవి లేని పాట - 100
2) చంద్రుడు ఉండడు, తారలూ ఉండవు,
నేను ఎప్పటికీ నీ దాన్నిగా ఉంటాను ! - 80
3) **నేనిక యుద్ధం చెయ్యను!**
**ఇక సైనికుడిగా ఉండను! - 80 (ఇది కొత్త పుస్తకం)**

**కథల సంపుటం-1:**

1)అమ్మకి ఆదివారం లేదా? (50 కథలు ఒకే సంపుటంగా) - 180

**కథలూ, వ్యాసాలూ కలిసిన సంపుటాలు-3:**

1) శ్రామిక కోణం - 120
2) అభ్యుదయ ప్రేమలు! - 80
3) 'ప్రేమ'కి ముగింపు ఎప్పుడు? - 80

**పెద్ద వ్యాసాలు-17:**

1) నిశిత పరిశీలనా, దగాకోరు పరిశీలనా?
2) జనసాహితితో మా విభేదాలు
3) తీగలాగారు, డొంకంతా కదిలింది!
(ఈ 3 పుస్తకాలూ, ఒకే సంపుటంగా) - 90
4) నీడతో యుద్ధం! 50
(నాస్తిక, హేతు, నవ్యమానవ వాదాలపై 3 పుస్తకాలు కలిసిన సంపుటం)
5) చలం సాహిత్యం
(చలంగారి నవలల మీద సమీక్షలు కూడా కలిసి) - 40
6) 'అసమానత్వం'లో నించి 'అసమానత్వం'లోకే!
7) తులసి దళం కాదు, గంజాయి దమ్ము!
8) 'యజ్ఞం' కథ మీద 2 వ్యాసాలు
9) ఈ 'చక్కని పాడియావు' ఎవరిది?
(6 నించీ 9 వరకూ, ఒకే సంపుటంగా) - 90
10) వాడుక భాషే రాస్తున్నామా? - 50
11) తెలుగు నేర్పడం ఎలా? - .70
12) ఇంటి పనీ - బైటి పనీ - .40
13) దళిత సమస్య పరిష్కారానికి, బుద్ధుడు చాలడు,
అంబేద్కరూ చాలడు, మార్క్సు కావాలి - 70
14) ఇంగ్లీషు కీకారణ్యంలోకి ప్రవేశించండి!
(తెలుగు విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామరు పాఠాలు) - 150
15) కమ్యూనిస్టు పార్టీ ఎలా ఉండకూడదు? - 60
16) కమ్యూనిస్టులు, బూర్జువా పార్లమెంటరీ ఎన్నికల్లో
పాల్గొనవచ్చునా, లేదా? - 40
17) మార్క్సిజం మీద విమర్శలకు జవాబులు - 40

**వ్యాసాల సంపుటాలు-7:**

1) మానవ సమాజం ( నిన్నా, నేడూ, రేపూ) - 100
2) మార్క్సిజమే తెలియకపోతే, పుట్టినవాళ్ళం పుట్టినట్టే వుంటాం! -100
3) మార్క్సే నా టీచరు! - 50
4) ఇది, మానవ సమాజమేనా? - 50
5) '' మహానటి '' సినిమా, ఆ 'నటి ' కి న్యాయం చేయదు - 70
6) 'సంపద సృష్టి కర్తలు'' ఎవరు ? - 40
7).మాట్లాడవలిసింది, 'శ్రామికవర్గ అస్తిత్వం' గురించే1

**ప్రశ్నలూ, జవాబులూ-2:**

1. శాస్త్రీయ దృక్పథం
2. పాఠకుల ప్రశ్నలూ, రంగనాయకమ్మ జవాబులూ
(ఈ 2 పుస్తకాలూ ఒకే సంపుటంగా) - 60

**అనువాదాలు-2:**

1. చైనాలో ఏం జరుగుతోంది? - 50
2. చైనాలో సాంస్కృతిక విప్లవమూ, పరిశ్రమల నిర్వహణా! %-- 50

**ఇతర రచనలు-18:**

1) రామాయణ విషవృక్షం (ఒకే సంపుటంగా) - 250
2) మార్క్స్ ''కాపిటల్'' పరిచయం. - 330 (2 సంపుటాలుగా)
3) ఒకటవ తరగతి తెలుగు వాచకము - 20
4) పిల్లల కోసం ఆర్థిక శాస్త్రం
(మార్క్సు ' కాపిటల్' ఆధారంగా రాసిన 95 పాఠాలు)- 120
5) శ్రమ దోపిడీ ప్రపంచాన్ని మార్చాలి! - 50
6) ఆత్మ కథాంశాల ఉత్తరాలు - .40
7) తత్వశాస్త్రం-చిన్న పరిచయం. - .80
8) ఇదండీ మహా భారతం! - 170
9) ఒక సంఘ సంస్కర్త భార్య ఆత్మ కథ!
ఒక పాటల కవి భార్య మనోవేదన! - 40
10) పాఠకులు నాకు రాసిన ఉత్తరాలు - 50
11) వేదాలు! వేదాలు! వేదాలు! వేదాలు! ఏం చెప్పాయి వేదాలు? - 90
12) 1917 అక్టోబరు విప్లవం ఎందుకు పోయింది?
సోవియట్ రష్యాలో ఏం జరిగింది? - 100
13) మార్క్స్ రాసిన 'కాపిటల్' పుస్తకం ఏం చెప్పింది? - 100
14) 'కమ్యూనిస్టు ప్రణాళిక' పరిచయం - 40
15) 'పారిస్ కమ్యూన్' పరిచయం - 50
16) మార్క్సు-ఎంగెల్సులు వర్గాలగురించి ఏం చెప్పారు ? - 50
17) ఒక వస్తువు 'ధర'కీ, ఆ వస్తువు కోసం జరిగిన 'శ్రమ'కీ,
సంబంధం ఎలా ఉంటుంది ? - 50
18) కమ్యూనిస్టు సమాజాన్ని చూద్దాం ! - 50

ప్రతులకు:**అరుణా పబ్లిషింగ్ హౌస్**
**ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002**
**(ఫోన్: 9440630378)**

బూర్ల వేంకటేశ్వర్లు
94915 98040

# శిమాంట శిమాంట...

తెలంగాణల ఒక మాటను రెండు మార్లు అనుడు ఎక్కువ. అట్ల మాట్లాడుతే ఎంత ముద్దు ముద్దుగ ఉంటది, ఒక్కసారి ఇనుండ్రి. ఈ కట్టం పాడుగాను "శిమాంట శిమాంట (శివా అంట)" ఎవలి దగ్గర్కి వోవాలె!. ఏ ఉత్త దండలు గట్టుడే గాదు "నడుమ నడుమ" కొన్ని పూలు జల్లుండ్రి!. "రాను రాను" నేనే పరాయినై పోయినగద మీకు. "పడి పడి" ఉరుకుతె పదిత్తులు దొర్కక పాయె గదరా!. రామ రామ ఎంత మాటంటివి, శివ శివ నెత్తి నోరు మొత్తుకున్నా ఇనకపాయె. ఇట్ల ఎన్నైన చెప్పచ్చు.

ఇది తెలుగు జీవ భాష లక్షణం. ఇట్ల మాట్లాడుతే ఎంత తియ్యగ ఉంటది. వింటె ఎంత కమ్మగ ఉంటది. ఈ లక్షణం పద్యాలల్ల, పాటలల్ల, జానపదాలల్ల గూడ కనవడుతది. పునరుక్తి చేసి చెప్పుడంటే నొక్కి వక్కాణించడమే! ఇది తెలుగు భాషల నన్నయనాటి నుంచి ఉన్నదే. తెలుగు ప్రాచీనతను ఎంతో కొంత నిలుపుకున్న తెలంగాణల ఇప్పటికి కూడా వినిపిస్తది. పొయ్యి పొయ్యి వానికే ఇచ్చినవా, చేసి చేసి చేతులు పోతున్నయ్, తెలిసి తెలిసి వాని దగ్గరికే పోయినవా, విని విని చెవులు చిల్లులు పడుతున్నయ్, మాటి మాటికి వాణ్ణే యాది జేసుకుంటాన్నం, వంటియి కోకొల్లలు.

నన్నయ రాసిన మహాభారత ఆదిపర్వం చతుర్థాశ్వాసంల శకుంతల తనను గుర్తు పట్టనట్టుగ నటిస్తున్న దుష్యంతుని నిలదీసే సందర్భంల "ఎఱిఁగి యెఱిఁగి" ని వాడడం కనిపిస్తది. "ఏల యెఱుకలేని యితరుల యట్ల నీ వెఱుగననుచు బలికెదెఱిఁగి యెఱిఁగి" అని శకుంతల దుష్యంతునితో అంటది. ఇక్కడ బాగా తెలిసి అనే అర్థంల కాక కపట పూరితమైన మనస్సుతో కూడిన, ఉద్దేశ్యపూర్వకంగా కావాలనే తప్పించుకోవాలని చూస్తున్న దుష్యంతుని అంతరంగాన్ని బయట పెట్టింది. పాల్కురికి సోమన్న రాసిన "బసవ పురాణం" ల గూడ ఎన్నో ఉన్నయ్ ఉదా: ఉరికుర్కి పడు, గొడుగులు గొడుగులు, పడుగలు పడుగలు, పేరుపేరున, గడిగడికి, ఎదురెదుర్ గాను, కోటానకోటి, సుర సుర కమరి, అడుగడ్డు వంటియి ఎన్నో కనవడుతున్నయ్. పోతన్న లాటాను ప్రాసగ రాసిన " కమలాక్షు నర్చించు కరములు కరములు, శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ కూడ ఇటువంటి సక్కదనాల ముచ్చటే..

భాస్కర శతకంల మారద వెంకయ్య "సిరి గల నాడు, మైమరచి చిక్కిన నాడు, తలంచి పుణ్యముల్ పోరి పోరి చేయనైతి నని పొక్కినఁ గల్గునె? గాలి చిచ్చు పై కెరలిన వేళ, దప్పి గొని కీడ్పడు వేళ, జలంబుఁ గోరి త త్తరమునఁ ద్రవ్వినం గలదె? దాశరథీ కరుణాపయోనిధీ!" అని రాసుడు చూడచ్చు. వేమన "అనగ ననగ రాగమతిశయిల్లుచు నుండు, తినగ తినగ వేము తియ్యనుండు" అని అనుడు కూడ విన్నం గదా!. అదివో అల్లదివో అన్న అన్నమయ్య, పాహి రామ ప్రభో - పాహి రామ ప్రభో - పాహి భద్రాద్రి వైదేహి రామ ప్రభో" అన్న కంచెర్ల గోపన్న కీర్తనలోనూ చూడచ్చు. రామ రామ రామ ఉయ్యాలో- రామనే శ్రీరామ ఉయ్యాలో, అయ్యయ్యో ఓ రామ ఉయ్యాలో-అయ్యోధ్య రామ ఉయ్యాలో అని తెలంగాణ అక్క చెల్లెండ్లు పాడుకునే ఉయ్యాల పాటల్ల కూడ ఎన్నో ఉదాహరణలున్నయ్. కోరి కోరి వారమూల కూర దెచ్చుకుంటరో అన్న గోరటి ఎంకన్న, వానమ్మ వానమ్మ వానమ్మా ఒక్కసారన్న వచ్చిపోవే వానమ్మా అన్న జయరాజన్న. లాల్ సలాం లాల్ సలాం అంటూ పాడుకున్న అమరుల గీతాలు ఎన్నిటిలోనో పదాలను మల్ల మల్ల వాడి మాటలకు, పద్యాలకు, పాటలకు వన్నె తెచ్చుడు కనిపిస్తది.

"దేవుడు దేవుడంటవ్ దేశాలమీద వోతవ్" అని జానపదంల, "గల గలా గోదారి కదలిపోతుంటేను-బిర బిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను, నారాయణ నారాయణ అల్లా అల్లా అని గేయాలల్ల, ఇంటింటికి మంటి పొయ్యి, రాను రాను రాజుగారి గుర్రం గాడిదయ్యింది లాంటి లోకోక్తులల్ల, కొమ్మ కొమ్మకూ సన్నాయి కోటి రాగాలు ఉన్నాయి, వాలు వాలు చూపులతో గాలమేసి లాగి లాగి, నరుడా ఓ నరుడా ఏమి కోరిక, ముసి ముసి నవ్వులలోన, నువ్వు నువ్వు నువ్వే నువ్వు వంటి ఎన్నెన్నో సినిమా పాటల్ల ఎందెందు వెదికి చూసిన అందందే కలదు పద పునరుక్తి.

అయితే, ఈ రెండు రెండు సార్లు వాడే పదాలల్ల నామవాచకాలు, క్రియా పదాలు, ధ్వన్యనుకరణ పదాలు, అవ్యయాలు, విశేషణాలు, భావార్థకాలు వంటివి ఎక్కువగ కనిపిస్తయి. హిందీ ఉర్దూల గూడ గిట్ల ఫటా ఫట్, ధనాధన్, సటా సట్, గర్మా గరమ్ అని ఎన్నో ఉన్నయ్. ఇగ తెలంగాణల ఎన్నిగనం ఉన్నయో సూడుండ్రి.

కిస కిస నవ్వుడు ఆవుండ్రి, కట కట సప్పుడు ఐతంది, మిల మిల మెరుస్తంది, సుర సుర అంటంది, బర బర గోకుతండు, ముల ముల వెదుతంది, బొయ్య బొయ్య ఇసురుతంది, మిర్ర మిర్ర/ మిట మిట/ మిట్ట మిట్ట జూత్తంది, లట్ట లట్ట/ గట్ట గట్ట తాగుతండు, తట తట కాళ్ళు గొడుతండు తుప్ప తుప్ప వాన వడుతంది, సర్ర సర్ర పాకుతంది,బొల బొల వోత్తంది, సిట సిట వెదుతంది, గొర్ర గొర్ర గుంజుక పోతండు, మల్ల మల్ల అడుగుతండు, మర్లి మర్లి సూత్తండు, ఒర్రి ఒర్రి ఊకున్న, అట్ల అట్ల ఉన్నది, ఊకూకె రాకుండ్రి, మాటి మాటికి పోకుండ్రి, తేప తేపకు ఎవడత్తడు, మాట మాటకు బూతులేనా , పూట పూటకు/పైస పైసకు గండమైతంది, పానం సొద సొద వోతంది, అంగడి అంగడి/ లొల్లి లొల్లి జేత్తండ్రు, ఆగమాగం పోయినం, తడ తడ కొట్టుకుంటంది, పట్ట పట్ట గొట్టిండు పిస్స పిస్స ఒర్రుతండు, గున గున పోతంది, కిస్స కిస్స/ ముసి ముసి నవ్వుతంది, లంబుకు లంబున్నడు, మొద్దుకు మొద్దు ఉన్నడు, తుంటకు తుంట ఉన్నడు, కంకెడు కంకెడు తినాలె బడబడ మాట్లాడడు, దబ్బదబ్బ పొండ్రి, జెల్లి

తరువాయి 41వ పుటలో....

బద్రి కూర్మారావు
97047 98643

# భిలాయి ప్రవాసాంధ్ర తెలుగు సాహితీ విమర్శకుడు-
# గూడ శ్రీరాములు గారు

**ఉ**మ్మడి మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 1888లో రైల్వేలు స్థాపన, 1954 భిలాయి స్టీల్‌ప్లాంట్ స్థాపనతో ఇతర ప్రాంతాల వారిలాగానే తెలుగు ప్రాంతల నుండి బతుకుతెరువు కోసం ప్రస్తుతం చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని భిలాయి, దుర్గ్, రాయిపూర్, బిలాస్‌పూర్, కోర్బా, జగదల్‌పూర్ వంటి ప్రాంతాలకు లక్షకు పైగా తెలుగువారు వచ్చి స్థిరపడ్డారు. పుట్టిన గడ్డమీద మమకారం, మాతృభాషమీద అభిమానంతో తెలుగు పండుగలైన సంక్రాంతి, ఉగాది, శ్రీరామనవమి, ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాలు, గురజాడ, శ్రీశ్రీ, కందుకూరి, పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజు జయంతులు, వర్ధంతులు జరుపుకొని నాటక కళారంగాలు స్థాపించారు.



గూడ శ్రీరాములు గారు

**ఎం**తోమంది తెలుగు సాహిత్యరంగంలో కథ, కవిత, వ్యాసం, నాటకం, వంటి రచనలు చేశారు. సాహిత్య, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎంతోమంది రాణిస్తున్నారు. ప్రవాసాంధ్ర నాటక కళాసమితి, కళాంజలి పేర్లతో విజయవాడ, గుంటూరు, హైదరాబాదు, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం వంటి చోట్ల నాటక పోటీలలో పాల్గొని బహుమతులు పొందారు. అలాగే తెలుగు ప్రాంతాలనుండి నాటక కళాసమితులను ఆహ్వానించి వారి ప్రదర్శనలను తిలకిస్తుంటారు. మరికొంతమంది తెలుగువారు రచయితలుగా, సాహితీ విమర్శకులుగా రాణించారు. అటువంటి వారిలో గూడ శ్రీరాములుగారు ఒకరు.

తెలుగు రాష్ట్రాల నుండి వలసపోయిన వారిలో శ్రీకాకుళం జిల్లా వాసులు ముఖ్యంగా పలాస, సోంపేట, ఇచ్ఛాపురం ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో ఉన్నారు.

వీరు ఉన్నతమైన విద్యావంతులు కాకపోవడం చేత మెకానిక్, ఫోర్‌మన్, డ్రైవరు, ఫిట్టరు, ఎలక్ట్రీషియన్ వంటి చిన్నపాటి 4వ తరగతి ఉద్యోగాలలో చేరారు. అటువంటి వారిలో గూడ శ్రీరాములు గారు ఒకరు. బిలాయి సాహిత్య రంగంలో ప్రముఖులు వీరు. కవితలు, కథలు, మినీలు, హైకూలు దాదాపు అన్ని సాహిత్య అంశాలపైనా విమర్శ, సమీక్షలు రాశారు. సాహిత్య విమర్శ, సమీక్ష గుర్తింపు లేవని తెలిసినా గుర్తింపు నాశింపక వాటినే అనుసరించారు. 35 ఏళ్ళ నుంచి సాహిత్య రంగంలో కొనసాగుతూ ఇప్పటికీ కొన్ని వందల సమీక్షలు రాశారు. ఇవి ఆంధ్రప్రదేశ్‌లో అన్ని దిన, వార, మాస పత్రికలలో వెలవడ్డాయి.

శ్రీరాములు గారు ఆనాటి మద్రాసు ప్రెసిడెన్సీ, విశాఖజిల్లా(ప్రస్తునం శ్రీకాకుళం) సోంపేట తాలూకు కంచిలి దరి కొల్లూరు అను మారుమూల గ్రామంలో నిరుపేద కుటుంబంలో 1937 జూలై 17న జన్మించారు. తల్లితండ్రులు నిరక్షరాస్యులు. సోంపేట హైస్కూలులో యస్.యస్.సి (1954) వరకు చదువుకున్నారు. పశ్చిమబెంగాల్‌లోని చిత్తరంజన్ పాలిటెక్కికల్‌లో 3 సం॥లు డిప్లమో చేశారు. 1958లో భిలాయి స్టీల్‌ప్లాంట్‌లో టెక్నిషియన్‌గా, ఇన్‌స్ట్రక్టర్‌గా సేవలందించారు. 1962లో వివాహం జరిగింది. ఈయన మామగారు కాళ్ళ బలరాంస్వామి ఇచ్ఛాపురం సమితి ప్రెసిడెంట్‌గాను, శాసనసభ్యునిగా పోటీ చేశారు. అడ్వకేట్ మరియు జిల్లా బోర్డు మెంబరుగా పనిచేశారు.

శ్రీరాములుగారు భిలాయిలో పనిచేసిన నాటి నుండి భారతి వంటి మాసపత్రికలు, తెలుగు సాహిత్య పత్రికలు, దినపత్రికలు తెలుగు ప్రాంతాల నుండి తెప్పించుకొని చదివేవారు. 1963లో భారతిలో తాను రాసిన మొదటి వ్యాసం అచ్చురూపంలో చూసుకొని ఆనందించారు. తరువాత ఎక్స్‌రే సాహిత్య పత్రికలో 32 సం॥ కొల్కూరి వారితో అనుబంధం ఉంది. పుస్తక సమీక్షలు చేశారు. ఒడియా, బెంగాలీ, హిందీ సాహిత్యాలతో పరిచయం జరిగింది. అరసం, విరసం, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సమాఖ్య, ప్రజా జనసాహితీ, భిలాయి వాణి ఆదరించి అభిమానించి ప్రోత్సాహించాయి.

అద్దేపల్లి రామమోహనరావు, రాయ్‌గారు, సోమసుందరం కుందుర్తి, జ్వాలాముఖి, శివారెడ్డి, నిఖిలేశ్వర్, కొల్లూరు వంటి తెలుగు సాహితీ వేత్తల పరిచయం పెరిగింది.

కాకినాడ, వరంగల్, గుంటూరు, తెనాలి, విశాఖపట్నం, వంటి చోట్ల సాహిత్య సభలలో పాల్గొన్నారు. భారతి, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, రుణతార,



శ్రీ గూడ శ్రీనివాసరావు గారితో వ్యాస రచయిత బద్రికూర్మారావు గారు

మిసిమి, భిలాయి వాణి వంటి దిన, వార, మాస పత్రికలలో వ్యాసాలు రాశారు.

విజయవాడ రెడియోస్టేషన్ నుండి సాహిత్య ప్రసంగాలు చేశారు. పోస్ట్‌మోడర్నిజం- ఒక పరామర్శ (జనసాహితీ ప్రచురణ 2001), తెలుగు సాహిత్యంలో అధివాస్త వికత, శ్రీశ్రీ(అముద్రితం), మేధావి కొ.కు, ప్రజాకవి మయ కోవ్‌స్కి, కుందుర్తి శ్రీరంగం నారాయణ బాబుప్రోయిడో-మార్క్సిజం, తెలుగు సాహిత్యంలో ఆధునికొత్తర ప్రతిధ్వనులు వంటి పలు వ్యాసాలు రాసారు.

ఈయన రాసిన వ్యాసాలన్నింటితో 'భిలాయివాణి' గూడ శ్రీరాములు వ్యాసాలు పేరుతో ఏప్రిల్ 2015న ఒక పుస్తకంగా తీసుకు వచ్చింది. ఆ పుస్తకం శ్రీకాకులంలో ప్రముఖ రచయిత, తెలుగు సాహితీ విమర్శకుడు ఛాయరాజ్ వర్ధంతి సందర్భంగా ప్రజాసాహితీ అధ్యక్షుడు దివికుమార్, విజయచంద్రలు అవిష్కరించారు. 2016 ఏప్రిల్‌లో పలాసలో లలిత కళారంజని ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. 2016లో ఆంధ్ర విశ్వవిద్యాలయం విశాఖపట్నంలోనూ ఆవిష్కరించి సమీక్షించారు. ఈయన భిలాయి తెలుగు సమాజం నిర్మాణంలో ఒకరు. యాదవుల చరిత్రపై పుస్తకం రాశారు(అముద్రితం). ప్రస్తుతం వీరి వయస్సు 85 సంవత్సరములు.

తన జీవిత భాగస్వామి ఇటీవల కాలంచేసారు. నిరాడంబరమైన జీవితం గడుపుతూ ఇప్పటికీ ప్రజాసాహితి, విహంగవీక్షణం వంటి పత్రికలు తెప్పించుకొని చదువుతూ ఉంటారు. 10 ఏళ్ళ క్రితం ప్రవాసాంధ్ర ప్రథమ మహాసభలు (భిలాయి)లో పరిచయమైన గూడ శ్రీరాములు గారు తరచుగా ఫోనులో సాహిత్య విషయాలు చర్చించడంతో పాటు ఇటీవల భిలాయిలో డా॥ కె.చిరంజీవులు గారి అమ్మాయి వివాహానికి వెళ్ళినపుడు శ్రీరాములు గారిని వారి ఇంటి వద్ద కలిసి ముచ్చటించిన విషయాలను మీ ముందు ఉంచుతున్నాను.

ఒక సామాన్య కుటుంబంలో, మారుమూల పల్లెలో జన్మించిన గూడ శ్రీరాములు సాహిత్యంలో ఎదగడానికి ఆయనకు తెలుగు భాషపై అభిమానంతో పాటు, స్వయంకృషి ఉంది. ఇంకా భిలాయి, రాయిపూర్‌లలో అనేకమంది తెలుగు రచయితలు, కవులూ, నాటక కళాకారులున్నారు. వారందిరిని మరోసారి పరిచయం చేస్తాను. అయితే భిలాయిలో ప్రస్తుత తరం తెలుగు భాషకు దూరం అవ్వటం బాధాకరంగా ఉంది. తెలుగుభాషాభిమానులు, ప్రవాసాంధ్రులు ఆ దిశగా ప్రయత్నించాలని కోరుకుంటున్నాను.

రచయిత - ఉత్తరాంధ్ర సాంస్కృతిక వికాస ఉద్యమ ప్రముఖుడు, ఆదివాసుల కళల రక్షణకై పనిచేస్తున్నారు

కవిత

## నీ వల్లే

గాలి వానకు
మట్టి గోడలు కూలినట్టు
భూకంపం వచ్చి
భూమి చీలినట్టు
ఎందరి మాన ప్రాణాలు
శిథిలమై పోతున్నయో కదా
ఇవన్నీ నీవల్లే...?

మాటకు విలువ లేదు
మనిషికి మర్యాద లేదు
ముఖాన చిరునవ్వు లేదు
బ్రతుకులు భరోసా లేదు
ఇవన్నీ నీవల్లే...?

బ్రతుకులు సాగలేదు
ఆకలి తీరలేదు
చదువులు సాగలేదు
సంపద లేనే లేదు
ఇవన్నీ నీవల్లే...?

నాలుగు గోడలమధ్య
ఎన్ని కన్నీళ్లో
ఎన్ని రోదనలో
ఎన్ని రుగ్మతలో
ఇవన్నీ నీవల్లే...?

నువ్వు బాధ్యత మరవగ
వచ్చిన కష్టాలే ఇవన్నీ
ఒక్కసారి మనసుపెట్టి
ఆలోచించ కూడదా
నీ బాధ్యత గూర్చి
నిన్ను నమ్ముకొన్న
నమ్మకాల గూర్చి ...
సంతోషాలు అయినా
దుఃఖాలు అయినా
అన్నీ "నీవల్లే"

లక్ష్మీ శ్రీనివాస్
9676601182

టి.వి.రామకృష్ణ
99514 41131

# బాలసాహిత్యం - కథలు

**మన భారతదేశం కథలకు కాణాచి. కొన్ని వందల సంవత్సరాల నుండి ఇతిహాసాలు, పురాణాలు అన్నీ కథల రూపంలోనే ఉన్నాయి. భారతం, భాగవతం, రామాయణం అన్నీ కథల రూపంలోనే రచించబడ్డాయి. భారతంలో ఎన్నో అనుబంధ కథలు ఉన్నాయి. ఎన్నో పౌరాణిక గాథలు ఉన్నాయి. ఇప్పటికి కూడా అనేక వ్రతాలు చేసేటప్పుడు దాని చివర ఒక కథతో ముగిస్తారు. అలాగే ప్రతీ గుడికి ఒక స్థానిక చరిత్ర లేదా స్థలపురాణం ఉంటుంది.**

పుస్తకాలు ప్రచురితం అయ్యేదాకా అవన్నీ మౌఖిక రూపంలోనే ఉండేవి. అన్నీ పౌరాణిక కథలను వివిధ జానపద కళా రూపాలలో ప్రదర్శించేవారు. మన తెలుగు రాష్ట్రాలలో హరికథ, బుర్రకథల రూపంలో అనేక పౌరాణిక గాథలను ఈ జానపద కళారూపాలలో కథలుగా చెప్పేవారు. దాదాపు 11-12 వ శతాబ్దం వరకు సంస్కృతం చలామణిలో ఉంది. సంస్కృతం పండిత వర్గాలలో చలామణి అయ్యేది. సామాన్యులకు అందుబాటులోకి రావటానికి ఈ ఐతిహాసిక కథలను ఈ జానపద కళారూపాలలో ప్రదర్శించేవారు. ప్రజలను చైతన్య పరిచేందుకు ఈ కథా రూపాలనే ఎంచుకునేవారు. ఇవన్నీ భక్తి మార్గాన్ని, నైతిక మార్గాన్ని సూచించే కథలే. సంఘంలో నైతిక విలువలు, సాంఘిక కట్టుబాట్లు, నియమాలు, ఆచార వ్యవహారాలను పాటించటానికి ఈ కథా రూపాలనే విరివిగా వాడుకున్నారు. గురుకుల విద్యాభ్యాస సమయంలో కూడా వేదాలు, వైదికధర్మాలతో పాటు పౌరాణిక ఇతిహాసాలను కథల రూపంలో చెప్పడం ఒక ఆచారంగా కొనసాగింది. గురుకుల విద్యార్థులను చైతన్య పరిచేందుకు, నైతికవిలువలు, సాంఘిక ఆచారాలు పెంపొందించడానికి ఈ ఐతిహాసిక కథలను విరివిగా వాడుకున్నారు.

అప్పటి వరకు సంస్కృతమే ప్రధాన బాష కాబట్టి పెద్దలతో పాటు పిల్లలు కూడా అన్నీ ఇతిహాస కథలు, పౌరాణిక గాథలు గురుకుల వ్యవస్థలో సంస్కృత భాషలోనే నేర్చుకొనేవారు. 5వ శతాబ్దంలోనే రచించబడిందని చెప్పబడుతున్న విష్ణుశర్మ రాసిన "పంచతంత్ర" కూడా సంస్కృత భాషలోనే రచించబడింది. మన ఇతిహాసాలు, పురాణాలు అన్నీ కూడా కథా రూపంలో ఉండబట్టే అవి కొన్ని వందల, వేల ఏళ్ళుగా చలామణి అవుతూ వచ్చాయని మనం అర్థం చేసుకోవాలి. అంతేకాకుండా అవన్నీ మౌఖిక కావ్యాలు. అంతేకాదు ఈ రచనలు పెద్దలకు, పిల్లలకు అనే ప్రత్యేకమైన విభజన ఉండేది కాదు.

మన పూర్వీక మునులు గొప్ప కథా రచయితలుగా కొనియాడబడ్డారు. మహాభారతం, రామాయణం, భాగవతం వంటి వావ్యాలు అద్భుత రచనా ప్రక్రియలుగా ఇప్పటికి కొనసాగుతున్నాయి. వారు చెప్పిన కథావిధానం, శైలి, పాత్రలు, వైవిధ్యం, ప్రపంచ రచనా చరిత్రలోనే ఎక్కడా లేవనేది వాస్థవం. అవి వాస్తవ గాథలా లేదా కల్పిత గాథలా అనేది మనకు ఇప్పుడు అప్రస్తుతం. అయితే ఒకటి మాత్రం మనం ఖచ్చితంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఏ రచయిత అయిన లేదా ఏ రచన అయినా అప్పటి సమకాలీన పరిస్థితులు, సాంఘిక ఆచారాలు, కట్టుబాట్లు వంటి వాటిని, తన అనుభవంలో ఉన్న సంఘటనలను తన రచనా ప్రక్రియకు వాడుకుంటారనేది మాత్రం వాస్తవం. మన ఇప్పటి రచయితలు ఆచరించే ప్రక్రియ కూడా అదే. ఈ పౌరాణిక గాథలన్ని మన సంస్కృతీ, సాంప్రదాయాల పరంపరగా చెప్పుకోవచ్చు. అలాగే ఈ ఇతిహాస కథలు చారిత్రాత్మక ఆధారాలుగా మనం చెప్పుకోవచ్చు. ఇవి ఒకరకంగా వాఙ్మయ చారిత్రాత్మక ఆధారాలుగా కూడా మనం చెప్పుకోవచ్చు.

ఒక రచయిత తన అనుభవంలోని అంశాలకు తన ఊహాసక్తిని జోడించి, కొంత కల్పితాన్ని జోడించి ఏదో ఒక సందేశాన్నో, విషయాన్నో వివరించడానికి ప్రయత్నిస్తాడు. ఇదే ప్రక్రియ మన పౌరాణిక గాథలలో జరిగిందని మనం తెలుసుకోవాలి. మనం ఇప్పుడు చెప్పుకొనే అనేక రచనా ప్రక్రియలను మన మునులు లేదా పౌరాణిక గాథల రచయితలు కొన్ని వందల, వేల ఏళ్ల నాడే మనకు అందించారని చెప్పాలి. ఆ గాథలలో లేదా కథలలో మనం ఇప్పుడు సాహిత్య ప్రక్రియలో చెప్పుకొనే లేదా వాడుకొనే ఊహాగాథలు (Fantacy), వైజ్ఞానిక కల్పనా (Scence fiction) గాథలు ఎన్నో వందల సంవత్సరాల క్రిందనే వాళ్ళ రచనా ప్రక్రియలో వాడుకున్నారని ఆ గాథలను పరిశీలించినప్పుడు మనకు అర్థం అవుతుంది. ఒక గాథలోని ముఖ్యమైన పాత్రని ఒక ఆదర్శవంతమైన పాత్రగా లేదా వ్యక్తిగా అద్భుతంగా చిత్రీకరించడం వల్ల, ఆ పాత్ర కొన్ని దశాలపాటు చలామణి కావడం వల్ల ఆ పాత్రలు లేదా వ్యక్తులు దైవాంశ సంభూతులుగా చలామణి అయ్యారనేది వాస్తవం. ఇప్పటికి ఆ పాత్రలు దైవాంశ సంభూతులుగా భావించబడుతున్నాయి. ఇక్కడ మనం ముఖ్యంగా తీసుకోవాల్సిన అంశం, చర్చించాల్సిన అంశం వారి అద్భుత రచనా విధానాన్ని, కథా విధానాన్ని గూర్చి మాత్రమే. దీనినిబట్టి మన దేశం కథల కాణాచి అని, వివిధ కథా రూపాలను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత మనదే అని తెల్పి చేప్పడమే నా ముఖ్య ఉద్దేశం.

11-15వ శతాబ్ద కాలంలో ఈ సంస్కృత గాథలన్ని తెలుగులోకి అనువదించబడ్డాయి. ఆ తర్వాత శతాబ్దాలలో అనేక పౌరాణిక గాథలు తెలుగులోకి అనువదించబడ్డాయి. వాడుక భాషలో పెద్దలతో పాటు పిల్లలు కూడా ఈ పౌరాణిక గాథలను వివిధ కళారూపాలలో విన్నారు.

అంతే కాదు ప్రపంచ సాహిత్యానికి ఒక అద్భుత రచనా ప్రక్రియను, ఒక నూతన కథా ప్రక్రియను అందించిన ఘనత కూడా భారతదేశానిదే అని ఖచ్చితంగా చెప్పుకోవాలి. అదే 'పంచతంత్ర'.

విష్ణుశర్మ అనే పండితుడు ఒక రాజుగారి మూర్ఖులైన ముగ్గురు కొడుకులను మంచివారుగా, ఆదర్శవంతమైనవారుగా తీర్చిదిద్దడానికి పరిచయం చేసిన అద్భుత కథా విధానం పంచతంత్ర. అయన ఎన్నుకున్న కొత్త కథా ప్రక్రియ జంతువులు, పక్షులు మానవులలాగా మాట్లాడుతూ, ప్రవర్తిస్తూ ఉండడం. జంతువుల ద్వారా, వాటి స్వభావాల ద్వారా కథా ప్రక్రియలను ఎన్నుకొని మానవ జీవితానికి అవసరమైన ధర్మ సూత్రాలు, నీతి సూత్రాలు చెప్పించడం 'పంచతంత్ర' ముఖ్య ఉద్దేశం. కథాచరిత్రలో ఈ ప్రక్రియ ఒక నూతన ఒరవడి కాబట్టే పంచతంత్ర సంస్కృతం నుండి అనేక ప్రపంచ భాషలలోకి అనువదింపబడింది. దాదాపు 50 విదేశీ భాషలలో పంచతంత్ర అనువదించబడింది, అలాగే దాన్ని అనుకరించి అనేక కథా రూపాలు వివిధ దేశాలలో వెలువడ్డాయి. ఇది ఒక అద్భుత కల్పిత(Fiction) కథా రచన. ఇది పెద్దలకు నీతిని బోధించే కథా విధానమైనా, దాని రచనా శైలి, జంతువుల పాత్రలు, కథా విధానం వల్ల ఇప్పటికి పంచతంత్ర పిల్లల కథారచన గానే కొనసాగుతున్నది. దీనిని ఆదర్శంగా తీసుకొని ప్రపంచ వ్యాప్తంగా అనేక కథలు పంచతంత్ర తరహాలోనే రచించబడ్డాయి. వాటిలో చాల ప్రాచుర్యం పొందివాటిలో ఒకటి 'మోగ్లి,' రెండవది 'ద లయన్ కింగ్'. పంచతంత్రను చిన్నయసూరి, వీరేశలింగం పంతులు తెలుగులోకి అనువదించారు.

ఆ తరువాత మనం చెప్పుకోవాల్సిన కథాప్రక్రియ బుద్ధుని కాలంలో రచించబడ్డ "జాతక కథలు". ఇవన్నీ పాళీ భాషలో రచించబడ్డాయి. ఈ కథలు కుడా అనేక విదేశీ భాషలలోకి అనువదించబడ్డాయి. ఈ కథలు షుమారు 500 –600 వరకు ఉంటాయి. సాధారణ మానవుడు పాటించవలసిన ధర్మాలు, నీతి, నిజాయితీ, త్యాగం వంటి సందేశాలతో రచించబడ్డాయి. నీతికథలు కాబట్టి ఇవికూడా ఇప్పటికి పిల్లల కథా రచనలుగా చలామణి అవుతున్నాయి.

ప్రత్యేకంగా బాలసాహిత్యం అనే విభాగం మనకు 19వ శతాబ్ధం నుంచి ప్రారంభం అయినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బ్రిటిషు వారి హయాంలో మత ప్రచారానికి వారి మిషనరీ స్కూళ్ళలో ఏసుక్రీస్తు కథలను పిల్లల కోసం ప్రత్యేకంగా ప్రచురించినట్లు తెలుస్తోంది. చాలా కాలం కాశిమజిలీ కథలు, పేదరాసి పెద్దమ్మ కథలు చలామణీ అయ్యాయి. తెలుగులో అనేకమంది పంచతంత్ర కథలు, రామాయణ, మహాభారత కథలు, పెద్దబాలశిక్ష వంటివి రాశారు. అయితే ఇవన్ని గ్రాంధిక భాషలో ఉండడం వల్ల పిల్లలకు పెద్దగా ఉపయోగపడి ఉండవు. 1893లో కందుకూరి వీరేశలింగం పంతులు పిల్లలకోసం "నీతి కథామంజరి" (Aesop's Fables)అనే బొమ్మల కథల పుస్తకాన్ని రెండు భాగాలుగా ప్రచురించినట్లు తెలుస్తోంది.



1940లో మొట్టమొదటగా 'బాలమిత్ర' బాలల పత్రిక ప్రారంభించబడింది. ఆ తర్వాత న్యాయపతి రాఘవరావు 1945లో 'బాల' బాలల పత్రికను స్థాపించారు. 'చందమామ' 1947లో ప్రారంభించబడింది. దాదాపు 11



భారతీయం భాషలలో ఇది ప్రచురింపబడింది. దేశవ్యాప్తంగా చందమామ ప్రసిద్దిగాంచింది. ఈ పత్రికలూ ప్రారంభం అయినప్పటి నుండి ఇతిహాస కథలు, పురాణ గాథలనుండి ''జానపద కథల'' యుగంలోకి బాలసాహిత్యం ప్రవేశించింది. దాదాపు 50 సంవత్సరాలు జానపద కథలు, నీతి కథలతో తెలుగు బాల సాహిత్యం కొనసాగింది. ఇదే స్పూర్తితో బొమ్మరిల్లు, బుజ్జాయి, బాలజ్యోతి లాంటి అనేక పత్రికలు వెలిసాయి. 1967లో "అమర చిత్ర కథ" స్థాపించబడింది. "కామిక్" పుస్తకాలను ప్రచురించి బాల సాహిత్యంలో ఒక కొత్త ఒరవడిని సృష్టించారు. ఇతిహాస కథలు, అఖ్బార్ బీర్బల్ కథలు, జీవిత చరిత్రలు అన్నింటిని "కామిక్" పుస్తకాలుగా ప్రచురించారు. "కామిక్" పుస్తకాలను ముఖ్యమైన అన్నీ భారతీయ భాషలలో ఇప్పటికీ ప్రచురిస్తున్నారు.

ఈ సందర్భంగా మనం శంకర్ గారి గూర్చి కొంత తెలుసుకోవాలి. పిల్లలకోసం తాపత్రయ పడిన ప్రముఖ వ్యక్తులలో శంకర్ కూడా ఒకరు. కే.శంకర్ పిళ్ళై (1902–1989) మనకు ఒక కార్టూనిస్ట్ గానే పరిచయం. కాని ఆయన పిల్లల కోసం అనేక కార్యక్రమాలను



నిర్వహించారు. పిల్లలకోసం బొమ్మల ప్రదర్శన ఏర్పాటుచేశారు. పిల్లల కోసం అంతర్జాతీయ స్థాయిలో చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. అంతటితో తృప్తి చెందక భారతదేశంలో పిల్లల కథల పుస్తకాలకు బాగా కొరత ఉందని గ్రహించారు. ఆ కొరత తీర్చడానికి 1957లో "చిల్డ్రన్ బుక్ ట్రస్ట్' (CBT) ని స్థాపించారు. కథల కోసం దేశంలోని రచయితలను కథలను రాయమని ఆహ్వానించారు. అయితే ఆశించిన స్థాయిలో కథలు లేకపోవడంతో తనే స్వయంగా కొన్ని పిల్లల కథలను రాసి ప్రచురించారు. పిల్లలకోసం ప్రత్యేకంగా ఏర్పడిన ఒక ప్రచురణ సంస్థ భారతదేశంలో "చిల్డ్రన్ బుక్ ట్రస్ట్' మొదటిది. ప్రతీ సంవత్సరం పిల్లల కథల పోటీలను ఆహ్వానించి, వాటిల్లో ఉత్తమమైన వాటిని ప్రచురించే వారు, రచయితలకు, చిత్రకారుడికి బహుమతులను ఇచ్చెవారు. ఇప్పటికి "చిల్డ్రన్ బుక్ ట్రస్ట్' అతి నాణ్యమైన పిల్లల పుస్తకాలను అందిస్తోంది. కథలు, శైలి, బొమ్మలు, కవర్ పేజి, పుస్తకం సైజు, పేపర్ ఇలా ఏ విషయం తీసుకొన్నా అత్యంత ప్రమాణాలు కల్గిన పుస్తకాలను ప్రచురిస్తోంది. ఇప్పటికి అదే స్థాయిలో పిల్లల కథల పుస్తకాలను ప్రచురిస్తోంది. అనేక ముఖ్యమైన భారతీయ భాషలలోకి ఈ కథలను అనువదించి ప్రచురించారు. ఇక్కడ మనం గమనించినట్లైతే అనువాదాలు కూడా ప్రామాణికంగా ఉన్నాయని చెప్పాలి. తెలుగులో అనేక కథలను అనువదించి ప్రచురించారు. తల్లిదండ్రులుగాని, ఉపాధ్యాయుడుగాని సి.బి.టి. వారి పిల్లల బొమ్మల కథల పుస్తకాలను

ఎటువంటి సందేహం లేకుండా కొనవచ్చు. ఈ పిల్లల కథల పుస్తకాల ధరలు కూడా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటాయి.

అ తరువాత పిల్లల పుస్తకాల ప్రచురణ కోసం స్థాపించబడ్డ ప్రభుత్వ రంగ సంస్థ "నేషనల్ బుక్ ట్రస్ట్." ఈ సంస్థ కూడా అనేక భారతీయ భాషలలో కథలను, బొమ్మల కథా రచనలను ప్రచురిస్తున్నది. ఈ రెండు పుస్తక సంస్థల వాళ్ళు తెలుగులో, ఇతర భాషలో 10 సం. లోపు పిల్లలకు కావాల్సిన బొమ్మల కథాపుస్తకాల (Picture Story Books) కొరత తీర్చారని చెప్పాలి. ప్రతీ సంవత్సరం కొత్త ప్రచురణలను, వైవిధ్యమైన కథా రూపాలను పిల్లలకు పరిచయం చేస్తున్నాయి. "నేషనల్ బుక్ ట్రస్ట్." అనేక విదేశీ కథలను తెలుగులోనూ, ఇతర భారతీయ బాషలలోను అనువదించి ప్రచురిస్తున్నది. ఈ రెండూ సంస్థలు అందించే పుస్తకాలు చాలా తక్కువ ధరలలో అందించబడుతున్నాయి. వీటి స్ఫూర్తితో తూలికా (Tulika), కారాడి టేల్స్ (Karadi Tales), తార(Taara), కథా (Katha) లాంటి కొన్ని సంస్థలు బొమ్మల కథా పుస్తకాలను వివిధ భారతీయ భాషలలో ప్రచురిస్తున్నాయి. ఈ సందర్భంగా మనం 'ప్రథమ్' సంస్థ గురించి చెప్పుకోవాలి. పిల్లలలో చదివే అలవాటును పెంపొందించడానికి కొన్ని వందల పుస్తకాలను ప్రచురించి, పిల్లలు పుస్తకాలను చదవడానికి ప్రోత్సహిస్తున్న సంస్థ. ఈ సంస్థ 'స్టోరీ వీవర్' (Story Weaver) పేరుతో నెట్లో ఒక వెబ్సైటును స్థాపించింది. దీనిలో పిల్లలు హిందీ, ఇంగ్లీషు, తెలుగులో కొన్ని వందల కథలను ఉచితంగా చదువుకోవచ్చు. వాటిని ఉచితంగా డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఇంకెవరైనా ఆ పుస్తకాలను ఇష్టపడి పిల్లలకు అందించాలని కోరుకొంటే వాటిని ప్రచురించుకోవచ్చు. మన తెలుగులో కేవలం పిల్లల పుస్తకాలను ప్రచురిస్తున్న సంస్థ "మంచిపుస్తకం" (Manchi Pusthakam).

ఇలా మన బాలసాహిత్యంలో ముఖ్యంగా కథల విషయంలో వచ్చిన మార్పులను మనం గుర్తించవచ్చు. ముఖ్యంగా 20-21వ శతాబ్దంలో భారతీయ బాలసాహిత్యంలో పెను మార్పులు సంభవించాయని మనకు స్పష్టంగా తెలుస్తున్నది. అయితే ఇక్కడ మనకు నీరసపరిచే అంశం ఏమిటంటే తెలుగు బాలసాహిత్యం మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడనే ఉన్న చందాన ఉన్నదని చెప్పక తప్పదు. దానికి కారణాలు చాలా ఉండవచ్చు. రచయితల దృక్పథంలో మార్పు రానంతవరకు, మన తెలుగు బాల సాహిత్యంలో మార్పులు సంభవించడం అసాధ్యమనిపిస్తుంది.

-వ్యాస రచయిత బాలసాహితీవేత్త

36వ పుట తరువాయి

# శిమాంట శిమాంట...

జెల్లి కానియ్యింంండ్రి, మంగురు మంగురు జెయ్యకు, కయ్య కయ్య ఒర్రకు, పానం పానమోలె సూసుకున్నడు, నివాలు నివాలు జోకవట్టివి, నిగ నిగ ఉన్నది, నిక్కి నిక్కి సూత్తండ్రు, కొట్ట కొట్ట వచ్చిండ్రు, వల్ల వల్ల ఏడ్సిండ్రు, బోడ బోడ కొలిసిండ్రు, బర్సులు బర్సులు ఉన్నది, లేసుడు లేసుడు ఏం పని, పట్టి పట్టి సూత్తన్నవు, కోసి కోసి/ చేసి చేసి/ చూసి చూసి/ లేసి లేసి, రాసి రాసి/ మోసి మోసి/ పోయి పోయి, పుందు పుందు ఐంది, దుల్లు దుల్లు చేసింండ్రు, దుబ్బ దుబ్బ ఉన్నది, కనరు కనరు ఉన్నది, గప్పు గప్పు గుద్దిండు, కసరు కసరు అత్తంది, పరం పరం ఐంది, లేని లేని ముచ్చట్లు, బిత్తిరి బిత్తిరి మాట్లాడకు, నోట్లే నోట్లే అనుకొంండ్రి, ఉత్తుత్తగ మీదికి రాకు, పుల్లలు పుల్లలు ఐంది, సప్ప సప్పగ/ ఉచ్చు ఉచ్చు, కనరు కనరు ఉన్నది, ఎగ్గిలెగ్గిలి చెయ్యకు, ఉరుకురికి పోవడ్తిరి, పదుడు పదుడు బండ మీద వడ్డడు, పస్స పస్స నములకు, తుక్కు తుక్కు గొట్టింండ్రు, తంతె తంతెకు కొబ్బరి కాయ గొట్టుడు, తుక తుక ఉడుకుతంది, గడి గడికి రాకు, గావర గావర ఐతంది, జెప్ప జెప్ప తినుండ్రి , టక టక కానియ్యింండ్రి, తిప్పి తిప్పి కొడితే అడ్డెదు గావు, బెగ్గడి బెగ్గడి ఉన్నది, బుర్ర బుర్ర పండింది, బుస బుస పొంగింది, బుర్ర బుర్ర వోవడితివి, సిల్ల సిల్ల వోసింది, బందు బందు దిట్టిండు, బెండు బెండున్నది, బిర బిర పోవడితివి, మీది మీదికి రావడితివి, చెయ్యంగ చెయ్యంగ వస్తది, రాంగ రాంగనే ఏడ వోయింండ్రు, కిరి కిరి జెయ్యకు, ఉరికురికి పోతె ఏమైంది, లగ్గకు లగ్గ ఉన్నది, పుస పుస పోకు, బరిగె బరిగె అయింది, వక్కడ వక్కడ నవ్వింది, సప్ప సప్ప నాలుగు సరిసిండు, పానం సవ సవ అంటుంది, కండ్లు మసక మసక కనిపిస్తున్నయి, ఉడుకుడుకు బువ్వ, మీది మీది మాటలు, సోర సోర పోరగాండ్లు వంటి అనంతమైన పద బంధాలు తెలంగాణ తెలుగుల ఇప్పటికి వాడకంల ఉన్నయి.

ఇంత పద సంపద కలిగిన తెలంగాణ తెలుగు భాషను కాపాడుకొని ముందటి తరాలకు అందియ్యాలె.

-వ్యాస రచయిత తెలుగు సహాయచార్యులు
ప్రభుత్వ స్నాతక కళాశాల, హుస్నాబాద్, సిద్దిపేట,తెలంగాణ.




**హరిత నానీలు**
రచయిత:**బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి**
పుటలు:47 వెల:రూ.60
ప్రతులకు: బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి
వేణుగోపాలస్వామి గుడి ఎదురు,
ఆత్మకూరు(పో), మంగళగిరి(మం)
గుంటూరు జిల్లా




**కొల్లేరు ప్రజల గుండె చప్పుడు**
రచయిత:చింతపల్లి వెంకటనారాయణ
పుటలు:76 వెల: అమూల్యం
ప్రతులకు:చింతపల్లి వెంకటనారాయణ
ప్లాట్నెం. 131/ఎ, శాంతినిలయం,
యన్.జి.ఓ.కాలనీ, కైకలూరు
సెల్: 9441091692

పి.శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

'సుసంపన్నము బహువిధమైన వారసత్వ సంపద' .

దేశమంతా ఒకే పద్ధతి కిందకి తేవాలని తీవ్ర స్థాయిలో పట్టుపడుతున్న ఈ తరుణంలో

# 'ఇతిహాసపుటట్టడుగున పడిఉన్న ఈ కథలన్నీ కావాలిప్పుడు'

**ఛ**ప్పన్నారు దేశాలు-వీటిలో రాజ్యాలు గణరాజ్యాలు, జానపదాలు; మధ్యలో ఏకచ్ఛత్రాధిపత్యంకోసం పెనుగులాటలు; అందుకోసం యజ్ఞ యాగాలు; సంస్కృతీకరణాలు, పాలకవర్గంలోకి ఆరోహణలు, అవరోహణలు; భాషలో సంస్కృతం, తత్సమం, తద్భవం, దేశ్యం; మళ్లీ దాంట్లో శిష్టం, పామరం/గ్రామ్యం కర్మకాండలో కూడా వేదోక్తం, పురాణ, ఉపపురాణోక్తం, కులపురాణం; ఆగమం- దేశి తర తమ భేదాలు; వ్యవసాయంమీద ఆధారపడిన కుడి కులాలు; నగరాలమీద ఆధారపడిన అష్టాదశ వృత్తులు, చతుష్షష్టి కళలు- ఎడమకులాలకు చెందినవి కాగా,ఇక శ్రామిక జనం ఆటవికులు, అంటరానివారు- వీళ్ళమధ్య అనులోమ విలోమ సంబంధాలు; అష్టవిధవివాహాలు; ఉమ్మడి వనరులు, పిత్రు, మాతృ- స్వామ్యాలు; సంస్కృతీ, పాశ్చాత్యీకరణలు. రాజాశ్రయం కోసం శిష్టుల తాపత్రయాలు, అభివృద్ధి పాచికలు, జానపదుల గిరిజనుల ధిక్కారాలు, నోటితో మెచ్చుకుంటూ, నొసలుతో వెక్కిరించటాలు; ఇన్ని కుదుపులు తట్టుకోలేని పుడమి తల్లి హాహాకారాలు; వేలయేళ్ళుగా జరుగుతున్న ఈ మధనంనుండి పాఠాలు నేర్చుకోటంలో విఫలమౌతున్న దురహంకారాలమీద సవాళ్ళు. దేశమంతా ఒకే పద్ధతి కిందకి తేవాలని తీవ్ర స్థాయిలో పట్టుపడుతున్నఈ తరుణంలో **'ఇతిహాసపుటట్టడుగున పడివున్న ఈ కథలన్నీ కావాలిప్పుడు'.**

తెల్లవాళ్ళు బెంగాల్‌లో పాలన చేపట్టినప్పుడు అక్కడ ఆస్తి వారసత్వాన్ని నిర్దేశించే మితాక్షర దాయభాగ పద్ధతులు గమనించారు. కాని పంజాబులో అప్పటికి, కుటుంబాలు వాళ్ళ ఆస్తులు, చుట్టుపక్కల ఉమ్మడి వనరుల మీద బతుకుతెరువులు , సరిహద్దులగుండా రాకపోకలు, రవాణాలు; ఇవన్నీ కట్టుబాట్ల ప్రకారం నోటిమాటమీదే నడుస్తుండేవి. దేశ వ్యాప్తంగా వాడుకలో ఉన్న ఇటువంటి వైవిధ్య భరితమైన జీవన విధానాలు, ఆధిపత్య పోకడలమీద బహుముఖాలుగా సాగిన తిరుగుబాట్లు, వాటిని ప్రేరేపించిన పరిస్థితులు, అవి ప్రచారంలోకి తెచ్చిన భావజాలాలతో చరిత్రవేత్త రొమీలా థాపర్ షష్టిపూర్తి సందర్భంగా, వెలువరించిన వ్యాససంకలనం "Tradition, dissent & ideology"( Oxford 2001) .




వీటిలో పైన పేర్కొన్నట్లు పంజాబ్‌లో పరిస్థితులను గ్రంధస్తం చేయటానికి జరిగిన కృషిని వివరించే వ్యాసం 'Remaking the custom' , ఇప్పుడు అమలు జరుగుతున్న 'పోడుపట్టాలు'ఇచ్చే అటవీ హక్కుల గుర్తింపు కోసం జరుగుతున్న, జరగవలసిన చర్చలను గుర్తుచేస్తాయి.

'Punjab officials saw custom embedded in practice rather than in ancient texts.

Hindu law extravagantly exalts the Brahmins. It gives its principles from caste rather than clan; it sees caste not tribe as the natural order of society.

Custom has to be preserved. The forces leading to disintegration of custom had to be resisted. It is the duty of government to improve native institutions as to uphold them. It is possible to domesticate primitive law; you can redeem it, without killing it down.

Custom has to be presented and codified as it was, not as it ought to be.

The better the people are understood, the better will they be governed.

The function of the state was to make the natives aware of the inner coherence and underlying principles of their practices.

The clan originates in tribe, the village in the clan and the joint family in the village.

The perceived coherence of customary law was thus pre given.

Standing amongst the ruins of tradition, the noble English man had to salvage the past

A custom, as long as it existed, as long as the memory of the tribe extends, the memory at least of its oldest members

There were however limits to the reach of the state.

In courts the claims of lower castes and nonagricultural communities to property rights were denied.

హిందూ మతం /ధర్మం బ్రాహ్మణులకు, వారు వల్లించే గ్రంధాలకు చాలా విలువ ఇస్తుంది. వాళ్ళు కుల వ్యవస్థకు తప్ప, కట్టుబాట్లు పాటించే ఆ చట్రానికి బయట ఉన్న జాతులు తెగలను గుర్తించరు. కాబట్టి కట్టుబాట్లను నిర్లక్ష్యం

చేసే పోకడలను ప్రభుత్వం అదుపు చేయాలి. కట్టుబాట్లలో దాగివున్న ఉన్న ఔచిత్యం ప్రభుత్వం గ్రహించాలి.

సరిగ్గా ఇదే స్ఫూర్తితో న్యాయమూర్తి రామలింగేశ్వరరావు, అటవీ హక్కుల గుర్తింపు చట్టం, గుర్తించటంకోసం ప్రభుత్వమే వాళ్ళ దగ్గరకు పోవాలి కాని, శ్రీ శంకరన్ నాయకత్వంలో రూపొందించిన రూల్స్‌లో, గుర్తింపుకోసం దరఖాస్తు చేసుకోమని ఆదేశించటం చట్టం స్ఫూర్తికి విరుద్ధమని, అప్పట్లో న్యాయవాదిగా, ( రిట్ పిటిషన్ 1625/ 2010 ) దాఖలు చేసారు... శంకరన్ కమిటీలో సభ్యురాలు, బస్తర్‌లో ఆదివాసీ హక్కుల కోసం పనిచేసిన ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఆచార్యురాలు నందినీ సుందర్, ఇప్పటికీ చురుకుగా పనిచేస్తున్న రోమేలా థాపర్ ఈ చట్టం మీద చర్చ లేవనెత్తలేదు. ఇక కోర్టులో ఒంటరి పోరాటం. బయట చర్చ జరుగుతుంటే గాని కోర్టులో ప్రతిధ్వనించదు! అందరూ శ్రీవైష్ణవులే-మరి రొయ్యలబుట్ట ఏమైందో ?

ప్రతిదానికీ కాగితంలో ఆధారం, రికార్డు కావాలని, రాతలో పెట్టిందే సాహిత్యం అని పుస్తకాల పండుగలు చేసుకునే మేధావులు 'ఆలోచన అనుభవం అచ్చు పుస్తకం', ఆంధ్రజ్యోతి 22 డిసెంబర్ 2022) డిజిటల్ మజిలీ, ఆలోచనను బలహీనపరుస్తుందని ఆందోళన పడుతున్నారు. ఇవేళ పెట్టుబడి దారీ వ్యవస్థ డిజిటల్ యుగాన్ని వేగిరపరుస్తున్నట్లే , నాడు పారిశ్రామిక విప్లవం వెల్లువలో వచ్చిన అచ్చు 'పుస్తకం' గాళ్ళు, అక్షరం తెలియని వాళ్ళను పక్కన పెట్టారు. అభ్యుదయవాదులుగా చలామణీ అయ్యే వీళ్ళు నేటికీ ఆవైపు దృష్టిపెట్టటం లేదు. ఇప్పుడు వీళ్ళ వంతు వచ్చింది. అప్పుడుకూడా ఏ పుస్తకం? వేదమా / పురాణమా అని వీళ్ళలో వీళ్ళు కొట్టుకుచచ్చారు.

జందేలు వేసుకున్నవాళ్ళకే వేదవిహితమైన కర్మకాండ చేసే అర్హత అని కట్టడి చేస్తే, 'ద్వితీయ శ్రేణి పౌరుల వలె పురాణోక్త సంప్రదాయాలతో సరిపెట్టుకోవసిన వైశ్య వర్గానికి చెందిన, (తెలుగు భాషకు వ్యాకరణాలలో ఒకటి ఆంధ్ర దీపిక రాసిన) అందుగుల వెంకయ్య' బ్రాహ్మణుల గుత్తాధిపత్యంలోని పౌరోహిత్యంలోని వైదిక కర్మకాండ నిర్వహణానికి పురోహిత పాత్రవహించటం తీవ్ర పరిణామాలకు దారి తీసింది'.('వలస వాదం, ప్రాచ్య వాదం, ద్రావిడ భాషలు'కే వెంకటేశ్వర్లు ఎమెస్కో పుట 223) .

ఇక మన Tradition dissent & ideology పుస్తకంలో 1890లలో వచ్చిన మలయాళంలో తొలినవల 'ఇందులేఖ' నాయర్ నంబూద్రి సంబంధాలను చర్చించింది. నాయర్లది మాతృస్వామ్యం. నంబూద్రిలు వారి స్త్రీ గణానికి యజమానులు. కథానాయకి ఇందులేఖ చదువుకున్న నాయర్. చదువుకుంటే, ఆమె నంబూద్రి సంబంధాలకు ఒప్పుకోదని, ఇంటివారు చదువుకు ఒప్పుకోరు. ఒక వెకిలి నంబూద్రి ఆమెను వశం చేసుకోవాలని చూస్తుంటాడు. ఆమెతో పాటు చదువుకుంటున్న మాధవన్‌ను ఇష్టపడుతుంది. ఇద్దరి మధ్య నాయర్ స్త్రీల నిబద్ధత మీద జరిగే చర్చల్లో, ఇందులేఖ ఆ వ్యవస్థలో స్త్రీ కిగల స్వతంత్రం చదువుతో బలపడుతుందని వాదిస్తుంది. 'ఆడ మలయాళం' ప్రసిద్ధమైన సామెత. ఈ నవలా రచయిత జడ్జి. ఈ విషయం మీద వేసిన కమిటీలో సభ్యుడుగా ఇందులేఖ వలెనే సలహా ఇస్తాడు. కాని నాడు ప్రభుత్వం ఈ మాతృస్వామ్య వ్యవస్థ రద్దు చేసింది. శంకరాచార్యులు ఇటువంటి ఆచారాలు పాటించే నంబూద్రికుటుంబం నుంచి వచ్చాడని ఉత్తరాది వాళ్ళకు తెలియదని రాహుల్ సాంకృత్యాయన్ ఒకచోట చురక వేస్తాడు. అటువంటి feminism కావాలని, ప్రకృతిలో సంతులనం స్త్రీల సారధ్యంలోనే




సాధ్యపడుతుందనే వాదం బలపడుతుంది.

ఇక మన తెలుగు విషయానికొస్తే 'గ్రామ్య పదాలను ఒక ప్రత్యేక వర్గంగా చెప్పటం తెలుగు వ్యాకర్తలు ప్రవేశపెట్టినదే. వ్యాకరణ శాస్త్రంలో పదవర్గీకరణ ప్రణాళికలో కాని సంస్కృత ప్రాకృతాలలోగాని ఇది కనిపించదు. తెలుగు వ్యాకరణ సంప్రదాయంలో గ్రామ్యం గ్రామీణ ప్రజల వ్యవహారం నిరంతర సృజన పరిణామం వికాసం చెందగలిగిన సామర్థ్యం ఉన్న సజీవ భాష గ్రామ్యం దేశ్యంలో భాగమే' (వలసవాదం ప్రాచ్యవాదం ద్రావిడ భాషలు. పుట 178) నని కేతన నుండి అప్పకవి దాకా నొక్కి చెప్పారు. కాని క్రమంగా శిష్ట ప్రామాణిక భాష ఈ గ్రామ్యాన్ని పక్కకు నెట్టింది. తెలుగు వ్యక్తిత్వం మీద చావు దెబ్బతీసింది.' వెన్నెముకలేని మధ్యతరగతి సాహిత్యంలోకి ప్రవేశించింది'( సాహిత్యంలో వస్తు శిల్పాలు. త్రిపురనేని మధుసూదన రావు పుట 117) .పుస్తకాలసంతలతో పాటు, పుస్తకాలలో గల,పుస్తకాలలోకి ఎక్కని దేశియ వారసత్వ సంపదను గుర్తు చేస్తూ, పోటీ సంతలు నిర్వహించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అ

"అమ్మా! నీ భాష కావాలి నిప్పులు చెరగటానికి చెమటను జల్లెడపట్టి సంపదలను తీయటానికి తెలుగు పౌరుషాగ్ని రాజెయ్యడానికి మాతృభాష కావాలి" **-ఛాయరాజ్** ('మాతృభాష'- కవిత)

ధారావాహిక

# అడుగుజాడలు - ఆనవాళ్లు

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

(20)

# నా కొలకలూరు, నందివెలుగు యాత్ర

*అడుగుజాలు - ఆనవాళ్లు శీర్షిక కింద 2022 జూన్ సంచిక వరకు 19 వ్యాసాలను ప్రచురించాము. ఆ తరువాత డిసెంబరు వరకు ఈ శీర్షికలో ఏమీ ప్రచురణ కాలేదు. మరలా ఈ నెల నుండి ఈ వ్యాసాలు ధారావాహికంగా వెలువడతాయి. గమనించ ప్రార్థన. - సం॥*

**మ**నుపటి గుంటూరు, ప్రస్తుత బాపట్ల జిల్లా, మోదుకూరుకు సమీపంలోని తొట్టెంపూడి గ్రామానికి చెందిన యువ పరిశోధకుడు పాములపాటి శ్రీనాథరెడ్డి ఒకనాడు నాకు ఫోను చేశాడు. తెనాలి పక్కనే ఉన్న కొలకలూరులో పాత ఆలయాలు ఊడదీసి, ద్వారబంధాలు, శిల్పాలను రోడ్డు పక్కన పడేశారు, ఒకసారి మీరు చూస్తారా అని అడిగాడు. సరేనన్నాను గాని కొలకలూరు వెళ్లలేకపోయాను. ఇటీవల మళ్లీ ఫోను చేశాడు. ఇక లాభంలేదనుకొని 2022 అక్టోబరు 31వ తేదీన ఉదయాన్నే విజయవాడ నుండి బయలుదేరాను. కఠెవరం గ్రామానికి చెందిన కడియాల వెంకటేశ్వరరావును నా కారులో ఎక్కించుకొని కొలకలూరు చేరుకొన్నాం. ఎవర్నీ అడగకుండా, గ్రామంలోని ప్రధాన వీధి వెంట వెళుతుంటే కొత్తగా కట్టిన అగస్త్యేశ్వర స్వామి, కొంతవరకు బాగు చేసిన కేశవస్వామి దేవాలయాలు కనిపించాయి. ఉదయం 7.00 గంటలైంది. అందరూ అరుగులమీద కూర్చుని పేపర్లు చదువుతూ ముచ్చటించుకొంటూ ఉన్నారు.

ముందుగా అగస్త్యేశ్వరస్వామి దేవాలయం దగ్గరున్న ఎత్తాటి కొయ్యరథం, రథశాల నన్ను ఆకర్షించాయి. ఆలయం లోపలనున్న రథశాలలోకెళ్లి, రథాన్ని పరిశీలించాను. చక్కటి రథం. శిల్పశాస్త్రానుసరించి ఒక ఆలయం మాదిరిగా కొయ్య శిల్పులు అందంగా తీర్చిదిద్దారు. కనీసం 200 సం॥ల నాటిది. ఎత్తైన చక్రాలు, పొడవాటి ఇరుసులు, దేవుని ఉత్సవ విగ్రహాలను అమర్చటానికి ఏర్పాట్లు, బ్రహ్మోత్సవాల సందర్భంగా లాగటానికి లావాటి మోకులు, ఆపటానికి బ్రేకులు, రథనిర్మాణశాస్త్ర నిపుణుల పనితనానికి అద్దంపడుతున్నాయి. చుట్టూ కలయతిరిగిన నాకు, 'అగస్త్యేశ్వర రథశాలకు గద్దెవారు, తెలుగువారు ఇటుకకు ధర్మం రూ. 500.00 కొలకలూరు, 17.2.49(1949)' అని రాసిన బోర్డు కనిపించింది. 73 ఏళ్ల క్రితం కమ్మవారు, తెలగవారు(కాపులు) కలిపి రథశాలను నిర్మించారని తెలిసి, కులాల మధ్య గల సఖ్యత, అలనాటి జ్ఞాపకంగా మిగిలిపోయిందే అనుకొన్నాను.



ఆలయం ప్రవేశ ద్వారం ముందు మునుపటి ఆలయాన్ని ఊడదీసి, కాకతీయుల కాలపు ఎర్ర ఇసుకరాయి (ఖచ్చితంగా వేజళ్ల క్వారీనుంచి తెచ్చిందే) తో అందంగా చెక్కిన ద్వారశాఖ, దానిపైన సారువాకు వాడిన సరివి కట్టెలు కనిపించాయి. కొత్త ఆలయాన్ని కట్టడంలో ఉన్న శ్రద్ధ, పురాతన కళాఖండాలను భద్రపరచుకోవాలన్న విషయంలో లేదే అన్న బాధకలిగింది. అంతేకాదు, లక్ష్యంతో పాటే, నిర్లక్ష్యం కూడా పుట్టిందేమోనని కూడా అనిపించింది.

రథశాల దాటి దాని కుడి వైపున ఒక అరుగు, దాని మీద ఒక అస్పష్ట శాసనం కనిపించాయి. పరిక్షించి చూస్తే క్రీ.శ.1202 వ సం॥లో అగస్త్యేశ్వర మహాదేవుని సానిమాన్యనిబంధనకు అమరినాయుడు, రెండు పుట్ల భూమిని దానం చేసిన వివరాలు తెలిశాయి. ఆలయవ్యవస్థలో స్వామి వారికి అంగ, రంగ వైభవాలు జరుపుతారు. స్వామి వారిని అంకరించి అర్చనలు చేయటాన్ని అంగభోగమని, స్వామి వారిని నృత్య, గీతాలతో సేవించటాన్ని రంగభోగమనీ అంటారు. అంగరంగ భోగంగా వెలుగొందిందన్న మాట అలా పుట్టుకొచ్చిందే.



ఆ శాసనం క్రీ.శ.1202 నాటిది. అప్పుడు కాకతీయ చక్రవర్తి గణపతిదేవుడు కొత్తగా రాజ్యాన్ని ఏలుతున్నాడు. ఆయనకు ఈ ప్రాంతంలో చందోలు(సనదుప్రోలు) రాజధానిగా పాలిస్తున్న వెలనాటి పృధ్వీశ్వరుడు(క్రీ.శ.1186-1210) సామంత మాండలికునిగా పాలిస్తున్నాడు. ఈ శాసనంలో స్థానికుడైన ఒక అమరినాయుడు, ఆలయంలో నృత్య భోగాన్ని సమర్పించే సానుల కోసం (గుడి సాని

అనే పదం ఇలాపుట్టిందే) రెండు పూట్ల భూమిని దానం చేసినట్లు చెప్పబడింది. ఇప్పుడు కొలకలూరులో సానులూలేరు, వారి మాన్యాలూ లేవు. కేవలం రాతి శాసనంలో మాత్రమే ఆ రెండు పదాలూ కనిపిస్తాయి.

కొంచెముందు కెళ్లితే, చక్కటి కాకతీయ ఆలయ వాస్తుకు అద్దంపడుతున్న పైద్వార శాఖ (పతంగం) బజారులో ఒక గోడ పక్కగా పడేసి ఉంది. నిర్లక్ష్యానికి నిదర్శనంగా వారసత్వ సంపదపట్ల ఏమాత్రం అవగాహన లేదన్నట్లుగా ఉంది. ఆ గోడలోపలి వైపు వున్న ఆలయ స్థంభాలను ఒకదానిపై ఒకటి పడుకోబెట్టి కనిపించాయి. నేనూ, వెంకటేశ్వరరావు వాటిని నిశితంగా పరిశీలిస్తున్నా, దూరంగా గ్రామస్తులు గుసగులాడుతున్నారే గానీ, ఒక్కరూ మా దగ్గరకు రాలేదు. ఇదీ చరిత్రపట్ల ఈ తరానికున్న (లేని) ఆసక్తి.

అక్కడే పడేసిన మరో స్థంభం పైన క్రీ.శ. 1241 నాటి శాసనంలో, చందోలు పాలకుడైన కులోత్తుంగచోడుని సామంతుడైన కొండపడుమటి బేతరాజు సేవకుడైన రెంటూరి ఎక్కిటి కొలకలూరి అగస్త్యేశ్వరుని దేవాలయంలో రెండు అఖండ దీపాలు ఎప్పుడూ వెలగటానికి, 50 మోదా(ఆవు)లను దానం చేసి, వాటిని ఒడ్యబోయుని కొడుకులు మారబోయుడు, కొమ్మినబోయుడు, ఇద్దరూ, ఆ ఆవుల పాలుపిండి, పెరుగు చేసి, చిలికి, రోజు 7 మానికెల నేయిని సమర్పించే ఏర్పాటు చేశాడు. దానం చేసింది రెంటూరి ఎక్కటి. ఎక్కటి అంటే సైనికుడు. అతడు బాపట్ల పక్కనే ఉన్న రెంటూరుకు చెందిన వాడుగానీ, అక్కడనుంచి వచ్చి, కొంతకాలం కొలకలూరులో స్థిరపడిన వాడుగానీ అయిఉండొచ్చు.

అగస్త్యేశ్వరాలయం ముందే ఉన్న మరో శాసనంలో, క్రీ.శ. 1308లో, కాకతీయుల ప్రతాపరుద్రుని కొలువులో, ఆయన సకల సేనాధిపతిగా ఉన్న సోమయ లెంకంగారి కొడుకు పోచులెంక గారు అగస్త్యేశ్వరుని సోమవార నిబంధన పళ్లానికి 8 తూములు, వీరభద్రునికి 8 తూముల భూమిని దానం చేసిన వివరాలున్నాయి. ఆసక్తికరమైన విషయమేమంటే, కాకతీయ ప్రతాపరుద్రుని సర్వసేనాధిపతి పోచులెంక, కొలకలూరుకి చెందినవాడుగావటం, లెంక అంటే చక్రవర్తికి అంగరక్షకునిగానే కాక, ఆయన భద్రతకు సంబంధించి అన్నీ వ్యవహారాలూ చూచుకొకే ఒక నమ్మకమైన అధికారి. కాకతీయుల కొలువులో ఇలా నమ్మకస్తులైన, ప్రాణానికి ప్రాణం పణంగా పెట్టే లెంకలు చాలా మంది ఉన్నారు. వారిలో జుట్టయలెంక ఒకరు.

ఇక అగస్త్యేశ్వరాలయం పూర్తిగా రూపురేఖలు కోల్పోయింది. రాతి కట్టడం స్థానంలో కళతప్పిన సిమెంటు గోడలు, స్థంభాలు రాజ్యమేలుతున్నాయి. ముందు ఒక చక్కటి నంది, పక్కనే నాగేంద్రుడు. ప్రదక్షణం చేస్తుండగా వెనుక వైపు పానవట్టం, శివలింగం విచిత్ర నాట్యభంగిమలో ఉన్న శిల్పం, ముఖలింగం; భద్రకాళి, శిల్పాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్నాయి. విగ్రహాలు, శాసనాల దగ్గర పరిశీలిస్తున్న మమ్మల్ని కార్తీక దీపారాధన చేస్తున్న స్త్రీలు వింతగా



చూస్తున్నారు. పూజారులు కూడా అంతే. ఒక్కరు కూడా మీరు ఎవరు అని అడిగిన పాపాన పోలేదు. శిథిల శిల్పాలు, ఆలయ విడిభాగాల దీన స్థితిని చూచి బాధ పడటం కంటే ఏమీ చెయలేక శివునికి, నందికీ శిల్పాలకు, ఆ ఆలయం ఆ పేరును దక్కించుకోవడానికి కారకుడైన అగస్త్య మహామునికి శాసనాల్లో పేర్కొన్న అమరినాయుడు, రెంటూరి ఎక్కటి, పోచులెంకలకు నమస్కరించి బయటికి నడిచాం.

కొలకలూరులోనే కొంచెం దూరంలో ఉన్న కేశవస్వామి





దేవాలయానికికెళ్లాం. గ్రామస్తుల్ని మెచ్చుకోవాలి. ఆలయం ముందు భాగాన్ని మాత్రమే ఊడదీసి, అసలు గుడిని అలానే ఉంచారు. ఆనందంతో లోపలికి అడుగు పెట్టగానే, అక్కడ దేవాదాయశాఖ ఏర్పాటు చేసిన స్థల పురాణ బోర్డును చూచీ చూడంగానే మా ఆనందం పటాపంచలైంది. అందులో అన్నీ తప్పులే. 'కొలకలూరులో 101 కొలనులుండేవని వాటిని పూడ్చి బావిగా ఏర్పడినవి. కాలక్రమేణ ఇది కొలకలూరుగా మారినది. సోమయవెంకం (లెంకం)గారిచే ఆలయం నిర్మింపబడినది. ఈ స్థల నిర్ణయ గ్రామ నిర్ణయింపబడినది. ఈ స్థల నిర్ణయ గ్రామనిర్ణయం మొదలగు వివరములు పాళీ భాషలో విపులీకరంచబడిన శాసనముల ద్వారా తెలియచున్నది. ఇట్లు కార్యనిర్వహణాధికారి' అని ఉంది. శాసనం తెలుగులో ఉంటే పాళీ(పాలీ) భాష అనీ, లెంకంగారుకు వెంకంగారని ఉంది. ఇప్పటివరకూ ఎంతో మంది దేవాదాయశాఖ అధికారులు, ఆలయపూజారులు, గ్రామ పెద్దలూ, ఈ బోర్డును చూస్తూనే ఉన్నారు. కానీ ఒక్కరూ దాన్ని సరిచేద్దామనుకోకపోవటం విడ్డూరమే.

కేశవస్వామి దేవాలయంలోని స్థంభాలు, ద్వారాలు, కప్పు, చక్కటి కాకతీయ వాస్తుశిల్పానికి అద్దంపడుతున్నాయి. ఆలయగోడలకు బిగించిన చెన్నకేశవుడు, సూర్యుడు, దక్షిణ ప్రవేశ ద్వారానికి రెండు వైపులా గల నిలువెత్తు జయ, విజయ ద్వారపాలక శిల్పాలు కనువిందు చేస్తున్నాయి. ఆలయానికి, శిల్పాలకు సున్నం, రంగులు పులిమి ప్రాచీనతకు భంగం కలిగించామన్న స్పృహ, కాపాడాల్సిన దేవాదాయ శాఖ అధికారులకు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించలేదు. ఎందుకంటే ఇలాంటి దృశ్యాలు చూచీ, చూచీ దేవాదాయశాఖ పనితీరు దశాబ్దాలుగా ఇంతేగా అనిపించింది.

కొలకలూరులోని రెండు ఆలయాలను చూచి బరువెక్కిన హృదయంతో , జిల్లాలోనే పేరు మోసిన నందివెలుగులోని నంది విగ్రహాన్ని చూడటానికి బయలుదేరాం. అలా బయలుదేరటానికి ఒక బలమైన కారణముంది. ఆ వూరికి పేరునిల్పిన నందిని, పట్టాభిషేకం జరిగి వెయ్యేళ్లైన రాజరాజనరేంద్రుని శాసనాన్ని చూడాలన్నదే ఆ బలమైన కోరిక. గ్రామంలో మందుగా పేరుగాంచిన మేడ, అదే దారిలో వెళ్లి, ఎడమవైపుకు మళ్లగా కుడివైపున, అప్పేశ్వర స్వామి(శివుని) ఆలయం ఉన్నాయి. కారుదిగీదిగగానే ఎదురుగా మొండి చాముండి, చక్కటి వేంగీ చాళుక్య భైరవ, వీరగల్లులు, ఋషిపుంగవుల శిల్పాలు వళ్లంతా పసుపూ, కుంకుమ బొట్లతో దర్శనమిచ్చాయి. పక్కనే బెంచీ పై కూర్చుని కబుర్లాడుకొంటున్నారు గ్రామస్తులు.



ఆలయంలోకి ప్రవేశించగానే వేంగీచాళుక్య కట్టడ భాగాలు, శిల్పాలు, కిటికీలు, రంగులు పులుము కొన్న అద్భుత ద్వారపాల, నందిశిల్పాలు, కనువిందు చేశాయి. నిర్లక్ష్య వైఖరికి కళ్లలో నీళ్లు తెప్పించాయి. ఏ నంది వల్ల ఆవూరుకు నందివెలుగని పేరొచ్చిందో ఆ నందికి రకరకాల రంగులేసి రూపురేఖల్ని మార్చారు. కొష్టాల్లో ఉన్న నటరాజు, పార్వతి శిల్పాలు అలనాటి చారిత్రక వైభవానికి గుడ్డి గుర్తులైనాయి. నిశితంగా పరిశీలిస్తున్న మమ్మల్ని పూజార్లు విచిత్రంగా చూస్తున్నారు.

ఆలయం పైకప్పుమీదున్న క్రీ.శ 1058 నాటి రాజరాజనరేంద్రుని 37వ పాలనా సం॥పు శాసనాన్ని చూశాను. ప్రస్తుతం శివాలయంగా పిలువడుతున్న ఆ ఆలయం అప్పేశ్వర దేవునిదనీ, అఖండ దీపానికి 50 గొఱ్ఱెలను దానం చేసినట్లు వాటిని రక్షించి, రోజూ మానెడు నెయ్యి పోయాలన్న వివరాలున్నాయి. ఆలయ పూజారులకు, విగ్రహాలకు ఇక నుంచి రంగులు వేయొద్దని చెప్పగా, మా మాట వినేదెవరు బాబూ, అని వారి నుంచి వచ్చిన సమాధానం కూడా నన్ను బాధించింది. ఎవరికీ పట్టని చారిత్రక అవశేషాలకు మొక్కి కారెక్కి విజయవాడ చేరుకొన్నాం. దారి వెంట బకింగ్‌హాం కెనాల్ పక్కనే పచ్చటి పొలాలు, నిరంతరం పారే జలాలు, ఇంకా వినిపిస్తున్న పక్షుల కిలకిల రావాలు,





నోరూరిస్తున్న రేవేంద్రపాడు జిలేబీ గుబాళింపులు ఒక పక్కన నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా, ప్రాచీన కట్టడాలు, శిల్పాలు, శాసనాల నిర్లక్ష్యం నాకు ఊపిరాడకుండా చేస్తున్నాయి మరోపక్క.

అభినందన

# 2022 కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన నవల
# 'మనోధర్మపరాగం'




**2**022వ సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన మధురాంతకం నరేంద్ర నవల 'మనోధర్మపరాగం' భిన్నమైన చారిత్రక నవల. 'చరిత్రతో యిటుకలు తయారు చేసి, యితివృత్తాని కనుగుణంగా యిష్టమొచ్చిన రీతిలో వాటిని తీసుకుని, కల్పన అనే సిమెంటుతో గోడలూ, పై కప్పూ కట్టి, పైన జీవన చలన సూత్రాలనే రంగులుపూసి నిర్మించిన కల్పనా చారిత్రక భవనమీ నవల" అంటారు రచయిత.

నీతీ, నాగరికతా, సంస్కారం అనే పేర్లతో పురాణపురుషుల ప్రేమాయాణాల మాయల్నీ, మహారాజుల అంతఃపురాల్లో జరిగిన జనానాల వేదనల్నీ వీలయినంత గోప్యంగా దాచిపెట్టిన దస్త్రాలు, దేవదాసీల జీవితాల్లోని వుత్థాన పతనాల్ని మాత్రం వేదికలపైకెక్కిచాటేశాయి. సంగీత, నాట్యాలకు మూడునాలుగు దశాబ్దాల కాలం పాటూ ఆలంబనంగా జీవించిన దేవదాసీల జీవితాల్లోని చీకటి వెలుగుల్నీ నవల విప్పి చెప్తుతుంది. యీ నవల్లోని అన్ని పాత్రలకూ చారిత్రక భూమికలున్నాయి గానీ వారు చారిత్రక వ్యక్తులు కారు. ప్రతి కల్పనకూ చారిత్రకమైన ఆధారాలున్నా చరిత్రను కల్పనగా మార్చేయడమూ జరిగింది.

చరిత్ర పట్టించుకోని అనేకమంది స్త్రీలీ నవల్లో తమంతట తాముగా తమ గాధనూ, ఘోషనూ వినిపిస్తారు. రచయిత ఆయా చారిత్రక వ్యక్తుల ఆంతరంగిక ప్రపంచంలోకి తీసుకెళ్తాడు. వాటి కాలానికి చెందిన సామాజిక స్థితుల్ని పరిచయం చేస్తాడు.

దేవదాసీలు ఎంతో సంస్కారవంతంగా, గొప్ప అభిరుచితో జీవించారనే చారిత్రక వాస్తవాన్ని శక్తివంతంగా, పాత్రల హుందాతనం తగ్గకుండా రచయిత చిత్రించారు. దాదాపు 130 సంవత్సరాల దక్షిణభారతదేశ దేవదాసీ వ్యవస్థ పూర్వాపరాలనూ, ఆ వ్యవస్థలోంచీ వచ్చిన కొందరు ప్రముఖ స్త్రీల జీవితాలనూ కల్పనాత్మకంగా చిత్రించిన నవలయిది. సామాజిక, చారిత్రిక విషయాల గురించి అవసరమైనంత మాత్రమే ప్రస్తావిస్తూ, వాటితో సంఘర్షించి వ్యక్తుల జీవితాల్ని పరిచయం చేసిన నవల.

ఆధునికానంతర వాద నవలల్లాగే యీ నవలలో బహుధ్వనిత్వం (Polyphony)ని రచయిత సమర్థవంతంగా నిర్వహించాడు. చరిత్రలో నిర్దుష్టంగా చెప్పడానికి సాధ్యంగాని విషయాలను పాత్రల కథనాల ద్వారా రచయిత శక్తివంతంగా చెప్పించగలిగాడు.

"ఈ నవలలో చారిత్రక అంశాలకు వైయక్తికమైన అంశాలను జతచసి చెప్పాడు రచయిత. అనేక మంది దేవదాసీలు ఆవిష్కరించిన వైయక్తిక అనుభవాలలో చారిత్రక అంశాలను కూడా చూపాడు. అలాగే ఆయా సందర్భాలలో వున్న రాజకీయ, నైతిక ప్రతిమానాలు (Paradigms) గూడా బహిర్గతం అయ్యాయి. ఈ రచయిత ఈ నవలలో చాలా సమర్థవంతంగా చారిత్రకవైయక్తిక ఆంశాలను సమ్మిళితం చేసి చిత్రించాడు... చారిత్రక నవలకు చరిత్రలో ఒక నిర్దిష్టకాలం భూమికగా వుంటుంది. రచయిత ఆ కాలపు చేతనలు, పద్ధతులు, సామాజిక స్థితిగతునల్ని సాధికారంగా చిత్రించాలి. ఈ విషయంలో నరేంద్ర విజయవంతమయ్యారు. ఈ నవలకున్న Epic లక్షణాల్ని ఎవరయినా అంగీకరిస్తారు" అని ప్రముఖ విమర్శకులు బి. తిరుపతిరావుగారంటారు.

చిత్తూరు నుంచీ ప్రారంభమైన యీ నవల మధ్యలో మధుర, తంజావూరు, తిరునల్వేలిలను గూడా పరామర్శించి మదరాసు నగరంలో ముగుస్తుంది. దక్షిణ భారతదేశమంతా ఏకాకీకృతంగా వ్యాపించిన కర్ణాటక సంగీతపు, నాట్యపు సాహిత్యపు ప్రపంచంలో కంచికి దగ్గరలోనే వున్న తొండనాడు ప్రాంతపు చిత్తూరుకున్న అవినాభావ సంబంధాన్నీ నవల గుర్తుకు తెస్తుంది. తెలుగూ- తమిళమూ స్నేహంగా చెట్టపట్టాలేసుకుని జీవించిన ప్రాంతాల్లో గొప్ప సంస్కృతీ, నాగరికతా పరిఢవిల్లాయని జ్ఞాపకం చేస్తుంది. కర్ణాటక సంగీతానికి ఆధునిక కాలంలో రాజధాని మదరాసు నగరమనీ, దాని మతాచార్యుడు కంచి

పరమాచార్య అనీ, దాని మాతృభాష మాత్రం తెలుగేననీ నొక్కి చెపుతుంది. యెన్నో భాషావిభేదాలతో తెలుగువాళ్లతో గొడవ పడిన తమిళులు తెలుగు కీర్తనలను భక్తితో, గౌరవంతో ఆరాధించారని తెలియజేస్తుంది.

దాదాపు వొక శతాబ్దకాలపు దేవదాసీల జీవిత గమనాన్ని చిత్రించే యీ నవల ప్రతీకాత్మకంగా స్త్రీ పురుషుల సంబంధాలనూ, పితృస్వామిక వ్యవస్థ లక్షణాలనూ, వ్యక్తికీ సమాజానికీ మధ్యవుండే సంబంధాలనూ, కళకూ కళాకారుడికీ మధ్య వుండే సంబంధాలనూ నాజూకుగా విశ్లేషించి మానవ జీవన యానాన్నంతా గమనించమని పాఠకుడిని మేల్కొల్పుతుంది. దేవదాసీలకు పితృస్వామిక వ్యవస్థ దుర్మార్గంగా నిర్మించియిచ్చిన స్వంత గది (Room of one's own)లో వాళ్ళు పరిపూర్ణమైన కళాకారులు కావడానికి తోడ్పడిన స్థితిగతుల్ని వివరిస్తుంది'. సామ్రాజ్యవాద, సామ్రాజ్య వాదానంతరం కాలాల్లో (colonial and post colonial) దేశంలో జరిగిన మార్పులనంతా చిత్రించడం ద్వారా నవలను చరిత్రకొక కళాత్మకమైన ప్రత్యామ్నాయంగా రూపొందించవచ్చునని 'మనోధర్మ పరాగం' నవల నిరూపిస్తుంది.

ఇంతటి విశిష్టమైన చారిత్రక నవలను రచించి తెలుగు నవల ప్రతిష్ఠను మరింత పెంచిన రచయిత ఆచార్య మధురాంతకం నరేంద్రగారికి అభినందనలు.

– సంపాదకుడు

**తానా అంతర్జాతీయ తెలుగు కార్టూన్ పోటీలు 2023**

తెలుగు భాష, తెలుగు కార్టూన్ కీర్తిని విశ్వవ్యాప్తం చేసేందుకు అంతర్జాతీయ కార్టూన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకుడు ప్రసాద్ తోటకూర తెలిపారు. విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయం ఆడిటోరియంలో కార్టూన్ పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొలిసారిగా తానా అంతర్జాతీయ తెలుగు కార్టూన్ పోటీలు – 2023ను ఏర్పాటు చేసిందన్నారు. వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ, తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటేలా కార్టూన్లు పంపాలని తెలిపారు. పోటీల్లోని ఎంట్రీల నుంచి 12 అత్యుత్తమ కార్టూన్లను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.5,000, మరో 13 ఉత్తమ కార్టూన్లకు గాను ఒక్కొక్కరికీ రూ.3,000 చొప్పున మొత్తం 25 మందికి నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

ప్రపంచంలో ఎక్కడున్నా తెలుగు కార్టూనిస్టులు పోటీల్లో పాల్గొనవచ్చని, ఒక్కొక్కరి నుంచి మూడు కార్టూన్లను స్వీకరిస్తామని తెలిపారు. ఎంట్రీలను 300 రిజల్యూషన్ జేపీఈజీ ఫార్మేట్‌లో tanacartooncontest23@gmail.comకు ఈ నెల 26లోగా పంపాలన్నారు. ఫలితాలను జనవరి 15న సంక్రాంతి రోజు ప్రకటిస్తామని చెప్పారు. వివరాల కోసం 9154555675, 9885289995 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కవిత

# పదయాత్ర

అమ్మ చనుబాలలో ఆముదం కలిపి
ప్రియమార తాపిన ఉగ్గు రుచి
ఉంగా ఉంగా ఊసుల రుచి
శిశువు పెదవంచులకు అంటుకున్న
మురిపాల ముచ్చట్ల ముద్దు రుచి
మమతల రుచులన్నీ మాతృ కానుకలే!

మన్ను మిన్ను నీరు నిప్పు గాలి
ప్రకృతి ప్రసాదాలన్నీ విలువైనవే..
కన్నపేగు వరమిచ్చిన
శబ్దం సంజ్ఞ అక్షరం కూడా!

తూరుపు కొమ్మకు
నారింజ పువ్వు పూసినట్టు
తొలెరుక నుండి సహజంగా అబ్బిన
భావ ప్రసార విద్య అమ్మభాషే!

ఎన్ని శాస్త్రాలను కావ్యాలను శోధించినా
ఎన్ని ప్రాంతాలను పురాణాలను గాలించినా
లిపిగల భాషల్లో కానీ
లిపి లేని భాషల్లో కానీ దేనిలో వెదికినా
గుండెను తడితడిగా అనువదించగల
పలుకుబడులూ నానుడులన్నీ
తొలిపలుకుల తల్లి అడుగు జాడల్లోనే!

ఆస్తినీ ఆచారాలనూ భద్రంగా
వారసులకు అప్పగించినట్టు
అమ్మభాషనూ నుడికారాన్నీ
చమురు చేసి వాక్యాలను వొత్తి చేసి
సొంత అస్తిత్వ దీపాలను
వెలిగించుకోవాలి

అప్పు అనలేని జన్మ ఋణాన్ని
అక్షరాలా తీర్చుకోవడానికి
సొంతభాషలో నిత్యం
వాడుక వారధి పైన
పదాలతో పాదయాత్ర చేయాలి

కంచరాన భుజంగరావు
9441589602

## పుస్తక పరిచయం

# 'సుబ్బయ్యగారి మేడ'




రచయిత:
వీరమాచనేని ప్రమోద్ కుమార్
వెల: రూ.199
ప్రతులకు:
వి. శ్రీనివాసరాయ్
బి-3, 3వ అంతస్తు డోర్.నెం. 40-5-19/4
అన్నపూర్ణ రెసిడెన్సీ, టిక్కిల్‌రోడ్
విజయవాడ-10
మొబైల్:
91773 07975
73967 64419

**ప్రతీ** మనిషికి, ప్రతీ ఊరికి ఖచ్చితంగా ఒక నేపథ్యం ఉంటుంది. అంతెందుకు చెట్టుకి పుట్టకి; రాయి రప్పలకు కూడా ఒక కథ ఉంటుంది. దానినే మనం మూలాలు అంటాము. అయితే మనిషి తన మూలాలను వెతుకుతూనే ఉంటాడు. లేదా తెలిసినా కూడా చెప్పుకునేంత లేదులే అనుకుంటాడు. అయితే కొందరు మాత్రం తమ వంశచరిత్రను లేదా వంశ మూలాలను (మూల పురుషుడి) చరిత్రను యదార్థానికి, కల్పనలకు ఏమాత్రం తేడా తెలియకుండా ఒక కథానికగానో లేక నవలగానో వ్రాస్తారు. ఆ కోవకు చెందినదే వి. ప్రమోద్ కుమార్ వ్రాసిన 'సుబ్బయ్యగారి మేడ'.

ఎక్కడో కళింగ యుద్ధం జరగడం ఏమిటి 'వీర' బిరుదును అందుకున్న మాచన్న దొర అజమాయిషీలోని దెందులూరే నేటి ప॥గో॥జిల్లాలోని దెందులూరు కావడం ఏమిటి. ఒక జమీందారీ కుటుంబానికి, చెందిన కొల్లిపర వంశీయుల కథను అల్లుతూనే రచయిత తమ వంశ మూలపురుషుడి కథను మన ముందు ఉంచడం కల్పనకు యదార్థానికి ఒక చిన్న గీతే అడ్డు అన్నట్లు ఉంది.

జమీందారీ హయాంలో ఎంతో కొంత దానధర్మాలు, విందులు వినోదాలు, క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలు ఇలా ఎన్నో సందర్భాలను చాలా రమణీయంగాను, హృద్యంగాను స్పృశించారు ప్రమోద్. మరీ ముఖ్యంగా పండుగలకు, సాంప్రదాయాలకు తిలోదకాలు వదిలిన నేటి యాంత్రిక జీవిత విధానానికి అలవాటుపడిన నేటి తరం వారికి వెన్నెల నీడలో జరిగే చెడుగుడు పోటీలు, పల్లెలలో జరిగే సంక్రాంతి సంబరాలను, దాని ప్రాశస్త్యాన్ని చాలా అందంగా చిత్రీకరించారు చలనచిత్ర నిపుణులు అయిన ప్రమోద్ కుమార్.

పాత్రలు, వాటి ఔచిత్యాలు; సన్నివేశాలు, ఆ సందర్భాలలోని ఆర్ద్రతలు; మనుషులు వారి నుడికారాలను ఎంతో పొందికగా అమర్చినతీరు అద్భుతం. విషాద సన్నివేశాలు, ఆసక్తికర సంఘటనలను మనం చూస్తే ఇవి నిజంగానే జరిగాయా లేక కల్పితాలా అనుకునేలోగానే మన పరిసరాలలో జరిగే సంఘటనలకు అద్దం పట్టినట్టుండి మనలను ఊరడిస్తూ ఉంటాయి.

పట్టుమని పదినిమిషాలు కూడా పరాయి భాష శబ్దాలను అరువుతెచ్చుకోకుండా మాతృభాషలో మాట్లాడలేని, వ్రాయలేని నేటి రోజుల్లో ఇటువంటి చారిత్రక నేపథ్యంతో కూడిన కథానికలు రావడం ఎంతో ముదావహం. కథలో, కథనంలో తనదైన శైలిని చూపించిన రచయితకు ధన్యవాదాలు. చరిత్రలో ముందుతరాలు చేసిన నెత్తుటి మరకలను దెప్పిపొడుస్తూనే వాటికి పర్యవసానాలను కూడా 'వీరుల బావి' అనే సందర్భాన్ని సమయోచితంగా చిత్రీకరించిన తీరును గర్వించాలి. రాజుల సొమ్ము రాళ్ళపాలు అన్నట్లు మన కళ్ళెదురుగా నేటికి దెందులూరు గ్రామానికే మకుటాయమానంగా నిలిచివున్న మన కథా వస్తువు 'సుబ్బయ్యగారి మేడ' మాత్రం యదార్థం. చదవండి. ఆస్వాదించండి. పరకాయ ప్రవేశం చేసి మనం ఎక్కడ ఉన్నామో తెలుసుకుందాం.

– పోతుకూచి కుమార్






2022 నవంబరు 27 న తిరుపతిలో ఆర్‌సి కృష్ణస్వామిరాజు కథల సంపుటి 'రాజనాల బండ' పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఎస్వీ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు గార్లపాటి దామోదర నాయుడు, నాగోలు కృష్ణారెడ్డి, తోట వెంకటేశ్వర్లు, శ్రీపద్మావతి డిగ్రీకళాశాలతెలుగు విభాగాధిపతి డా॥ వి.కృష్ణవేణి పాల్గొన్నారు.

# నేటి సమాజానికి ఆదర్శం రావూరి అర్జునరావు గారి జీవితం



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, నాస్తికోద్యమ నాయకులు, కులరహిత సమసమాజం కొరకు అహర్నిశలు కృషిచేసి, ఇటీవలే వైవాహిక జీవితానికి వజ్రోత్సవం చేసుకున్న శ్రీ రావూరి అర్జునరావు హైదరాబాద్‌లో డిసెంబరు 25న తుదిశ్వాస విడిచారు. వారి వయస్సు 106 సం॥లు వీరి భార్య శ్రీమతి మనోరమ, నాస్తికోద్యమ నిర్మాత గోరా ప్రథమ కుమార్తె. వీరికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె. అర్జునరావు మృతికి గాంధేయవాదులు, వివిధ రంగాల ప్రముఖులు ఎందరో తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వారి అర్థాంగి మనోరమ గారికి, కుటుంబ సభ్యులకు మా సంతాపాన్ని తెలియజేస్తున్నాము.

సామాజిక చైతన్యంతో ఉద్యమ జీవితాన్ని గడుపుతూ 106 సంవత్సరాలు ఆరోగ్యంగా జీవించడం ఎంతో అరుదైన సంగతి. ఆ ప్రత్యేకత రావూరి అర్జునరావుగారిది. ఆయనపై గోరా గారి ప్రభావం ఎంతో ఉంది. గాంధేయ సిద్ధాంతాలకు అనుగుణంగా జీవితాన్ని కొనసాగించడమే కాక తన గురువు గోరాగారి ప్రేమను పొంది, గాంధీ గారి ఆశ్రమంలో అందరి ఆశీస్సులతో గోరా గారి పెద్ద కుమార్తె మనోరమ గారిని వివాహమాడడం ఆయన జీవితంలో గొప్ప మలుపు. వీరికి 105 ఏళ్లు నిండిన సందర్భంగా ఏప్రిల్ 2022 అమ్మనుడి పత్రికలో ఒక పరిచయ వ్యాసాన్ని ప్రచురించాము కూడా. సమకాలీన సమాజానికే కాక, భావితరాలకు కూడా ఆదర్శంగా అర్జునరావు గారు జీవించారు.

–సంపాదకుడు

# ఆంధ్రప్రదేశ్‌లోని రాష్ట్రప్రభుత్వ శాఖల్లో తొలిసారిగా పూర్తిస్థాయిలో తెలుగును అమలుచేస్తున్న రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ ఆర్. మహబూబ్ బాషా



అంతరాత్మ ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ శాఖల్లో ఉత్తర్వులను తెలుగులోనే జారీచేయాలని క్రీ.పూ. 400 సంవత్సరాల నుండి ఉనికిలో ఉన్న అత్యంత ప్రాచీనమైన తెలుగుభాషను అమలుచేయాలని పదే పదే ఉత్తర్వులు ప్రభుత్వం జారీచేయటమేగానీ, ఆచరణలో ఇప్పటివరకు అమలుకాలేదు. తొలిసారిగా రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ శ్రీ ఆర్. మహబూబాషా రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ గా బాధ్యతలు స్వీకరించిన 50రోజుల్లోనే గత 30 రోజులుగా సమాచార కమీషన్ తెలుగును పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు. స.హ చట్టం క్రింద ఫిర్యాదుదారులకు (నోటీసులను) విచారణాతాఖీదులను తెలుగులోనే జారీచేస్తున్నారు. కమీషన్ ఉత్తర్వులు కూడా తెలుగులోనే జారీచేస్తున్నారు. కార్యాలయ (ఉత్తర్వులను) కార్యాలయ ఆదేశములు కూడా తెలుగులోనే జారీచేస్తున్నారు. సమాచార కమీషన్లోని ప్రధాన సమాచార కమీషనర్,



కమీషనర్లు, మిగతా సిబ్బంది గత 30 రోజులుగా తెలుగు టైపు ప్రాక్టీస్ చేస్తున్నారు. "దేశభాషలందు తెలుగులెస్స" అన్న కృష్ణదేవరాయుల 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని పిలువబడే తెలుగును అక్షరాల అమలు చేస్తున్న రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ శ్రీ ఆర్. మహబూబ్ బాషా అభినందనీయులు. తెలుగుభాషను రాష్ట్ర సచివాలయంలో గానీ, రాష్ట్ర హైకోర్టులో గానీ మానవహక్కుల కమీషన్లో గానీ, లోకాయుక్త కార్యాలయంలో గానీ, గవర్నరు కార్యాలయంలో గానీ ఎక్కాడా అమలు చేయటం లేదు.

అంతరాత్మ, దినపత్రిక 30-12-2022





**అద్వైతాచార్య అప్పయ్య దీక్షితులు**
రచన: రావినూతల శ్రీరాములు
పుటలు:47
ప్రతులకు: ఎన్.వి.రమణకుమార్
e-mail: nvrk90@gmail.com




**అమృత భారతి** (వ్యాస సంకలనం)
(75 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో తెలుగువారి ప్రగతి)
పుటలు:304 వెల:రూ.300
ప్రచురణ: ప్రపంచ తెలుగు రచయిత సంఘం, విజయవాడ
ప్రతులకు: శ్రీ గాజుల సత్యనారాయణ
విజేత బుక్స్, విజయవాడ.
సెల్: 9848687652


Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# ప్రపంచ తెలుగు రచయితల 5వ మహాసభలు

## వేదిక : పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల అడిటోరియం, విజయవాడ










ప్రపంచ తెలుగు రచయితల 5వ మహాసభలు విజయవాడలో ఘనంగా జరిగాయి. దేశ విదేశాల నుండి 1600 మంది ప్రతినిధులు తరలివచ్చి, తెలుగుభాషా పరిరక్షణ బాధ్యత తీసుకోవలసిందిగా జనబాహుళ్యాన్ని ఏకగ్రీవంగా కోరిన సమాచారం ప్రజలకు చేరిందనీ సభల నిర్వాహకులు ప్రకటించారు. సభలను ప్రారంభించి తమ భాషోద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుపోవలసిన అవసరాన్ని పూర్వ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు నొక్కి చెప్పగా సుప్రీమ్‌కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ తెలుగును ఆధునీకరించి, సాంకేతిక ప్రగతితో అనుసంధానించడం ద్వారా తెలుగును ప్రపంచ తెలుగుగా తీర్చిదిద్దాలన్నారు. ఎన్ని ఇతర భాషలను ప్రోత్సహించినా మాతృభాషకు ప్రాధాన్యత తగ్గకూడదని ఆం.ప్ర. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి అన్నారు. ఇంకా సభలో అనేక రంగాల ప్రముఖులు, రచయితలు, కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు, భాషోద్యమకారులు, పాల్గొన్నారు. సంఘ గౌరవాధ్యక్షులు డా॥ మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షులు శ్రీ గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డా॥ జి.వి.పూర్ణచందు, వారి సహచరులు ఈ సభను ఘనంగా నిర్వహించారు. కొన్ని ముఖ్య ప్రసంగాలను లోపలి పుటలలో చదవండి.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
JANUARY 2023 Vol :8, Issue 10
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో...

నాణ్యమైన ఉత్పత్తులకు...
నమ్మకమైన సర్వీసుకు...

Kumar®

52 1971-2023 YEARS OF EXCELLENCE

AN ISO 9001 : 2015 QMS CERTIFIED COMPANY
PUMPS & MOTORS
SUPERIOR QUALITY • SUPERIOR VALUE



అరుణజ్యోతి డిస్ట్రిబ్యూటర్స్

| చెన్నై | సికింద్రాబాద్ | విశాఖపట్టణం |
|---|---|---|
| Cell : 93812 99777 | Cell : 94907 59500 | Cell : 94907 59511 |

| తెనాలి | నెల్లూరు | విజయవాడ | తిరుపతి |
|---|---|---|---|
| Cell : 94907 59522 | Cell : 94907 59544 | Cell : 99663 55111 | Cell : 94907 59519 |

e-mail : marketing@kumarpumps.co.in visit : www.kumarpumps.co.in

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244